
సంతానలక్ష్మిగా కనకమ్మ



వన్‌టౌన్, న్యూస్‌టుడే: దేవీ శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా కనకమహాలక్ష్మి అమ్మవారు సోమవారం సంతానలక్ష్మిగా భక్తులకు దర్శనమిచ్చారు. అమ్మవారికి కలువ పువ్వులను నివేదించారు. నగరానికి చెందిన మద్దినేని సురేశ్, మాధవి దంపతులు రూ.45 వేలతో కలువ పువ్వులను సమకూర్చి పూజలు జరిపారు. ఆలయ ఈఓ శోభారాణి, ఏఈఓ తిరుమలేశ్వరరావు, పర్యవేక్షకులు తిరుపతిరావు, పద్మజ పాల్గొన్నారు.

ఏయూ దూర విద్యా కేంద్రంలో ఇద్దరు అసోసియేట్ డైరెక్టర్ల నియామకం

ఏయూ ప్రాంగణం, న్యూస్‌టుడే: ఆంధ్ర విశ్వవిద్యాలయం దూర విద్యా కేంద్రంలో ఇద్దరు అసోసియేట్ డైరెక్టర్లను నియమించారు. ఈ మేరకు ఉత్తర్వులు వెలువడ్డాయి. కేంద్రం సంచాలకులు ఆచార్య ఎన్.విజయమోహన్ అభ్యర్థన మేరకు ఈ నియామకాలు చేపట్టినట్లు తెలిసింది. దూర విద్యా కేంద్రం పరిధిలో సుమారు 75 వేల మంది విద్యార్థులు ఉండడంతో అదనంగా ఇద్దరు అసోసియేట్ డైరెక్టర్ల కావాల్సి ఉందని కోరగా.. సైన్స్ విభాగం నుంచి సీనియర్ అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ సిద్ధయ్య, మెకానికల్ ఇంజినీరింగ్ విభాగం నుంచి డాక్టర్ శ్రీనివాసరావును నియమించారు.

ప్రతి బోగీ కిటకిట





దసరా నేపథ్యంలో విశాఖ నుంచి వెళ్లే రైళ్లు కిటకిటలాడుతున్నాయి. జనరల్ బోగీల్లో కాలు పెట్టేందుకు కూడా వీలవడం లేదు. పిల్లలు, వృద్ధులతో వెళ్లే వారికి యాతన తప్పడం లేదు. సోమవారం మధ్యాహ్నం రత్నాచల్ వద్ద రద్దీని చిత్రాల్లో చూడొచ్చు. –ఈనాడు, విశాఖపట్నం

ఆ ఏడు గంటలూ... ఉత్కంఠే!

★ 18 రోజుల ఆడ శిశువు అదృశ్యంతో కలకలం
★ పోలీసుల విచారణలో వాస్తవాలు వెలుగులోకి
★ విశాఖ నుంచి అర్ధరాత్రి కశింకోటకు తీసుకెళ్లిన వైనం
★ ఎట్టకేలకు గంటల వ్యవధిలో తల్లిదండ్రుల చెంతకు చేరిక

విశాలాక్షినగర్, న్యూస్‌టుడే

విశాఖ నగరంలో 18 రోజుల పసికందు అదృశ్యమైన ఘటన కలకలం రేపింది. ఏడు గంటలు కొనసాగిన హైడ్రామా అనంతరం పసి పాప క్షేమంగా తల్లి చెంతకు చేరడంతో అంతా ఊపిరి పీల్చుకున్నారు. ఆరిలోవ సీఐ గోవింద రావు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. దొక్కా చంటి భవాని, శివ దంపతులు విశాఖలోని కేంద్రకారాగానికి ఎదురుగా ఉన్న రామకృష్ణాపురంలో నివాసముంటున్నారు. వీరికి 18 రోజుల కిందట ఆడపిల్ల పుట్టింది. ఆదివారం అర్ధరాత్రి చంటి భవాని పక్కన నిద్రిస్తున్న పాప కనిపించటం లేదని శిశువు అమ్మమ్మ ముువ్వల మంగ గగ్గోలు పెట్టడంతో స్థానికులంతా అక్కడికి చేరుకున్నారు. ఎంత వెతికినా ఆచూకీ లభించకపోవడంతో పోలీస్ కంట్రోల్‌రూంకు ఫోన్ చేశారు. ఆ తరువాత జరిగిన పరిణామాలతో చిన్నారి ఆచూకీ తెలిసి కథ సుఖాంతం అయింది.



విశువుతో తల్లి, అమ్మమ్మ



వివరాలు తెలియజేస్తున్న ఆరిలోవ సీఐ గోవిందరావు

ఆర్థిక పరిస్థితి నేపథ్యంలో...

చంటి భవాని, శివలకు తొలి సంతానం ఆడపిల్ల. పెయింటింగ్ పనులు చేసే శివ కుటుంబ ఆర్థిక పరిస్థితి బాగోలేకపోవడంతో... మళ్లీ ఆడపిల్ల పుడితే కశింకోట మండలం ఏఎస్‌పేటకు చెందిన బంధువైన నాగఅప్పారావు దంపతులకు ఇచ్చేలా ముందే మాట్లాడుకున్నామని శిశువు అమ్మమ్మ మంగ తెలిపారు. 'పాప పుట్టాక నా అల్లుడు మనసు మార్చుకుని ఇవ్వటానికి అంగీకరించలేదు. దీంతో బంధువుల ఒత్తిడి మేరకు ఆదివారం అర్ధరాత్రి ఒంటిగంట సమయంలో వారికిచ్చి పంపించేశా. కుమార్తె, అల్లుడు కోపగించుకుంటారని కుక్క ఎత్తుకుపోయినట్లు చెప్పా. రెండురోజులు తరువాత చెబుదామని అనుకున్నా. ఇంతలోనే ఇదంతా జరిగింది' అని ఆమె పేర్కొన్నారు.

ఏ సమయానికి ఏం జరిగిందంటే

ఆదివారం సాయంత్రం 6.00 శిశువు అమ్మమ్మ అనకాపల్లి జిల్లా కశింకోట మండలంలోని నాగ అప్పారావు దంపతులకు ఫోన్ చేశారు. అర్ధరాత్రి విశాఖ రావాలని చెప్పారు. అందరూ నిద్రించిన తరువాత పాపను అప్పగిస్తానని వివరించారు.

అర్ధరాత్రి 1.00 రామకృష్ణాపురం వచ్చిన నాగ అప్పారావు కుటుంబీకులు శిశువును తీసుకొని వెళ్లిపోయారు.

2.00 గంటలకు ఇంట్లో తల్లి దొక్కా చంటి భవాని పక్కన నిద్రిస్తున్న పసిపాప కనిపించటం లేదని మంగ గగ్గోలు పెట్టారు. స్థానికులు చుట్టుపక్కల వెతకడం ప్రారంభించారు. ఆచూకీ తెలియక పోవటంతో పోలీస్ కంట్రోలు రూంకు ఫోన్ చేశారు.

2.30 గంటలకు ద్వారకా జోన్ ఏసీపీ రాంబాబు ఆరిలోవ పోలీస్‌స్టేషన్ సిబ్బందిని అప్రమత్తం చేశారు. ఆరిలోవ సీఐ గోవిందరావు, ఎస్సైలు కృష్ణ, రామదాసు, సిబ్బందితో కలిసి రామకృష్ణాపురం పరిసర ప్రాంతాల్లో వెతికినా ఫలితం కనిపించలేదు.

3 గంటల నుంచి 3.30 ఏసీపీ రాంబాబు స్వయంగా రంగంలోకి దిగారు. గ్రామానికి ఆనుకుని ఉన్న చెరువు, డంపింగ్ యార్డు ప్రాంతాల్లో స్థానికులతో కలిసి వెతికారు.

సోమవారం తెల్లవారు జామున 4.00 ఎంతకీ పసిపాప ఆచూకీ తెలియక పోవటంతో పోలీసులు కుటుంబ సభ్యులతో మాట్లాడారు. పలు అనుమానాల నేపథ్యంలో తమదైన శైలిలో విచారించారు.

తెల్లవారు జామున 5.00 కశింకోట మండలం ఏఎస్ పేట గ్రామానికి చెందిన దగ్గరి బంధువులకు పెంచుకునేందుకు ఇచ్చినట్లు ముువ్వల మంగ తెలియజేయడంతో విషయం బయటకొచ్చింది. ఆమె చెప్పిన చిరునామాకు ఐదు గంటలకు ముగ్గురు కానిస్టేబుళ్లతో కూడిన బృందాన్ని పంపించారు.

సోమవారం ఉదయం 6.00 శిశువును, శిశువును తీసుకువెళ్లిన వారిని కానిస్టేబుళ్లు ఆరిలోవ పోలీసుస్టేషన్‌కు తీసుకుని వచ్చారు. **7గంటల నుంచి 9గంటల వరకు విచారణ చేసిన అధికారులు** పూర్తివివరాలు సేకరించి ఒక అంచనాకు వచ్చారు. పసిపాప తల్లిదండ్రులకు సమాచారం ఇచ్చారు. వాస్తవాలు నిర్ధారించుకున్నాక వారికి అప్పగించారు.

భారీ మీనం... రెక్కలు ఘనం



విశాఖ మత్స్యకారులకు సోమవారం సాగరంలో 'కొమ్ముకోనం' చేపలు భారీగా లభించాయి. విశాఖపట్నం నుంచి కేరళకు రవాణా నిమిత్తం వాటిని ముక్కలు ముక్కలుగా కోశారు. కొన్ని చేపల రెక్కలు భారీగా పెరగడంతో జెట్టీల వద్దకు వచ్చిన పలువురు కొనుగోలుదారులు ఆసక్తిగా తిలకించారు. – ఈనాడు, విశాఖపట్నం

ఉపకరణం... ఇలా ఉపయోగకరం!!





విశాఖపట్నం వుడా బాలల ప్రాంగణంలో సోమవారం దివ్యాంగులు, వృద్ధులకు ఉపకరణాల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. పెద్ద సంఖ్యలో లబ్ధిదారులు పాల్గొన్నారు. నడవలేని కొందరికి సరికొత్త పరికరాలు అందించారు. 'ఊత కర్ర పట్టుకొని నడిచి వెళ్తూ.. మార్గ మధ్యలో అలసట కలిగితే అదే కర్రని కుర్చీలా మార్చుకొనే పరికరం' కూడా ఇందులో ఉంది. అది ఏవిధంగా పనిచేస్తుందో ఈ వృద్ధుడు చూపించారు. – ఈనాడు, విశాఖపట్నం

విశాఖ-శ్రీకాకుళం రోడ్ మధ్య ప్రత్యేక రైలు

రైల్వేస్టేషన్, న్యూస్‌టుడే: దసరా, పైడితల్లి సిరిమానోత్సవాల సందర్భంగా ప్రయాణికుల రద్దీని దృష్టిలో ఉంచుకొని ఈ నెల 10వ తేదీ నుంచి 16వ తేదీ వరకు విశాఖ-శ్రీకాకుళం రోడ్-విశాఖ (08529- 08530) ప్రత్యేక మెమో రైలు నడపనున్నట్లు వాల్తేర్ సీనియర్ డీసీఎం కె.సందీప్ తెలిపారు. ఈ రైలు ఉదయం 10 గంటలకు విశాఖలో బయలుదేరి సింహాచలం, కొత్తవలస, విజయనగరం, చీపురుపల్లి, పొందూరు మీదుగా మధ్యాహ్నం 12.30 గంటలకు శ్రీకాకుళం రోడ్‌కు చేరుకుంటుంది. తిరుగు ప్రయాణంలో మధ్యాహ్నం 1.30 గంటలకు శ్రీకాకుళం రోడ్‌లో బయలుదేరి మధ్యాహ్నం 3.55 గంటలకు విశాఖ చేరుకోనున్నట్లు తెలిపారు. ప్రయాణికులు ఈ రైళ్ల సేవల్ని వినియోగించుకోవాలని కోరారు.

లులు చూపు.. విశాఖ వైపు!

★ నాడు కేటాయించిన స్థలం అమ్మకానికి యత్నించిన జగన్
★ ఎమ్మెల్యే వెలగపూడి కేసుతో ఆగిన ప్రక్రియ
★ నేడు అదే చోట ఏర్పాటుపై ఆశలు

బీచ్ రోడ్డులో గతంలో తెదేపా హయాంలో లులు గ్రూప్‌నకు కేటాయించిన స్థలం



ఈనాడు, విశాఖపట్నం

ఏపీలో పెట్టుబడులు పెట్టేందుకు 'లులు' గ్రూప్ మళ్లీ ఆసక్తి చూపుతోంది. దీంతో పాటు మరికొన్ని కంపెనీలు కూడా విశాఖ వైపు చూస్తున్నాయి. ఫలితంగా కొత్త మాల్స్, మల్టీప్లెక్సులు రానున్నాయి. ప్రభుత్వం యూనిటీ మాల్ మధురవాడలో ఏర్పాటుకు నిర్ణయించింది. త్వరలో ఇవన్నీ కార్యరూపంలోకి తెచ్చేందుకు కూటమి ప్రభుత్వం ప్రణాళికలు రచిస్తోంది. లులు సంస్థ ఛైర్మన్ ఇటీవల సీఎం చంద్రబాబును కలిసి పలు అంశాలపై చర్చించారు. ఈ నేపథ్యంలో లులుకు గతంలో కేటాయించిన స్థల అంశం మళ్లీ తెరమీదికి వచ్చింది. గత వైకాపా ప్రభుత్వం లులును రాష్ట్రం నుంచి తరిమేయడమే కాకుండా ఆ స్థలాన్ని విక్రయించాలని చూసింది. దీనిపై ఎమ్మెల్యే వెలగపూడి రామకృష్ణబాబు న్యాయపోరాటం చేయడంతో ఆ ప్రక్రియ నిలిచిపోయింది.

బీచ్ రోడ్డు సమీపంలో టౌన్ సర్వే నంబరు 1011/1ఏ1, ఏ2 లోని 13.83 ఎకరాల ఏపీ పారిశ్రామిక మౌలిక వసతుల కల్పనాభివృద్ధి సంస్థ (ఏపీఐఐసీ) స్థలాన్ని 2018లో లులుకు ఇచ్చేందుకు నాటి తెదేపా ప్రభుత్వం గుర్తించింది. అయితే 2020లో వైకాపా ప్రభుత్వం విశాఖలోని విలువైన కొన్ని ఖాళీ ప్రభుత్వ స్థలాలను అమ్మకానికి పెట్టింది. ఇ-వేలం ద్వారా ఎలా ఉన్న స్థలాన్ని అలానే అమ్మేలా కొనుగోలుదారుల నుంచి బిడ్లు ఆహ్వానించింది. ఆ సమయంలోనే ప్రభుత్వ భూములను ప్రజావసరాల కోసం వినియోగించాలని హైకోర్టును ఆశ్రయిస్తే కోర్టు దానికి అనుకూలంగా తీర్పు ఇచ్చింది.

వీఎంఆర్‌డీఏకు అప్పగించినా...

కోర్టులో కేసులు నడిచినా వైకాపా ప్రభుత్వం అమ్మకం ప్రక్రియ ఆపలేదు. ఎలాగైనా ముందుకువెళ్లాలనుకుంది. అప్పటి వరకు ఏపీఐఐసీ చేతిలో ఉన్న ఆ స్థలాన్ని వీఎంఆర్‌డీకు అప్పగించేలా నిర్ణయం తీసుకుంది. రూ.1000 కోట్లకు ఆ స్థలాన్ని అమ్మి ఖజానాకు డబ్బు సమకూర్చాలని నాటి ప్రభుత్వం ఆదేశించింది. ఆ తర్వాత ఈ ప్రక్రియను ముందుకు తీసుకువెళ్లలేకపోయారు. ఎమ్మెల్యే రామకృష్ణబాబు మరికొందరి న్యాయపోరాటంతో విలువైన ప్రభుత్వ స్థలం ప్రైవేటుపరం కాకుండా ఆగింది. బీచ్ రోడ్డులో అంతటి విలువైన స్థలం లభించాలంటే చాలా కష్టం. ఆ 13 ఎకరాలు ప్రభుత్వం కోల్పోతే తిరిగి రాదు. ప్రజావసరాల కోసం గుర్తించిన స్థలాన్ని అమ్మకానికి పెట్టడంపై అప్పట్లో తీవ్ర విమర్శలొచ్చాయి. ఇదే విషయాన్ని న్యాయస్థానం సమర్థించింది. ఆ స్థలం అందుబాటులో ఉండడంతో మాల్స్ ఏర్పాటుకు వీలు కలగనుంది.



అవే జిల్లాకు విలువైన ఆస్తులు: విశాఖలో విలువైన ఆస్తులను అమ్మేందుకు గత ప్రభుత్వం ప్రయత్నించింది. బహుళ ప్రయోజనాల కోసం వినియోగించాల్సిన భూములను విక్రయించడం తగదని న్యాయస్థానాన్ని ఆశ్రయించాం. బీచ్ రోడ్డులోని స్థలానికి వేలం నిర్వహిస్తే అడ్డుకున్నాం. జిల్లా శిక్షణ కేంద్రం, మరికొన్ని స్థలాలను అమ్మాలని చూసినా వాటన్నింటి మీద కేసులు వేసి ఆపాం. ఇప్పుడు అవే జిల్లాకు విలువైన ఆస్తులుగా మారాయి. – వెలగపూడి రామకృష్ణబాబు, ఎమ్మెల్యే

అరకు సందర్శించిన హైకోర్టు న్యాయమూర్తి

అరకులోయ పట్టణం, న్యూస్‌టుడే: అల్లూరి సీతారామరాజు జిల్లా అరకులోయలో రాష్ట్ర హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ హెచ్ఎస్‌జే రవినాథ్ తిల్హరీ కుటుంబసభ్యులతో కలసి సోమవారం పర్యటించారు. విశాఖ నుంచి రైలు మార్గంలో అరకులోయ చేరుకున్నారు. అక్కడ గిరిజన, కాఫీ మ్యూజియంలు సందర్శించారు. గిరిజన గ్రామాల నేపథ్యం, స్థానిక ఆహార్యం, సంప్రదాయాలు తెలుసుకున్నారు. అరకులోయ సమీపంలోని గంజాయిగుడ వద్ద ఉన్న గిరి గ్రామదర్శినిని సందర్శించారు. అక్కడ న్యాయమూర్తి దంపతులు గిరిజన సంప్రదాయం ప్రకారం వివాహం చేసుకున్నారు.



గిరిజన సంప్రదాయ వస్త్రధారణలో హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ హెచ్ఎస్‌జే రవినాథ్ తిల్హరీ దంపతులు

రూ. 20 కాదు... 30...40!

ఈనాడు, విశాఖపట్నం

★ అమాంతం పెరిగిన కూరల ధరలు
★ హడలిపోతున్న కొనుగోలుదారులు
★ నియంత్రణ చర్యలకు విన్నపాలు



గత కొన్ని రోజులుగా నగరంలో కర్రీపాయింట్లలో కూరలు కొనుగోలు చేసే వినియోగదారులు బెంబేలెత్తిపోతున్నారు. కూరగాయల ధరలు పెరిగిపోవడంతో కర్రీ పాయింట్ల నిర్వాహకులు ఒక్కసారిగా కూరలు, సాంబారు, రసం ధరలను అమాంతం పెంచేశారు. ప్యాకెట్ పరిమాణం ప్రకారం ఇవి పెరిగాయి.



కర్రీ పాయింట్ వద్ద కొనుగోలుదారులు

గతంలో ప్యాకెట్ ధర రూ.20లు ఉంటే.. ఇప్పుడు చాలా చోట్ల రూ.30 చేశారు. కొన్ని చోట్ల ఇది రూ.40 కూడా అయింది. గతంలో రూ.15, 20కి లభించే సాంబారు ఇప్పుడు రూ.30కి చేరింది. ఉల్లి, టమాట, అల్లం, వెల్లుల్లి ధరలు బాగా పెరగడంతో పెంచక తప్పలేదని వ్యాపారులు చెబుతున్నారు. ఇతర ప్రాంతాల నుంచి వివిధ అవసరాల నిమిత్తం నగరానికి వచ్చి వసతి గృహాల్లో, అద్దెకు ఉంటున్న ఎంతో మందికి కర్రీ పాయింట్లే ఆధారం. అక్కడే పరిస్థితి ఇలా ఉండటంతో జేబులు ఖాళీ అవుతున్నాయని వాపోతున్నారు.

రైతు బజార్లలో సోమవారం నాటి ధరలు (కేజీ-రూ.లలో)


కూరగాయ	ధర
పొడవు చిక్కుడు	64
టమాటా	64
దొండకాయ	56
వంకాయ	54
బీరకాయ	52
గోరు చిక్కుడు	38
క్యాప్సికం	66
మునగ	86
ఉల్లి	50
క్యారెట్	44
బెండకాయ	34
అల్లం	90
వెల్లుల్లి	280

నగరంలోని రైతుబజార్లు	నిత్యం అవసరం	ప్రస్తుతం వస్తున్నవి
13	5,000 క్వింటాళ్లు	4,000 క్వింటాళ్లు

దిగుమతి చేసుకునే రకాలు.. ఉల్లి, టమాట, బంగాళదుంప, క్యాప్సికం, క్యారెట్, మునగ, క్యాబేజీ, మిరప, బీట్‌రూట్, బీన్స్, చిక్కుడు

ఎందుకీ పరిస్థితంటే: వాస్తవానికి నగర ప్రజల అవసరాలకు స్థానికంగా పండించే పంటలు సరిపోవు. చాలా రకాలు ఇతర ప్రాంతాల నుంచి దిగుమతి చేసుకోవాల్సి ఉంటుంది. ప్రస్తుతం ఇతర ప్రాంతాల్లోనూ పంటల దిగుబడి పడిపోయింది. స్థానిక పంటలూ ఇటీవలి వర్షాలకు దెబ్బతిన్నాయి. మరో వైపు దసరా నేపథ్యంలో కాయగూరల వినియోగం కూడా పెరిగిపోయింది.

స్థానికంగా లభించేవి.. ఆకుకూరలు, ఆనప, బీర, బెండ, దొండ, కాకర బరబాటి




పెంచిన ధరలతో కూరల పట్టిక

నియంత్రించకపోతే

రానున్న రోజుల్లో ధరలు మరింత పెరిగే ప్రమాదం లేకపోలేదు. ప్రభుత్వం వీటిని నియంత్రించాల్సిన అవసరం ఉంది. ప్రస్తుతం పాత ఉల్లి కేజీ రూ.50కి అమ్ముతున్నారు. దిగుమతి ఆలస్యమైతే ఈ ధరలు మరింత పెరగొచ్చు. టమాట రెండు రోజుల కిందటి వరకు కేజీ రూ.74 ఉండేది. ఇప్పుడు రూ.64కి తగ్గేలా అధికారులు చర్యలు చేపట్టారు. ఇంకా తగ్గించేందుకు ఉన్న అవకాశాలు పరిశీలిస్తున్నారు. భవిష్యత్తులో నగరానికి సరిపడ రకాల దిగుమతిపై ప్రణాళిక చేయకపోతే కొరత ఏర్పడి ధరలు మరింత భారమయ్యే ప్రమాదం లేకపోలేదు.

వైకాపా కార్పొరేటర్‌పై రౌడీషీట్



విశాఖపట్నం, న్యూస్‌టుడే : జీవీఎంసీ 60వ వార్డుకు చెందిన వైకాపా కార్పొరేటర్ **పీవీ.సురేష్**పై రౌడీషీట్ తెరిచినట్టు మల్కాపురం పోలీసులు తెలిపారు. అయిదేళ్ల వైకాపా పాలనలో సొంత పార్టీ నాయకులపై బాహాటంగా విమర్శలు చేయడంతో పార్టీ నుంచి సస్పెండ్ చేశారు. ఎంపీ విజయసాయిరెడ్డి అనుచరుడిగా గుర్తింపు పొందడంతో.. ఆ సస్పెన్షన్ అమల్లోకి రాలేదు. బయట వ్యక్తులతో దురుసుగా ప్రవర్తించడం, దుర్భాషలాడడంతో ఆయనపై అనేక కేసులు నమోదయ్యాయి. సొంత పార్టీ నాయకుల ఫిర్యాదులతోనే నాలుగు కేసులు ఉన్నాయి. ఆయన ప్రవర్తన పార్టీ అగ్రనాయకులకు తలనొప్పిగా మారినా.. ఎప్పుడూ చర్యలు తీసుకోలేదు. ఎన్నికలకు ముందు పార్టీ అనుచరులు, నాయకులతో కలిసే ప్రచార కార్యక్రమాలు నిర్వహించారు. సమాజంలో శాంతిభద్రతలకు విఘాతం కలిగించే వారిపై చర్యలు తప్పవని పోలీసులు హెచ్చరిస్తూ.. రెండు రోజుల కిందటే రౌడీషీట్‌కు ఆదేశాలు జారీ చేశారు.

ఏయూలో విదేశీ విద్యార్థుల జోరు

ఏయూ ప్రాంగణం, న్యూస్‌టుడే: ఏయూలో విదేశీ విద్యార్థుల సంఖ్య గణనీయంగా పెరుగుతోంది. గత ఏడాది వెయ్యి మంది ఉండగా వారిలో సుమారు రెండు వందల మంది రిలీవ్ అయ్యారు. ఈ ఏడాది మరో 450 మంది చేరుతున్నారు. వీరిలో ఇప్పటికే 200 మంది వివిధ విభాగాల్లో చేరగా.. మరో 250 మంది చేరాల్సి ఉంది. దీంతో ఏయూలో విదేశీ విద్యార్థుల సంఖ్య 1250కి చేరనుంది. ప్రస్తుతం ఉన్నవారిలో 714 మంది పురుషులు కాగా.. 285 మంది మహిళలు. ఆఫ్రికన్ దేశాలతో పాటు అమెరికా, యూకే, యూఏఈ, సౌదీ అరేబియా, ఆస్ట్రేలియా దేశాల వారు ఇందులో ఉన్నారు. అధికంగా బంగ్లాదేశ్ నుంచి 91 మంది, ఇరాక్ నుంచి 90 మంది ఉన్నారు. విదేశీ విద్యార్థులతో వివిధ అంశాల్లో ఏయూ ర్యాంకింగ్ మెరుగవనుంది.

విజయ ప్రస్థానం @91

★ దేశంలోనే అగ్రగామిగా నిలిచిన విశాఖ పోర్టు
★ సరకు రవాణాలో సరికొత్త రికార్డులు

ఈనాడు-విశాఖపట్నం

విశాఖపట్నం పోర్టు అథారిటీ (వీపీఏ) సరకు రవాణాలో దూసుకుపోతోంది. 1933 అక్టోబర్ 7న తీరంలో మూడు బెర్తులతో ప్రారంభమైన పోర్టు... ప్రస్తుతం 23 ఇన్నర్, ఔటర్ బెర్తులతో 132 దేశాలకు సముద్ర ఉత్పత్తులను ఎగుమతి చేస్తూ దేశంలోనే అగ్రగామి పోర్టుల్లో ఒకటిగా నిలిచింది. వేగంగా అభివృద్ధి చెందుతూ ఏడాదికి 81.09 మిలియన్ మెట్రిక్ టన్నుల కార్గోను రవాణా చేసే స్థాయికి ఎదిగింది. 91 ఏళ్ల పూర్తయిన సందర్భంగా 8, 9 తేదీల్లో పోర్టు ఉద్యోగులతో కలిసి ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించనున్నారు.

★ గత ఆర్థిక సంవత్సరం రూ.17,983 కోట్లు విలువ చేసే 3.14 లక్షల టన్నుల సముద్ర ఉత్పత్తులను రవాణా చేసి విశాఖ పోర్టు దేశంలోనే మొదటి స్థానంలో నిలిచింది. సముద్ర ఉత్పత్తులు ఎగుమతిలో వనామీ రొయ్యలు ప్రధాన పాత్ర పోషించాయి.

రెండు అంతర్జాతీయ ర్యాంకులు: ప్రపంచ బ్యాంకు నిర్వహించిన కంటైనర్ పోర్టు పనితీరులో పోర్టు 20వ స్థానం, కంటైనర్ పోర్టు 19వ స్థానంలో నిలిచి రెండు అంతర్జాతీయ ర్యాంకులు దక్కించుకుంది. కంటైనర్ పోర్టు పనితీరులో 102 స్థానాలు ఎగబాకి ఏకంగా 19వ స్థానానికి చేరుకోవడం గమనార్హం.

నాడు



బెర్తుల వద్ద తొలి రోజుల్లో రవాణాకు వాడిన ఎడ్ల బండ్లు



విశాఖ పోర్టుకు వచ్చిన మొదటి కార్గో నౌక ఎస్ఎస్ జలదుర్గ

నేడు



ప్రస్తుతం పోర్టు బెర్తుల వద్ద కాంతులు

సరకు (కార్గో)రవాణా... మిలియన్ మెట్రిక్ టన్నులు	
2019-20 :	72.72
2020-21 :	69.84
2021-22 :	69.03
2022-23 :	73.75
2023-24 :	81.09

మాంగనీస్ దిగుమతిలో రికార్డు: 2024 మేలో 17 నౌకల ద్వారా 4.37లక్షల మెట్రిక్ టన్నుల మాంగనీస్ దిగుమతి చేసుకోవడం రికార్డు కాగా... జులైలో 15 నౌకల ద్వారా 5.66 లక్షల టన్నుల మాంగనీస్ దిగుమతి చేసి ఆ రికార్డు తిరగరాసింది. ఈ ఏడాది జులై 25న న్యూ కాసిల్ మాక్స్ లైన్ స్థాయి ఎంవీ హవైన్ భారీ నౌక 1,99,900 మెట్రిక్ టన్నుల మాంగనీస్‌తో విశాఖ పోర్టుకు చేరుకుంది. ఓడరేవుకు ఇప్పటి వరకు సరకుతో వచ్చిన అతిపెద్ద భారీ నౌక ఇదే.

వంద రోజుల ప్రణాళికలో: పునరుత్పాదక శక్తి (సోలార్) వినియోగంలో దేశంలోని ఇతర మేజర్ పోర్టులతో పోల్చితే విశాఖ మొదటి స్థానంలో నిలిచింది. సీఎన్‌జీ ఆధారిత బస్సులు, స్వీపింగ్ యంత్రాలు, అగ్నిమాపక వాహనాలు ఉపయోగిస్తున్నారు. వంద రోజుల ప్రణాళికలో భాగంగా విశాఖ పరిధిలో ఒక మిలియన్ మొక్కలు నాటేందుకు అడుగులు వేస్తున్నారు. రూ. 19.69కోట్లతో డబ్ల్యూక్యూ జంక్షన్ నుంచి ఎస్సార్ జంక్షన్ వరకు రోడ్డు విస్తరణ పూర్తి చేశారు. రూ.21 కోట్లతో ఈక్యూ-1 టెర్మినల్ వద్ద టీకేఎం ఎలక్ట్రిఫికేషన్ పనులు పూర్తి చేశారు. కార్యాచరణలో మూడు ప్రాజెక్టులకు శ్రీకారం చుట్టారు. ఏటా సరకు రవాణాలో 90 మిలియన్ మెట్రిక్ టన్నుల లక్ష్యంగా పెట్టుకున్నట్లు పోర్టు ఛైర్మన్ అంగముత్తు తెలిపారు.

ఎస్సీ ప్రాంతాల్లో సదుపాయాలపై నివేదిక సమర్పించండి



అధికారులతో సమీక్షిస్తున్న కలెక్టర్

వన్‌టౌన్, న్యూస్‌టుడే: వంద రోజుల ప్రణాళికలో భాగంగా జిల్లాలోని ఎస్సీ నివాస ప్రాంతాల్లో మౌలిక సదుపాయాల కల్పనకు గల కారణాలు, వెనుకబాటుతనం తదితర అంశాలను క్షేత్రస్థాయిలో సర్వే చేయించి నివేదిక సమర్పించాలని కలెక్టర్ హరేంధిర ప్రసాద్ అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్‌లో సోమవారం పలువురు అధికారులతో ఆయన సమావేశమయ్యారు. నివేదికను ఈ నెల 15లోగా రాష్ట్ర ప్రభుత్వానికి నివేదించాల్సి ఉంటుందన్నారు. ఎస్సీ ఆవాస ప్రాంతాల్లో సర్వే చేసి ఆ వివరాలను ప్రణాళిక, ప్రభుత్వ వెబ్‌సైట్‌లో నమోదు చేయాలని అధికారులను ఆదేశించారు. జీవీఎంసీ కమిషనర్ సంపత్‌కుమార్, సాంఘిక సంక్షేమశాఖ డీడీ రామారావు, పంచాయతీరాజ్, గృహ నిర్మాణ శాఖ అధికారులు పాల్గొన్నారు.

పీజీఆర్ఎస్‌లో 208 అర్జీలు రాక

వన్‌టౌన్, న్యూస్‌టుడే: కలెక్టరేట్‌లో సోమవారం నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక(పీజీఆర్ఎస్)లో 208 అర్జీలు స్వీకరించారు. కలెక్టర్ హరేంధిర ప్రసాద్, జేసీ మయూర్ అశోక్, డీఆర్వో మోహన్‌కుమార్, ఆర్డీఓ పి.శ్రీలేఖ ఫిర్యాదులను స్వీకరించారు. పింఛన్లు, గృహాలు, రుణాలు వంటి వ్యక్తిగత అంశాలపై అధికంగా అర్జీలు వచ్చాయి. మొత్తం ఫిర్యాదుల్లో రెవెన్యూ 91, జీవీఎంసీ 73, పోలీసు 15, ఇతర విభాగాలకు 29 చొప్పున వచ్చాయి. ప్రజా వినతులను సంతృప్తికర స్థాయిలో పరిష్కారం చూపాలని అధికారులను కలెక్టర్ ఆదేశించారు. మండల స్థాయి అధికారులంతా సోమవారం తప్పనిసరిగా మండల కేంద్రాల్లో ఉండాలన్నారు. సీఎంఓలో నమోదయ్యే ఫిర్యాదులను నిర్ణీత గడువులోపు పరిష్కరించాలన్నారు. ఈ-ఆఫీస్ విధానాన్ని అనుసరించాలని, అంతర్గత శాఖల వారీ సమస్యలుంటే పరిష్కరించుకోవాలన్నారు.



అర్జీలు స్వీకరిస్తున్న కలెక్టర్ హరేంధిర ప్రసాద్

'సుభోజనం' వసతి కేంద్రం ప్రారంభం



'సుభోజనం' వసతి కేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే వంశీకృష్ణ శ్రీనివాస్, చిత్రంలో ఆసుపత్రి పర్యవేక్షక వైద్యాధికారి డాక్టర్ శివానంద, ఏఎంసీ ప్రిన్సిపల్ బుచ్చిరాజు తదితరులు

వన్‌టౌన్, న్యూస్‌టుడే: కేజీహెచ్‌కు వచ్చే రోగుల సహాయకులకు రూ.10కే రుచికరమైన భోజనం అందించేలా హరేకృష్ణ మూవ్‌మెంట్, టచ్‌స్టోన్ ఛారిటీస్ సంయుక్తంగా ఆసుపత్రి ఎముకల విభాగం సమీపంలో ఏర్పాటు చేసిన 'సుభోజనం' వసతి కేంద్రాన్ని విశాఖ దక్షిణ ఎమ్మెల్యే శ్రీనివాస్ సోమవారం ఉదయం ప్రారంభించారు. 150 మంది ఒకేసారి కూర్చొని భోజనం చేసే విధంగా కేంద్రాన్ని తీర్చిదిద్ది అవసరమైన వసతులు కల్పించారు. ఇటువంటి మంచి కార్యక్రమాలను నిర్వహిస్తున్న సుభోజనం నిర్వాహకులను ఎమ్మెల్యే అభినందించారు. కార్యక్రమంలో ఆసుపత్రి పర్యవేక్షక వైద్యాధికారి డాక్టర్ పి.శివానంద, ఏఎంసీ ప్రిన్సిపల్ డాక్టర్ జి.బుచ్చిరాజు, హరేకృష్ణ సంస్థ విశాఖ అధ్యక్షులు నిష్కించన భక్తదాస శ్యామ్‌మాధవ దాస్, పిల్లల షణ్ముఖరావు తదితరులు పాల్గొన్నారు.

బాల్య వివాహాలను తల్లిదండ్రులు ప్రోత్సహించరాదు

వన్‌టౌన్, న్యూస్‌టుడే: ఎట్టి పరిస్థితిలో బాల్య వివాహాలను తల్లిదండ్రులు ప్రోత్సహించరాదని కలెక్టర్ హరేంధిర ప్రసాద్ స్పష్టం చేశారు. కలెక్టరేట్ సమావేశ మందిరంలో సోమవారం బాల్య వివాహాల నిర్మూలన చర్యలపై రూపొందించిన గోడపత్రికను ఆవిష్కరించారు. బాల్య వివాహాల చట్టం-2006 ప్రకారం 18 ఏళ్ల లోపు ఆడపిల్లలకు, 21 ఏళ్ల లోపు మగపిల్లలకు వివాహాలు చేయడం నేరమన్నారు. ఎవరైనా బాల్య వివాహాలు చేస్తున్నట్లు రుజువైతే రెండేళ్ల వరకు జైలుశిక్ష, జరిమానా ఉంటుందన్నారు. నాన్‌బెయిల్‌బుల్ కేసు నమోదు చేస్తారన్నారు. దీనిపై ట్రోల్‌ఫ్రీ నెంబరు 1098కు ఫిర్యాదు చేయాలన్నారు. జేసీ మయూర్ అశోక్, డీఆర్వో మోహన్ కుమార్, ఐసీడీఎస్ పీడీ జయదేవి తదితరులు పాల్గొన్నారు.

మిలటరీ ఫొటోగ్రఫీ పోటీలకు ఆహ్వానం

సింధియా, న్యూస్‌టుడే : ఈ ఏడాది చివర్లో జరగనున్న భారత నౌకాదళం వారోత్సవాలను పురస్కరించుకుని మిలిటరీ ఫొటో ఎగ్జిబిషన్ నిర్వహించనున్నట్లు నేవీ వర్గాలు సోమవారం తెలిపాయి. ఎర్నాకుళం ప్రెస్‌క్లబ్ సహకారంతో నవంబరు 23, 24 తేదీల్లో సదరన్ నేవల్ కమాండు-కొచ్చిలో పోటీలు జరగనున్నాయి. రక్షణ మంత్రిత్వశాఖకు చెందిన త్రివిధ దళాలకు సంబంధించి 2023 నవంబరు 20 నుంచి 2024 అక్టోబరు 31వ తేదీ లోపు దేశ వ్యాప్తంగా ఫొటో జర్నలిస్టులు తీసిన ఫొటోలను ఆహ్వానిస్తున్నారు. ప్రతి ఫొటోకు ఆంగ్లంలో క్యాప్షన్ రాసి, ఈ ఏడాది నవంబరు 11లోపు 'ఎస్ఎన్‌సీఎంపీహెచ్ఈఎక్స్24 ఎట్ ది రేటాఫ్.జీమెయిల్'కుఎంట్రీలు పంపాలని విజ్ఞప్తి చేశాయి. విజేతలకు రూ.15,000, రూ.7,000, రూ.5,000ల చొప్పున నగదు బహుమతులు ఉంటాయని స్పష్టం చేశాయి.

జీవీఎంసీలో ఫిర్యాదుల స్వీకరణ

కార్పొరేషన్, న్యూస్‌టుడే: శాంతి ఆశ్రమాన్ని ఖాళీ చేయాలని ఏడాది క్రితం న్యాయస్థానం తీర్పునిచ్చినా అమలు చేయకుండా, ఓ నిర్మాణం చేపడుతున్నా ప్రణాళికాధికారులు పట్టించుకోవడంలేదని 22వ వార్డు జనసేన కార్పొరేటర్ పీతల మూర్తియాదవ్ ఫిర్యాదు చేశారు.

★ టిడ్కో గృహం కోసం జీవీఎంసీ రూ.25వేలు డీడీ రూపంలో చెల్లించామని, గృహం మంజూరు చేయకపోగా, అర్హత లేదంటూ పేర్కొన్న అధికారులు తనకు ఆ సొమ్ము రూ.25వేలు వెనక్కు ఇవ్వడం లేదని ఓ మహిళ ఫిర్యాదు చేశారు.

★ సోమవారం జీవీఎంసీలో నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదికకు 75 ఫిర్యాదులు వచ్చాయి. మేయరు గొలగాని హరి వెంకట కుమారి, కమిషనర్ సంపత్‌కుమార్ అందుబాటులో లేకపోవడంతో అదనపు కమిషనర్ ఎస్.ఎస్.వర్మ, ప్రధాన పట్టణ ప్రణాళికాధికారి ప్రభాకర్, ప్రధాన వైద్యాధికారి డాక్టర్ నరేష్‌కుమార్ ఫిర్యాదులు స్వీకరించారు. జోన్-1కు 2, జోన్-2 11, జోన్-3కు 17, జోన్-4కు 7, జోన్-5కు 12, ఆరవ జోన్‌కు 11, 8వ జోన్‌కు 4, ప్రధాన కార్యాలయానికి 11 ఫిర్యాదులు వచ్చాయి. వాటిలో పరిపాలనకు 2, ప్రజారోగ్యానికి 5, పట్టణ ప్రణాళికకు 38, ఇంజినీరింగ్‌కు 13, ఉద్యానవన విభాగానికి రెండు, రెవెన్యూకు 10, యూసీడీకి 5 ఫిర్యాదులున్నాయి.



ఫిర్యాదులు స్వీకరిస్తున్న ఏడీసీ వర్మ, సీఎంఓహెచ్ నరేష్‌కుమార్, సీసీపీ ప్రభాకర్

ప్రజా సమస్యల పరిష్కార వేదికకు స్పందన



వీడియో కాన్ఫరెన్స్‌లో అధికారులతో మాట్లాడుతున్న సి.పి. శంఖబ్రత బాగ్చీ

ఎం.వి.పి.కాలనీ, న్యూస్‌టుడే: పోలీసు సమావేశ మందిరంలో సోమవారం నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదికకు విశేష స్పందన లభించింది. నగర పోలీసు కమిషనర్ శంఖబ్రత బాగ్చీ 77 మంది బాధితుల నుంచి అర్జీలు స్వీకరించారు. తక్షణమే సంబంధిత పోలీసు అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా మాట్లాడి ఫిర్యాదులను గడువులోగా పరిష్కరించాలని ఆదేశించారు. ఎ.సి.పి.లు, సి.ఐ.లు వారి కార్యాలయాల్లో ఒటూ పలువురి నుంచి వినతులు అందుకున్నారు.

కబడ్డీ పోటీల విజేత విశాఖ

ఎచ్చెర్ల, న్యూస్‌టుడే: శ్రీకాకుళం జిల్లా ఎచ్చెర్ల మండలంలోని కేశవరావుపేట జడ్పీ ఉన్నత పాఠశాలలో రెండు రోజుల నుంచి జరుగుతున్న రాష్ట్ర స్థాయి స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ బాలికల కబడ్డీ పోటీలు సోమవారంతో ముగిశాయి. ఈ పోటీల్లో రాష్ట్రంలోని 13 జిల్లాల నుంచి 156 మంది క్రీడాకారులు రెండు రోజుల పాటు హోరాహోరీగా తలపడి క్రీడా స్ఫూర్తిని చాటారు. ఈ పోటీల్లో విశాఖపట్నం జట్టు ప్రథమ, అనంతపురం జట్టు ద్వితీయ, శ్రీకాకుళం జట్టు తృతీయ స్థానాలు కైవసం చేసుకున్నాయి.



ప్రథమ బహుమతిని అందుకుంటున్న విశాఖపట్నం జట్టు క్రీడాకారులు

అథ్లెటిక్స్ పోటీల్లో ఏఎంసీ విద్యార్థికి పతకాలు



నేతాజీని అభినందిస్తున్న ఆంధ్రా మెడికల్ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ జి.బుచ్చిరాజు, డాక్టర్ ఆర్.సునీల్‌కుమార్ తదితరులు

విశాఖ క్రీడలు, న్యూస్‌టుడే: రాష్ట్రస్థాయి జూనియర్ అథ్లెటిక్స్ పోటీల్లో ఆంధ్రామెడికల్ కళాశాల క్రీడాకారుడు జి.నేతాజీ పతకాలు గెలుపొందాడు. పోటీలు ఈనెల 6న రాజమండ్రిలో ముగిశాయి. షాట్‌పుట్‌లో స్వర్ణం, డిస్కస్‌త్రో రజతం సాధించాడు. త్వరలో జరగనున్న సౌత్‌జోన్ నేషనల్స్ పోటీలకు ఎంపికయ్యాడు. ఈ సందర్భంగా అతడిని కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ జి.బుచ్చిరాజు సోమవారం జరిగిన కార్యక్రమంలో అభినందించారు. ఈ కార్యక్రమంలో కళాశాల స్పోర్ట్స్ ఉపాధ్యక్షుడు డాక్టర్ ఆర్.సునీల్‌కుమార్, ఫిజికల్ డైరెక్టరు డాక్టర్ ఎం.ఎస్.ఎన్.పాత్రుడు తదితరులు పాల్గొన్నారు.

27న వెటరన్ అథ్లెటిక్ ఛాంపియన్‌షిప్ పోటీలు

మురళీనగర్, న్యూస్‌టుడే : ఈనెల 27న పోలీస్‌బ్యారెక్స్ గ్రౌండ్‌లో నిర్వహించనున్న విశాఖ డిస్ట్రిక్ట్ వెటరన్ అథ్లెటిక్ ఛాంపియన్‌షిప్ పోటీలకు సంబంధించిన పోస్టర్‌ను సోమవారం మురళీనగర్ సంస్థ కార్యాలయంలో విడుదల చేశారు. ఈ సందర్భంగా అసోసియేషన్ చీఫ్ ప్యాటర్న్ కమల్‌బేద్ మాట్లాడుతూ కేంద్ర రాష్ట్ర ప్రభుత్వోద్యోగులతో పాటు 30 ఏళ్లు దాటిన ఔత్సాహిక క్రీడాకారులంతా ఈ పోటీల్లో పాల్గొని విశాఖ కీర్తి ప్రతిష్ఠలు చాటాలని పిలుపునిచ్చారు. ఉదయం 6నుంచి సాయంత్రం 6గంటల వరకు జరిగే ఈ పోటీల్లో 5 కి.మీ వాకింగ్, 100నుంచి 5వేల మీటర్ల పరుగు పోటీలు, ట్రిపుల్‌జంప్, లాంగ్‌జంప్, షాట్‌పుట్, డిస్కస్‌త్రో, జావలిన్‌త్రో, హేమర్‌త్రో పోటీలను నిర్వహిస్తారని తెలిపారు. స్త్రీ పురుషులకు వేర్వేరుగా ఈ పోటీలు నిర్వహించి విజేతలకు స్వర్ణ, కాంస్య, రజత పతకాలు, ప్రశంసాపత్రాలను అందజేస్తామన్నారు. మరిన్ని వివరాలకు 97013 47311 , 83091 57522లలో సంప్రదించవచ్చునని తెలిపారు. కార్యక్రమంలో అధ్యక్షులు మంగ వరప్రసాద్, సి. హెచ్.శ్రీనివాసరాజు, ఎల్.వి.సుధాకర్, ఎం.రామారావు, వంశీ, ఎస్‌వీఎల్ఎన్ వాకర్స్‌క్లబ్ అధ్యక్షులు నాగార్జున పాల్గొన్నారు.



పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న కమల్‌బేద్ తదితరులు

రెల్లి, ఉపకులాలకు 5 శాతం రిజర్వేషన్లు కేటాయించాలి



కలెక్టరేట్ వద్ద నిరసన తెలుపుతున్న రెల్లికుల సామాజికవర్గ నాయకులు

వన్‌టౌన్, న్యూస్‌టుడే: ఎస్సీ వర్గీకరణలో భాగంగా రెల్లి, ఉపకులాలకు 5 శాతం రిజర్వేషన్లు కేటాయించాలని రెల్లి ఉపకులాల సంఘం డిమాండ్ చేసింది. ప్రస్తుతం రిజర్వేషన్ల కేటాయింపులో రెల్లి సామాజిక వర్గానికి తీవ్ర అన్యాయం జరుగుతోందని ఆరోపించింది. ఎల్ఐసీ కూడలిలో ఉన్న అంబేద్కర్ విగ్రహం నుంచి జగదాంబ మీదుగా కలెక్టరేట్ కూడలి వరకు సోమవారం భారీ నిరసన ప్రదర్శన చేపట్టారు. సంఘం నాయకులు నీలాపు వెంకటేశ్వరరావు, పాడుగు కుమార్, ఇసుకపల్లి వెంకటేశ్వరరావు, ఆకుల మాలతి, చెన్నా తిరుమలరావు, కప్పూరి వెంకటరావు, చొక్కాకుల రాంబాబు, పెద్ది మధుసూదన్, చెన్నా జానకిరామ్, ఎర్రంశెట్టి సురేష్ తదితరులు పాల్గొన్నారు.

★ వాలంటీర్లకు బకాయిపడ్డ 4 నెలల వేతనాలను విడుదల చేయాలని ఏపీ రాష్ట్ర వాలంటీర్ల అసోసియేషన్ కోరింది. కార్యదర్శి ఎం.జగదీష్ ఆధ్వర్యంలో పలువురు వాలంటీర్లు కలెక్టరేట్ వద్ద నిరసన తెలిపి, కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు.

★ శారదా పీఠానికి కేటాయించిన 15 ఎకరాల భూములను వెనక్కి తీసుకోవాలని తెలుగుశక్తి అధ్యక్షుడు బీవీరామ్ కోరారు.

భీమిలి ఆర్డీవో బాధ్యతల స్వీకరణ



కె.సంగీత్ మాధుర్

భీమునిపట్నం, న్యూస్‌టుడే: భీమిలి రెవెన్యూ డివిజనల్ కార్యాలయం కొత్త ఆర్డీవోగా కె.సంగీత్‌మాధుర్ సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ రెండేళ్లకు పైగా ఆర్డీవోగా పనిచేసిన ఎస్.భాస్కరరెడ్డిని బదిలీ చేస్తూ ప్రభుత్వానికి రిపోర్టు చేయాలని ఉన్నతాధికారులు ఆదేశించారు. ఆ మేరకు ఇక్కడ ఖాళీ ఏర్పడగా ట్రైయినీ డిప్యూటీ కలెక్టరుగా పనిచేసిన యువ అధికారి సంగీత్‌మాధుర్‌ను భీమిలి ఆర్డీవోగా ప్రభుత్వం నియమించింది. ఈ సందర్భంగా పలువురు రెవెన్యూ సిబ్బంది పుష్పగుచ్ఛాలతో ఆయనను స్వాగతించి సత్కరించారు. ఈ సందర్భంగా ఆయన 'న్యూస్‌టుడే'తో మాట్లాడుతూ డివిజన్ పరిధిలోని ప్రజలతో నేరుగా సత్సంబంధాలు కొనసాగిస్తూ పారదర్శకంగా విధులు నిర్వర్తిస్తానని అన్నారు. కార్యాలయ పనివేళల్లో ప్రజలు తమ సమస్యలపై నేరుగా తనను కలవవచ్చునన్నారు.

జెడ్పీ సీఈవోగా నారాయణమూర్తి



వన్‌టౌన్, న్యూస్‌టుడే: విశాఖ జిల్లా పరిషత్ ముఖ్య కార్యనిర్వహణ అధికారి(సీఈవో)గా **పి.నారాయణమూర్తి** సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ఇన్‌ఛార్జి సీఈవో సత్యనారాయణ నుంచి ఆయన బాధ్యతలు అందుకున్నారు. అనంతరం కలెక్టర్ హరేంధిర ప్రసాద్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈయన గతంలో కాకినాడ డీఎల్‌డీవోగా పనిచేస్తూ బదిలీపై విశాఖకు వచ్చారు.

కేజీహెచ్ ఏడీ బదిలీ

వన్‌టౌన్, న్యూస్‌టుడే: కేజీహెచ్ సహాయ సంచాలకులుగా పనిచేస్తున్న శ్రీనివాస్‌కుమార్‌ను ఉప సంచాలకులు(డీడీ)గా పదోన్నతి కల్పించి శ్రీకాకుళం సర్వజన ఆసుపత్రి డీడీగా బదిలీ చేస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఏడీ స్థానంలో ఇంకా ఎవర్నీ నియమించలేదు.

పార్కింగ్ స్థలాల్లో ఇతర నిర్మాణాలు వద్దు

★ హైకోర్టుకు న్యాయవాదుల సంఘం ఫిర్యాదు ★ హైకోర్టు న్యాయమూర్తి జోక్యంతో నిలిచిన నిర్మాణం

విశాఖ లీగల్, న్యూస్‌టుడే: జిల్లా కోర్టు ప్రాంగణంలో నూతనంగా నిర్మించిన న్యాయస్థానాల భవంతికి చెందిన పార్కింగ్ స్థలంలో ఎటువంటి నిర్మాణాలు చేపట్టకుండా జిల్లా న్యాయశాఖ పరిపాలనా విభాగాన్ని ఆదేశించాలని విశాఖ న్యాయవాదుల సంఘం రాష్ట్ర హైకోర్టును కోరింది. సంఘటన వివరాలిలా ఉన్నాయి. నూతనంగా నిర్మించిన న్యాయస్థానాల భవంతిలో బేస్‌మెంట్, సెల్లార్‌లను కేవలం పార్కింగ్ కోసం కేటాయిస్తూ నిర్మాణం చేపట్టారు. ప్రస్తుతం రెండు ప్రదేశాలలోనూ పార్కింగ్‌కి న్యాయవాదులు, న్యాయమూర్తులు, న్యాయశాఖ సిబ్బంది వాడుకుంటున్నారు. గతవారం పరిపాలనా విభాగం అధికారులు బేస్‌మెంట్‌లోనున్న పార్కింగ్ స్థలంలో డిజిటల్ రూమ్‌ను నిర్మించటం ప్రారంభించారు. న్యాయవాదులు అభ్యంతరం తెలియజేసినా నిర్మాణం కొనసాగించటంతో న్యాయవాదుల సంఘం ఈ విషయాన్ని అధికారుల దృష్టికి తీసుకువెళ్ళినా ప్రయోజనం లేకపోయింది. గత రెండు రోజులుగా నగర పర్యటనలోనున్న హైకోర్టు న్యాయమూర్తి, జిల్లా పోర్టుపోలియో న్యాయమూర్తి జస్టిస్ తిల్హారీని కలసి అధికారులు జరుపుతున్న నిర్మాణంపై న్యాయవాదులు ఫిర్యాదుచేశారు. దీంతో న్యాయమూర్తి నిర్మాణం నిలిపివేయమని చెప్పినట్లు తెలిసింది. సోమవారం న్యాయవాదుల సంఘం అత్యవసర సమావేశాన్ని నిర్వహించి సభ ఏకగ్రీవ తీర్మానం హైకోర్టుకు పంపించారు. సమావేశంలో డిజిటల్‌రూమ్ నిర్మాణానికి తాము వ్యతిరేకం కాదని జిల్లాకోర్టు ప్రాంగణంలోగల ఇతర ప్రాంతాలలో దీని నిర్మాణం చేపట్టమని, నిర్మాణాలకు తాము సహాయ సహకారాలనందిస్తామని సంఘం అధ్యక్షుడు బెవర సత్యనారాయణ అన్నారు. సమావేశంలో బార్‌కౌన్సిల్ ఉపాధ్యక్షుడు ఎస్.కృష్ణమోహన్, సంఘం కార్యదర్శి నరేష్‌కుమార్, ఉపాధ్యక్షుడు శ్రీనివాసరావు. సీనియర్ న్యాయవాదులు బండారు రామకృష్ణ, రాఘవేంద్రరావు తదితరులు ప్రసంగించారు.

హత్య కేసులో నిందితుడి అరెస్టు

సింధియా, న్యూస్‌టుడే : ఆస్తి గొడవల్లో ఒకర్ని హత్య చేసిన నిందితుడిని సోమవారం మల్కాపురం పోలీసులు అరెస్టు చేశారు. సీఐ ఎస్.విద్యాసాగర్ వివరాల మేరకు... మల్కాపురానికి చెందిన వరలక్ష్మి అనారోగ్యంతో 3న చనిపోయారు. ఆమెకు కుమారుడు దుర్గాప్రసాద్, కోడలు దేవి, సోదరులు ఎస్.సింహాచలం, ఎస్.వాసు(46), ఎస్.గోపి ఉన్నారు. ఈ నెల 4న ఆస్తి విషయమై కుటుంబీకులు ఘర్షణ పడ్డారు. అదే రోజు రాత్రి దేవి ఫోన్ చేసి అక్కయ్యపాలెంలో ఉన్న సోదరుడు పవన్‌సాయికి విషయం మొత్తం చెప్పింది. పవన్‌సాయి అర్ధరాత్రి సమయంలో వరలక్ష్మి ఇంటికి చేరుకుని వాసు ముఖంపై బలంగా కొట్టాడు. స్పృహ కోల్పోయిన వాసును ఆసుపత్రికి తరలించేలోపే మృతి చెందాడు. నాటి నుంచి పరారీలో ఉన్న నిందితుడు పవన్‌సాయిని అరెస్టు చేశామని సీఐ తెలిపారు.



వివరాలు వెల్లడిస్తున్న సీఐ విద్యాసాగర్

రోడ్డు ప్రమాదంలో ఇద్దరి మృతి



షేక్ మదీనా బాషా

బాలాపూర్(హైదరాబాద్), న్యూస్‌టుడే: ఒకరు విధులకు హాజరయ్యేందుకు వెళ్తుండగా.. మరొకరు విధులు ముగించుకుని ఇంటికి వెళుతూ.. ఇద్దరూ అనుకోకుండా కలుసుకుని బయలుదేరిన 5 నిమిషాల వ్యవధిలోనే మృత్యువాతపడ్డారు. లారీ ఢీకొని ఇద్దరూ అక్కడికక్కడే మృతి చెందారు. ఈ సంఘటన మీర్‌పేట పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. ఇన్‌స్పెక్టర్ కె.నాగరాజు కథనం ప్రకారం.. విశాఖపట్నానికి చెందిన షేక్ మదీనా బాషా(42) .. భార్య, ఇద్దరు పిల్లలతో మీర్‌పేట టీకేఆర్ కళాశాల సమీపంలోని ఓ అపార్టుమెంట్‌లో ఉంటున్నారు. ఇతను ఉప్పల్ ఫిర్జాదిగూడలోని టీజీఆర్టీసీ జోనల్ వర్క్‌షాప్‌లో అసిస్టెంట్ మెకానికల్ ఇంజినీర్‌గా పనిచేస్తున్నారు. మహబూబ్‌నగర్ హన్వాడా మండలం దర్పల్లి గ్రామానికి చెందిన అన్నోజు శ్రావణ్‌కుమార్(40) నందనవనం ప్రాంతంలో భార్య, ఇద్దరు పిల్లలతో జీవనం సాగిస్తున్నారు. ఈయన టీకేఆర్ కళాశాలలో సెక్యూరిటీ గార్డుగా పనిచేస్తున్నారు. సోమవారం ఉదయం 7 గంటల అనంతరం బాషా తన బైక్‌పై విధులకు హాజరయ్యేందుకు వెళ్తున్నాడు. శ్రావణ్ ఆదివారం రాత్రి విధులకు హాజరై ఉదయం డ్యూటీ దిగి సుమారు 2 కిలోమీటర్ల దూరంలో ఉన్న ఇంటికి వెళ్లేందుకు రహదారిపై వేచిఉన్నాడు. బాషా ద్విచక్రవాహనంపై వెళ్తుండగా శ్రావణ్ కుమార్ అతనిని లిఫ్ట్ అడిగి ఎక్కాడు. కొద్దిదూరం వెళ్లగానే వెనుక నుంచి వచ్చిన లారీ.. ద్విచక్ర వాహనాన్ని ఢీకొంది. ఇద్దరూ అక్కడికక్కడే మృతి చెందారు. సమాచారం అందుకున్న మీర్‌పేట పోలీసులు.. రెండు మృతదేహాలను ఉస్మానియా ఆసుపత్రికి తరలించారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

చికెన్ ధరలు

(కిలోకి - రూ.లలో)

	వెన్‌కాబ్	బ్యాగ్
ఫారం గేటు	115	110
లైవ్	137	130
డ్రెస్డ్	199	230
స్కిన్‌లెస్	226	240

పెందుర్తి

తెరపై ఈనాడు
పెందుర్తిలో..
లక్ష్మీకాంత్
స్క్రీన్-1 - దేవర
స్క్రీన్-2 - శ్వాగ్

రైతు బజార్లలో రూ.50కే కిలో టమోటా

వన్‌టౌన్, న్యూస్‌టుడే: జిల్లాలోని అన్ని రైతు బజార్లలో ఈనెల 8 తేదీ మంగళవారం నుంచి రాష్ట్ర ప్రభుత్వం, మార్కెటింగ్ శాఖ ఆధ్వర్యంలో రాయితీపై కిలో టమోటా రూ.50కే విక్రయించనున్నట్లు జేసీ మయూర్ అశోక్ సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఒక్కో కుటుంబానికి కిలో మాత్రమే అమ్మనున్నారు. వినియోగదారులు ఆధార్ లేదా రేషన్ కార్డును కౌంటర్ నందు చూపించాలని ప్రకటనలో పేర్కొన్నారు. కొనుగోలుదారులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

– న్యూస్‌టుడే, క్రాంతినగర్(పెందుర్తి)

మేమున్నాం.. మీకు తోడుగా 10 AM - 1 PM
పెందుర్తి : 90598 98721 వేపగుంట: 93472 79909

సమస్య జీవీఎంసీ 97వ వార్డు చినముషిడివాడ క్రాంతినగర్ కాలనీలోని లేక్ అవెన్యూ బహుళ అంతస్తుల భవనాల సమీపంలోని కాలువలు పూడుకుపోయాయి. నెల రోజులుగా కాలువలు శుభ్రం చేయకపోవడంతో మురుగు నిలిచిపోయి దోమలు, దుర్వాసనతో స్థానికులు ఇబ్బంది పడుతున్నారు. – సీహెచ్.నారాయణ, క్రాంతినగర్

సమాధానం: మీ ప్రాంతంలో సిబ్బందితో కాలువలు శుభ్రం చేయించి పరిశుభ్రత చర్యలు తీసుకుంటాం. – రమేష్, శానిటరీ ఇన్‌స్పెక్టర్, 97వ వార్డు

అనుసంధాన దారి.. అవస్థలుగా మారి..

చినముషిడివాడ(పెందుర్తి), న్యూస్‌టుడే: ఆ దారిలో నిత్యం వందలాది మంది ప్రయాణిస్తుంటారు. బడి బస్సులు సైతం ఈ మార్గంలోనే రాకపోకలు సాగిస్తుంటాయి. చినముషిడివాడ నుంచి సుజాతనగర్ వరకు పలు కాలనీలను అనుసంధానించే ప్రధాన మార్గమిది. ఇంతటి ప్రాధాన్యం ఉన్న సిద్ధార్థనగర్ రహదారి గత పదేళ్లుగా నిరాదరణ గురైంది. ఈ మార్గాన్ని అభివృద్ధి చేయడంలో పాలకులు, అధికారులు దృష్టి సారించలేదని నివాసితులు వాపోతున్నారు. చినముషిడివాడ నుంచి పీఎఫ్ కాలనీ మీదుగా సిద్ధార్థనగర్‌కు వెళ్లే సీసీ రహదారి పూర్తిగా ధ్వంసమైంది. ఎక్కడ చూసినా గోతులే దర్శనమిస్తున్నాయి. చక్కగా ఉన్న సిమెంటు రోడ్డును భూగర్భ మురుగు నీటి వ్యవస్థ పనుల కోసం తవ్వేశారు. గొట్టాలు, సంపులు ఏర్పాటు చేసిన తర్వాత గోతులను పూడ్చారు. గోతుల్లో మట్టి గట్టి పడకుండానే కాంక్రీటు వేయడంతో పనుల్లో నాణ్యత లోపించింది. దీంతో ఆయా గోతులు పూడ్చిన చోట రోడ్డు భూమిలోకి కుంగిపోయింది.


కంకర తేలి ప్రమాదకరంగా


పూర్తిగా ధ్వంసమైన రహదారి

రాత్రివేళ భయంగా ప్రయాణం

ఈ మార్గంలో రాత్రివేళ ప్రయాణం నరకంగా మారిందని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గోతులతో పాటు కంకర తేలడంతో ప్రమాదాలకు గురవుతున్నామని ద్విచక్ర వాహనదారులు చెబుతున్నారు. దీంతో పాటు వీధిదీపాలు సక్రమంగా లేకపోవడంతో భయంగా రాకపోకలు సాగించాల్సి వస్తోందని వాపోతున్నారు. వర్షం కురిస్తే పరిస్థితి మరింత దయనీయంగా మారుతోందని తెలిపారు. గోతుల్లో వర్షం నీరు నిలిచిపోయి ఇబ్బంది పడుతున్నామని ఆవేదన చెందుతున్నారు. చినముషిడివాడ నుంచి సుజాతనగర్ 80 అడుగుల రహదారిని అనుసంధానించే ఈ దారి వెంట పలు కాలనీలున్నాయి. వేలాది మంది ప్రజల రాకపోకలు సాగించడానికి ఉపయోగపడే ఈ దారిపై పాలకులు, అధికారులు దయచూపాలని ప్రజలు కోరుతున్నారు.


ఇళ్ల ముందు గోతులు

పాదలు తొలగింపు

సబ్బవరం, న్యూస్‌టుడే: సబ్బవరం మండలం పైడివాడ నీళ్ల ట్యాంకు వద్ద విద్యుత్తు స్తంభానికి పొదలు అల్లుకుపోయాయి. దీనివల్ల కలిగే ఇబ్బందులపై ఈనెల 6న 'నిర్లక్ష్యానికి నిదర్శనం' శీర్షికతో 'ఈనాడు'లో ప్రచురించిన వార్తకు ఈపీడీసీఎల్ అధికారులు స్పందించారు. సిబ్బందిని పంపించి సోమవారం పిచ్చిమొక్కలను తొలగించారు. స్థానికులు హర్షం వ్యక్తం చేశారు.

స్పందనకు వందనం

రూ.25 కోట్లతో అభివృద్ధి పనులు: ఎమ్మెల్యే


మాట్లాడుతున్న ఎమ్మెల్యే పంచకర్ల రమేశ్‌బాబు, చిత్రంలో ఎంపీపీ సూర్యకుమారి, అధికారులు

సబ్బవరం, న్యూస్‌టుడే: మహాత్మ గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం నిధులు రూ.25 కోట్లతో నియోజకవర్గంలో పలు అభివృద్ధి పనులు చేపట్టనున్నట్లు ఎమ్మెల్యే పంచకర్ల రమేశ్‌బాబు స్పష్టం చేశారు. సబ్బవరం మండల సర్వసభ్య సమావేశాన్ని ఎంపీపీ బోకం సూర్యకుమారి అధ్యక్షతన సోమవారం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా ఎమ్మెల్యే రమేశ్‌బాబు పాల్గొని మాట్లాడారు. రూ.9 కోట్లు సబ్బవరం మండలానికి కేటాయింపులు జరిగాయన్నారు. గ్రామాల్లోని ప్రజాప్రతినిధుల సూచనల మేరకు నివేదిక తయారు చేసి పంపాలని ఉపాధి హామీ పథకం అధికారులకు సూచించారు. అధికారుల బదిలీల కారణంగా గత మూడు నెలలుగా ఏ విధమైన అభివృద్ధి పనులు జరగలేదన్నారు. గ్రామాల్లో సర్పంచులు, ఎంపీటీసీ సభ్యులు ప్రతిపాదించిన పనులు వెంటనే చేయాలన్నారు. సబ్బవరం ప్రభుత్వ ఆసుపత్రి అభివృద్ధికి రూ.2 కోట్లు మంజూరు చేయాలని ముఖ్యమంత్రిని కోరడం జరిగిందన్నారు. మరో రెండు మూడు నెలల్లో నిర్మాణాలు ప్రారంభమవుతాయన్నారు. విద్యుత్తు, రెవెన్యూ, మైనర్ ఇరిగేషన్, ఆర్‌అండ్‌బీ సమస్యలను స్థానిక ప్రజాప్రతినిధులు మామిడి శంకరరావు, పడాల వెంకటరమణ, కోరాడ శ్రీను, పల్ల సోమేశ్వరరావు, బోకం సోమునాయుడు, కర్రి నర్సింగరావు, దాడి కన్నం నాయుడు తదితరులు ఎమ్మెల్యే దృష్టికి తెచ్చారు. వీటన్నింటినీ పరిష్కరించేందుకు చర్యలు చేపడతామన్నారు. వచ్చే సమావేశానికి వీఆర్‌వోలు, హాజరయ్యేలా చూడాలని ఇన్‌ఛార్జి తహసీల్దారు అప్పారావుకు సూచించారు. ఉప ఎంపీపీలు ఝాన్సీలక్ష్మీరాణి, చొక్కాకుల గోవింద, ఎంపీడీవో పి.పద్మజ, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు. ముందుగా మండల పరిషత్ సమావేశ మందిరంపై నిర్మించిన అతిథి గృహాన్ని ఎమ్మెల్యే ప్రారంభించారు.


సమావేశానికి హాజరైన వివిధ శాఖల అధికారులు, స్థానిక ప్రజాప్రతినిధులు

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం

సబ్బవరం, న్యూస్‌టుడే: సబ్బవరం మండలం ఆరిపాక జెడ్పీ ఉన్నత పాఠశాలలో 2007-08 విద్యా సంవత్సరంలో పదో తరగతి చదువుకున్న విద్యార్థులు సోమవారం స్థానిక మజ్జి గౌరమ్మ ఆలయ ప్రాంగణంలో ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. ఒకరినొకరు పలకరించుకుంటూ ఆనందోత్సాహాల నడుమ కరచాలనం చేసుకున్నారు. అప్పటి మధుర జ్ఞాపకాలను గుర్తు చేసుకుంటూ సంతోషంగా గడిపారు. ఒక్కొక్కరూ మాట్లాడుతూ వారి విజయాలు, వైఫల్యాలను వివరించారు. అనంతరం సహపంక్తి భోజనాలు చేశారు. ఆర్థికంగా ఇబ్బందుల్లో ఉన్న స్నేహితులకు సహాయపడాలని తీర్మానించుకున్నారు.


సమావేశమైన పూర్వవిద్యార్థులు

రహదారి నిర్మాణంపై ఇరువర్గాల వాదులాట

చీమలాపల్లి(వేపగుంట), న్యూస్‌టుడే: జీవీఎంసీ 95వ వార్డు చీమలాపల్లి - పోర్లుపాలెం మధ్య ఇటీవల నిర్మించిన సీసీ రహదారి విషయంలో స్థానికుల మధ్య వివాదం చెలరేగింది. గతంలో వుడా ప్రణాళికలో 40 అడుగులు ఉండగా భూగర్భ డ్రైనేజీ మరమ్మతుల పేరిట కేవలం 20 అడుగులు మాత్రమే సీసీ రోడ్డు నిర్మించడంపై స్థానికులు, పోర్లుపాలెం గ్రామస్థులు ఆగ్రహం వ్యక్తం చేశారు. దీనిపై పట్టణ ప్రణాళిక విభాగం అధికారులకు స్థానికులు ఫిర్యాదు చేయగా టీపీవో తేజేశ్వరరావు, సచివాలయ కార్యదర్శులు పొక్లెయినరుతో ఆక్రమణలను తొలగించేందుకు బుధవారం గ్రామానికి వెళ్లారు. రహదారిని అనుకొని నిర్మాణాలు చేసిన వారంతా కూల్చి వేయొద్దంటూ అధికారులతో వాగ్వాదానికి దిగారు. మరి కొంతమంది ఆక్రమణలను తొలగించి రహదారి నిర్మించాలని పట్టుబట్టారు. దీంతో ఇరువర్గాల మధ్య వాదులాట చోటుచేసుకుంది. పట్టణ ప్రణాళిక విభాగం అధికారులు వుడా ప్రణాళిక ప్రకారం మార్కింగ్ ఇచ్చారు. నాలుగు రోజుల్లో ప్రజలే స్వచ్ఛందంగా ఆక్రమణలను తొలగించాలని లేకుంటే తామే కూల్చి వేయాల్సి వస్తుందని చెప్పి అధికారులు వెళ్లిపోయారు.


వివాదానికి కారణమైన రోడ్డు

అధికారుల బాధ్యతల స్వీకరణ

సబ్బవరం, న్యూస్‌టుడే: ఇటీవల నిర్వహించిన బదిలీల్లో భాగంగా సబ్బవరం మండలానికి వచ్చిన అధికారులు సోమవారం బాధ్యతలు స్వీకరించి విధుల్లో చేరారు. ఈ సందర్భంగా 'న్యూస్‌టుడే'తో వారు మాట్లాడుతూ అభివృద్ధి పనులను సకాలంలో పూర్తి చేసి ప్రజలకు ఇబ్బంది లేకుండా చూస్తామన్నారు.



☛ **పి.హరిణి:** ఈమె పంచాయతీరాజ్ ఏఈ. పరవాడ నుంచి సబ్బవరం వచ్చి విధుల్లో చేరారు. గతంలో కశింకోట, అనకాపల్లి మండలాల్లో పనిచేశారు. ఈమె స్వస్థలం విశాఖ నగరం.



☛ **ఎస్.సాయికిరణ్:** మండల మైనర్ ఇరిగేషన్ ఏఈగా బాధ్యతలు చేపట్టారు. ఈయన శ్రీకాకుళం వంశధార ప్రాజెక్టులో పనిచేసి ఇక్కడకు వచ్చారు. గతంలో నెల్లిమర్లలోని హైడ్రాలిక్స్ విభాగంలో పనిచేశారు. ఈయన స్వస్థలం శ్రీకాకుళం జిల్లా టెక్కలి.



☛ **సీహెచ్ బాలాజీ:** ఉపాధి హామీ పథకం ఏపీవోగా విధుల్లో చేరారు. మాకవరపాలెం మండలం నుంచి సబ్బవరం వచ్చారు. గతంలో అనకాపల్లి మండలాల్లో పనిచేశారు. ఈయన స్వగ్రామం కె.కోటపాడు.



పరవాడ, న్యూస్‌టుడే: పరవాడ మండల గృహనిర్మాణ శాఖ ఏఈగా ఈ.రామచంద్రరావు బాధ్యతలు స్వీకరించారు. ఈయన బుచ్చయ్యపేట మండలం నుంచి ఇక్కడికి బదిలీపై వచ్చారు. ఇప్పటివరకు పరవాడ ఏఈగా పనిచేసిన ఎంఎస్ఎస్ఎన్. రెడ్డి సబ్బవరానికి బదిలీపై వెళ్లారు.


సరిపల్లి దుర్గమాంబ


సుజాతనగర్‌లో మహాచండీ అవతారం


శ్రమశక్తినగర్‌లో..


లలితా త్రిపుర సుందరిగా నాయుడుతోట గాయత్రీ దేవి


దుర్గానగర్‌లో..


బాలాజీగార్డెన్ అపార్ట్‌మెంట్‌లో పసుపుకొమ్ములతో అలంకరణ


శారదాపీఠంలో అమ్మవారికి హారతులిస్తున్న పీఠాధిపతులు

మహాచండీ.. శత్రు సంహారిణి


ద్వాదశ జ్యోతిర్లింగ క్షేత్రంలో సామూహిక కుంకుమ పూజలు


పెదతాడిలో కోలాటం ఆడుతున్న మహిళలు

శ్రీదేవీ శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా సోమవారం అఖిలాండకోటి బ్రహ్మాండనాయకి దుర్గమ్మకు విశేష పూజలు, ఆరాధనలు చేశారు. శత్రు సంహారం చేసి శిష్ట జనులను రక్షించిన మహాచండీ అవతారంలో జగన్మాత దర్శనమిచ్చారు. నియోజకవర్గం పరిధిలోని పలు దేవాలయాలు, భవానీ దీక్షాపరులు, ఉత్సవ మండపాల నిర్వాహకులు ఆధ్వర్యంలో అమ్మవార్లను మహాచండీగా అలంకరించారు. మహిళలు సామూహిక కుంకుమార్చన, పారాయణాలు చేశారు. పలుచోట్ల అన్నసమారాధనలు నిర్వహించారు.

– న్యూస్‌టుడే, పెందుర్తి, వేపగుంట, సబ్బవరం, పరవాడ


పిట్టవానిపాలెంలో మహాదేవిగా..


సంతానలక్ష్మిగా సప్తగిరినగర్ అలమేలు మంగమ్మ


పాపయ్యరాజుపాలెం పిరమిడ్ ధ్యాన కేంద్రంలో భక్తి గీతాలాపన


పాత పెందుర్తిలో భోజనాలు వడ్డిస్తున్న జీవీఎంసీ తెదేపా ఫ్లోర్‌లీడర్ పీలా శ్రీనివాసరావు


కృష్ణానగర్‌లో..


గవరజగ్గయ్యపాలెంలో..


మణిపురం భువనేశ్వరీదేవి..


దేవీపురం రాజరాజేశ్వరీమాత..


పరవాడలో..


పి.భోనంగిలో..


జాజులవానిపాలెంలో..

రాష్ట్ర యోగా పోటీల్లో ప్రతిభ

పరవాడ, న్యూస్‌టుడే: ఏపీ యోగాసన స్పోర్ట్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో కర్నూలు జిల్లాలో ఈనెల 5 నుంచి 7 వరకు నిర్వహించిన రాష్ట్ర స్థాయి యోగా పోటీల్లో పరవాడ మండలం తానాం బీసీ బాలికల గురుకులం పాఠశాలకు చెందిన 8 మంది విద్యార్థినులు ప్రతిభచాటి జాతీయ పోటీలకు ఎంపికయ్యారని పాఠశాల యోగా కోచ్ ఆంజనేయులు సోమవారం తెలిపారు. కె.వెంకటవైష్ణవి, కె.భావన, కె.ధనలక్ష్మి, బి.భావన, ఎస్.కౌశిక, ఎల్.భవంతి, ఈ.హర్షిత, బి.వైష్ణవి వివిధ కేటగిరీల్లో పాల్గొని 8 బంగారు పతకాలు సాధించారన్నారు. వీరంతా నవంబరు 18 నుంచి 22 వరకు అస్సాంలో నిర్వహించనున్న జాతీయ పోటీల్లో పాల్గొంటారని కోచ్ వెల్లడించారు. విద్యార్థినులను పాఠశాల ప్రిన్సిపల్ అప్పలనాయుడు, ఉపాధ్యాయ సిబ్బంది సోమవారం అభినందించారు.


మంత్రి టి.జి.భరత్ చేతులమీదుగా పతకాలు అందుకున్న విద్యార్థినులు

10న ఉక్కులో ధర్నా

ఉక్కునగరం (స్టీల్‌సెక్టారు-3), న్యూస్‌టుడే : ఉక్కులో విద్యుత్తు ఛార్జీల పెంపు, ఇంటి అద్దె చెల్లింపు వంటి సమస్యల పరిష్కారం కోరుతూ ఈనెల 10న ధర్నా నిర్వహిస్తామని ఇంటక్ ప్రధాన కార్యదర్శి ఎం.రాజశేఖర్ తెలిపారు. సోమవారం ప్రధాన పరిపాలన భవనం వద్ద కార్మికులు చేపట్టిన నిరసనలో ఆయన మాట్లాడారు. కార్మిక సమస్యల పరిష్కారానికి యాజమాన్యం చిత్తశుద్ధితో పని చేయాలని కోరారు. కార్మిక సంఘాల సభ్యులు పి.వి.రమణమూర్తి, బి.అప్పారావు, జి.నరేంద్ర, పి.పెంటారావు తదితరులు పాల్గొన్నారు.

వృత్తి విద్యా శిక్షణతో ఉపాధి

వేపగుంట, న్యూస్‌టుడే: పాఠశాల స్థాయి నుంచే వృత్తి విద్యా శిక్షణను విద్యార్థులు పొందడంతో భవిష్యత్‌లో తొందరగా ఉపాధి అవకాశాలు లభిస్తాయని జిల్లా బాలికా సంరక్షణ, జిల్లా వృత్తి విద్యా శిక్షణ పర్యవేక్షణ అధికారిణి ఖాలీషా బేగం అన్నారు. చింతలగ్రహారం జెడ్పీ పాఠశాలకు చెందిన విద్యార్థులకు వేపగుంటలోని ఓ మెకానిక్ దుకాణంలో ఇస్తున్న ఇంటర్న్‌షిప్ శిక్షణను సోమవారం ఆమె పరిశీలించారు. శిక్షణలో తెలుసుకున్న విషయాలపై విద్యార్థులకు పలు ప్రశ్నలు వేశారు. ఈ శిక్షణను ప్రతి విద్యార్థి ఉపయోగించుకునేలా ప్రధానోపాధ్యాయులు కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో పాఠశాల వృత్తి శిక్షణ ఉపాధ్యాయురాలు పాల్గొన్నారు.


విద్యార్థుల శిక్షణను పరిశీలిస్తున్న ఖాలీషా బేగం

ప్రజా సమస్యల పరిష్కార వేదికకు 4 అర్జీలు


అర్జీలను స్వీకరిస్తున్న జెడ్సీ హేమవతి

వేపగుంట, న్యూస్‌టుడే: వేపగుంటలోని జీవీఎంసీ జోన్-8 కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదికకు నాలుగు అర్జీలు వచ్చినట్లు జెడ్సీ హేమవతి తెలిపారు. పురుషోత్తపురంలో రోడ్డు ఆక్రమణ, నరసింహనగర్‌లో పిచ్చిమొక్కలు తొలగించాలని, ఎస్సీ, బీసీ కాలనీలో రహదారులు, కాలువలు నిర్మించాలని, అడవివరంలో మురుగు నీటి సమస్యను పరిష్కరించాలని అర్జీలు అందజేశారన్నారు. ఆయా సమస్యల పరిష్కారానికి తగు చర్యలు తీసుకుంటామని అర్జీదారులకు జెడ్సీ తెలిపారు. ఆర్‌వో నారాయణరావు, వర్క్స్ డీఈ విజయ్‌కుమార్, ఏఎంహెచ్‌వో అప్పలనాయుడు తదితరులు పాల్గొన్నారు.

గ్రామాల్లో పేరుకుపోయిన వ్యర్థాల తొలగింపు

ఈనాడు కథనానికి స్పందన

పరవాడ, న్యూస్‌టుడే: పరవాడ మండలంలోని వాడచీపురుపల్లి, పరవాడ గ్రామాల్లో పేరుకుపోయిన చెత్తకుప్పలను తొలగించారు. గతకొద్ది రోజులుగా చెత్త, ప్లాస్టిక్ వ్యర్థాలు పేరుకుపోవడంతో దుర్వాసనతో ప్రజలు ఇక్కట్లు పడేవారు. శునకాలు చిందరవందర చేయడంతో పరిసరాలు అపరిశుభ్రంగా మారేవి. ఈగలు, దోమలు వృద్ధి చెందడంతో స్థానికులకు కంటినిండా నిద్ర కరవయ్యేది. ఈ సమస్యపై 'పల్లెలు వ్యర్థాలమయం' శీర్షికతో ఈనెల 7న 'ఈనాడు'లో ప్రచురించిన కథనానికి ఈవోపీఆర్డీ ధర్మారావు, వాడచీపురుపల్లి, పరవాడ పంచాయతీ కార్యదర్శులు అచ్యుతరావు, మురళీధర్ పట్నాయక్ స్పందించారు. పంచాయతీ పారిశుద్ధ్య సిబ్బందితో చెత్తను తొలగించి పరిసరాలను శుభ్రం చేయడంతో ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.


వాడచీపురుపల్లి సామాజిక భవనం వద్ద చెత్త తొలగించి శుభ్రం చేసిన దృశ్యం


పరవాడలో వ్యర్థాలను తరలిస్తున్న పారిశుద్ధ్య సిబ్బంది

విసిరే విత్తనం.. ఎదిగే వనమై..!

న్యూస్‌టుడే, గాజువాక

పరిశ్రమల కాలుష్యం చుట్టుముడుతుంటే... పర్యావరణ అసమతౌల్యతతో మొక్కలన్నీ కళ్లు తేలేస్తున్నాయి. పచ్చదనంతో కళకళలాడాల్సిన కొండలన్నీ మోడువారిన చెట్లతో బేలచూపులు చూస్తున్నాయి. ఈ పరిస్థితిలో మార్పు తీసుకొచ్చేందుకు అక్కడి యువకులు 'మొక్క'వోని సంకల్పంతో ముందడుగేశారు.



బస్తాల్ని కొండపైకి తీసుకెళ్తున్న సభ్యులు



★ యారాడ ప్రాంతానికి చెందిన మాజీ సైనికుడు గుజ్జారి శ్రీనివాసరావు సముద్ర తీరంలో పచ్చదనం కనుమరుగవడాన్ని చూసి అధ్యయనం చేశారు.

★ **యువతను సమీకరించి తీరం పొడవునా మొక్కల సంరక్షణను బాధ్యతగా తీసుకున్నారు. ఎండిపోయిన మొక్కలకు జీవం పోసే ప్రక్రియను నిత్యం కొనసాగిస్తున్నారు.**

★ తీరం నుంచి 3 కిలో మీటర్ల దూరంలో ఉన్న కొండపైకి బృందాలుగా చేరుకుని అక్కడ విత్తన బంతులు విసురుతూ, తాటి టెంకలు నాటుతున్నారు.

★ సముద్ర తీరంలో పచ్చదనం పెంచాలని నిర్ణయించుకున్నారు. తాటి, కొబ్బరిచెట్లు, ఇతర విత్తనాల సేకరణకు శ్రీకారం చుట్టారు.

★ ఇసుక తిన్నెలపై తాటిచెట్ల వేళ్లు భూమి లోపలికి సమాంతరంగా చాలా దూరం విస్తరిస్తాయి. ఉప్పునీటిని భూగర్భంలో ఉన్న మంచి నీటితో కలవకుండా చేయడంలో అవి ఎంతగానో దోహదపడతాయి. దీని దృష్టిలో ఉంచుకుని 2 కిలోమీటర్ల పొడవైన తీరంలో పర్యావరణం దెబ్బతినకుండా తాటి టెంకల్ని నాటి సంరక్షిస్తున్నారు.

ఆలోచన- అమలు

ప్రతి ఆదివారం, ఇతర సెలవు రోజుల్లో సంఘం సభ్యులంతా శ్రమదానం పేరుతో తీర సంరక్షణ క్రతువులో భాగస్వామం అవుతున్నారు.



యారాడ కొండపై విత్తన బంతులతో పర్యావరణానికి కృషి చేస్తున్న యువత

సిద్ధం చేసిన విత్తన బంతులతో యువకులు

విశాఖ శివారు యారాడ సముద్ర తీరంలోని కొండలపై పచ్చదనం పెంపునకు శ్రీ రామకృష్ణ పరమహంస సేవా సంఘం సభ్యులు శ్రీకారం చుట్టారు. విత్తన బంతులు విసరడంతో పాటు, తీరం వెంబడి ఇసుక తిన్నెలపై తాటి టెంకల్ని నాటి, ఆయా మొక్కల్ని సంరక్షిస్తూ అందరి ప్రశంసలు అందుకుంటున్నారు.

ఇదీ లెక్క (సుమారుగా)...

క్రతువులో భాగస్వాములవుతున్న యువకులు	60 మంది
ఇప్పటి వరకు నాటిన విత్తనాలు	22 వేలు
తీరంలో నాటిన తాటి టెంకలు	2 వేలు
కొత్తగా నాటిన కొబ్బరి చెట్లు	56

నిరంతర బాధ్యత..

గంగవరం పోర్టు, హెచ్‌పీసీఎల్, ఇతర రసాయన పరిశ్రమలతో యారాడ తీరం కాలుష్యమయంగా మారుతోంది. ఎక్కడికక్కడ చెట్లు ఎండి పోతుండడంతో శ్రీరామకృష్ణ పరమహంస సేవా సంఘం ఆధ్వర్యంలో ఓ యజ్ఞంలా విత్తన బంతులు విసురుతున్నాం. ఈ ప్రక్రియ నిరంతరం కొనసాగిస్తున్నాం.

-జి.శ్రీనివాసరావు, మాజీ సైనికుడు

నవంబర్‌లో క్రెడాయ్ విశాఖ ప్రోపర్టీ షో



ప్రారంభ వేడుకలో పాల్గొన్న జిల్లా కలెక్టర్ ఎం.ఎన్.హరేంధిర ప్రసాద్, అతిథులు

మురళీనగర్, న్యూస్‌టుడే : ఎంవీపీ కాలనీలో ఉన్న గాదిరాజు ప్యాలెస్‌లో నవంబర్ 29 నుంచి డిసెంబరు 1వరకు మూడు రోజులపాటు జరిగే 10వ క్రెడాయ్ విశాఖపట్నం ప్రోపర్టీ ఎక్స్‌పో 2024కు సంబంధించిన ప్రారంభ వేడుకను సోమవారం నిర్వహించారు. స్థానిక ఓ హోటల్‌లో జరిగిన ఈ కార్యక్రమాన్ని జిల్లా కలెక్టర్ ఎం.ఎన్.హరేంధిర ప్రసాద్ అధికారికంగా ప్రారంభించగా భారతీయ స్టేట్‌బ్యాంక్ డిప్యూటీ జనరల్ మేనేజర్, రియల్ ఎస్టేట్, హౌసింగ్ బిజినెస్ యూనిట్ అధికారి సీతాకాశీ సింగ్, ఎస్‌బీఐ జనరల్ మేనేజర్ పంకజ్‌కుమార్ హాజరయ్యారు. ఈ ప్రోపర్టీ ఎక్స్‌పో గణనీయమైన సంఖ్యలో సందర్శకులు, పెట్టుబడిదారులు, రియల్ ఎస్టేట్ ఔత్సాహికులను ఆకర్షిస్తుందని తెలిపారు. స్థానిక రియల్ ఎస్టేట్ రంగానికి ప్రోపర్టీ ఎక్స్‌పో ప్రాముఖ్యతను క్రెడాయ్ అధ్యక్షులు ధర్మేందర్ వరద, కార్యదర్శి వి.శ్రీను, ఛైర్మన్ కె.ఎస్.ఆర్.కె.రాజు వివరించారు. అనేకరకాలైన రియల్ ఎస్టేట్ ఎంపికలను ఒకేచోట చేర్చే వేదికగా ఇది పనిచేస్తుందని, సందర్శకులు ఒకేచోట బహుళ అవకాశాలు అన్వేషించడానికి వీలు కలుగుతుందన్నారు. ఈ ఎక్స్‌పోలో దాదాపు 80 స్టాల్స్ ఉంటాయని కన్వీనర్ సి.హెచ్.గోవిందరాజు పేర్కొన్నారు.

జాతీయ రహదారిపై కారు బోల్తా



ప్రమాదానికి గురైన కారు

మాధవధార, న్యూస్‌టుడే : ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల ఎదురుగా జాతీయ రహదారిపై పెను ప్రమాదం తప్పింది. ఈమేరకు ఘటనకు సంబంధించి కంచరపాలెం ట్రాఫిక్ పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. పెందుర్తి ప్రాంతానికి చెందిన కె.జ్యోత్స్న (35) సోమవారం ఎన్ఏడీ కూడలి నుంచి ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల వద్దకు వచ్చేసరికి ఎదురుగా ఉన్న ఆర్టీసీ బస్సును అధిగమించే క్రమంలో వెనుకనుంచి వస్తున్న ఓ లారీ కారును ఢీకొంది. దీంతో కారు అదుపు తప్పి బోల్తాపడింది. అయితే ఈ ప్రమాదంలో ఎటువంటి ప్రాణహాని లేకపోవడంతో అంతా ఊపిరి పీల్చుకున్నారు. ఘటనా స్థలానికి చేరుకున్న ట్రాఫిక్ ఏఎస్సై ప్రకాశ్ స్థానికుల నుంచి వివరాలు సేకరించి ప్రమాదానికి కారణమైన వాహనాలను స్టేషనుకు తరలించి కేసు దర్యాప్తు చేపట్టారు.

మాతృ మరణాలు సంభవిస్తే తీవ్ర చర్యలు

సీతంపేట, న్యూస్‌టుడే : జిల్లాలో మాతృమరణాలు సంభవిస్తే సంబంధిత బాధ్యులపై తీవ్ర చర్యలు ఉంటాయని జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారి డాక్టర్ పి.జగదీశ్వరరావు అన్నారు. డి.ఎం.హెచ్.ఒ కార్యాలయంలో ఆయన సోమవారం మాతృ మరణాలపై వైద్యులు, ఎ.ఎన్.ఎంలతో సమీక్ష జరిగింది. గత నెలలో దుర్గా బజార్ పట్టణ ఆరోగ్య కేంద్రం పరిధిలో ఒక మాతృ మరణం సంభవించినట్లు ఆయన తెలిపారు. కారణం అడిగి తెలుసుకున్నారు. గర్భిణిలు, బాలింతలు అనారోగ్యానికి గురైనప్పుడు వెంటనే సంబంధిత ఆరోగ్య కేంద్రంలో వైద్యునికి చూపించాలన్నారు. కార్యక్రమంలో డాక్టర్ పూర్ణేంద్రబాబు, డాక్టర్ శంకర్ ప్రసాద్, డాక్టర్ ఎస్.జీవన్‌రాణి, డాక్టర్ బి.ఉమావతి, డాక్టర్ ఎస్.షర్మిల కుమారి, డాక్టర్ శ్రీదేవి, డాక్టర్ శ్రవణ్, డాక్టర్ జి.వి.గణేష్, ఎస్.జయదేవి, ఐ.మనోరమ, వి.త్రినాథరావు తదితరులు పాల్గొన్నారు.



మాతృ మరణాలపై సమీక్షలో మాట్లాడుతున్న డి.ఎం.హెచ్.ఒ. డాక్టర్ పి.జగదీశ్వరరావు

విశాఖ చేరుకోవాల్సిన రైళ్ల సమయాల మార్పు

రైల్వేస్టేషన్, న్యూస్‌టుడే: దిల్లీ, ముంబయి, చెన్నై, హైదరాబాద్, కోర్బా, మచిలీపట్నం, నాందేడ్, బ్రహ్మపుర, కాకినాడ పోర్టు, భవానీపట్న, గాంధీధామ్, దుర్గ్, తిరుపతి, లోకమాన్య తిలక్, రాయపూర్, కిరండూల్, గుణుపురం, సికింద్రాబాద్, కొల్లాం ప్రాంతాల నుంచి విశాఖకు తిరుగు ప్రయాణమయ్యే పలు రైళ్లు.. గమ్యస్థానానికి 5 నుంచి 25 నిమిషాలు ఆలస్యంగా చేరుకునేలా వేళలు మార్పు చేసినట్లు రైల్వే వర్గాలు తెలిపాయి. ఈనెల 15వ తేదీ నుంచి కొన్ని రైళ్లకు ఈ సమయాలు అందుబాటులోకి రానుండగా మరికొన్నింటికి 18, 19, 20 తేదీల నుంచి వర్తించనున్నట్లు ఆ వర్గాలు పేర్కొన్నాయి.

ప్రభుత్వ కాలనీల్లో జనం కష్టాలు



తాటిచెట్ల పాలెంలోని వాంబే కాలనీలో నీటి సరఫరా ఇలా..

తాటిచెట్లపాలెం, న్యూస్‌టుడే

తాటిచెట్లపాలెం జాతీయ రహదారిని ఆనుకొని తలదాచుకుంటున్న మురికివాడ వాసుల కోసం గతంలో కాంగ్రెస్ ప్రభుత్వం వాంబే గృహాలు నిర్మించింది. వైఎస్సార్ నగర్, సోనియాగాంధీ నగర్, శివశంకర రజకుల కాలనీల్లో నిర్మించిన ఈ గృహాల్లో సుమారు ఆరు వందల కుటుంబాల వారు నివాసం ఉంటున్నారు. వీటికి సరైన నిర్వహణ లేకపోవడంతో కాలనీల్లో పలు సమస్యలు నెలకొని ఉన్నాయి. సరైన రోడ్లు, డ్రైనేజీలు లేవు. గోతులు, పెచ్చులూడిపోయిన రహదారుల మీదే స్థానికులు రాకపోకలు సాగిస్తున్నారు. ఇళ్ల ముందు మురుగు నీరు నిలిచిపోతుంది. రహదారులపై పేరుకుపోయిన చెత్తా చెదారంతో పరిసరాలు దుర్గంధ పూరితంగా తయారయ్యాయి. సెప్టిక్ ట్యాంకులు నిండిపోయి పైపులు లీకవుతున్నాయి. కాలనీల్లో మంచి నీటి కుళాయిలు ఉన్నా కేవలం గంట మించి నీటి సరఫరా జరగక పోవడంతో తాగునీటికి అవస్థలు పడుతున్నారు.



వాంబే కాలనీలో ఇళ్ల మధ్య నిలిచిపోయిన మురుగు నీరు

ఏఎస్‌ఆర్ నగర్ టిడ్కో గృహాల్లో..

ఏఎస్ఆర్ నగర్‌లోని రైల్వే స్థలంలో పిచ్చుక గూడుల్లాంటి గుడిసెల్లో నివాసం ఉంటున్న పేదల కోసం 280 టిడ్కో గృహాల నిర్మాణం జరిగింది. సార్వత్రిక ఎన్నికలకు కొద్ది నెలల క్రితమే వీటిని లబ్ధిదారులకు అప్పగించారు. ఎన్నికల్లో లబ్ధి పొందాలన్న ఆశతో ఆదరా, బాదరాగా వీటిని వైకాపా నాయకులు ప్రారంభించేసి చేతులు దులిపేసుకున్నారు. సరైన మౌలిక సదుపాయాలు కల్పించకపోవడంతో లబ్ధిదారులు అవస్థలు పడుతున్నారు. తాగునీటి సదుపాయం అరకొరగా ఉంది.



ఏఎస్‌ఆర్ నగర్‌లో నిర్మించిన టిడ్కో గృహాలు

మౌలిక సదుపాయాల కొరత



ఏఎస్ఆర్ నగర్‌లో నిర్మించిన టిడ్కో గృహాలు లబ్ధిదారులకు అప్పగించినా మౌలిక సదుపాయాలు అంతంత మాత్రంగానే ఉన్నాయి. ఇళ్లలో కొన్ని సదుపాయాలు లేకపోవడంతో తామే స్వయంగా వీటిని ఏర్పాటు చేసుకున్నాం. ప్రభుత్వం నిధులు కేటాయించి మౌలిక సదుపాయాలన్నీ సమకూర్చాలి. – ఏ.వెంకటపతి

సెప్టిక్ ట్యాంకులు లీకవుతున్నాయ్



ప్రభుత్వం నిర్మించిన టిడ్కో, వాంబే కాలనీల్లో మరుగుదొడ్లకు సంబంధించిన సెప్టిక్ ట్యాంకులు నిండిపోయి లీకవుతున్నాయి. దీంతో బయట మురుగునీరు నిలిచిపోవడంతో పరిసరాలు దుర్గంధపూరితంగా తయారయ్యాయి. ప్రభుత్వ యంత్రాంగం వాటి మరమ్మతులు చేపట్టాలి. – ఆవుల వీరమ్మ, గృహిణి

ఆర్టీసీ బస్సు ఢీకొని వృద్ధురాలి దుర్మరణం

పద్మనాభం, న్యూస్‌టుడే: అనంతవరం-కొవ్వాడ మార్గంలో సోమవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ వృద్ధురాలు ప్రాణాలు కోల్పోయినట్లు పోలీసులు తెలిపారు. ఆ వివరాలిలా.. పెంట గ్రామానికి చెందిన దేవరాపల్లి కన్నమ్మ (78) సోమవారం ఉదయం సుమారు 10.30 గంటల సమయంలో అనంతవరం గ్రామ శివారు పైడితల్లి ఆలయ సమీపంలో నడుచుకుని వెళుతోంది. అదే సమయంలో అనంతవరం వైపు నుంచి కొవ్వాడ వైపు వెళ్తున్న (222 కె) ఆర్టీసీ బస్సు ఆమెను ఢీకొంది. కింద పడిన ఆమె పైనుంచి బస్సు వెనుక చక్రం వెళ్లడంతో అక్కడికక్కడే మృతి చెందింది. కుటుంబీకుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు పేర్కొన్నారు.

దేవస్థానం అంతర్గత బదిలీల్లోనూ పైరవీలు

అనుకూలమైన స్థానాల కోసం ఈవోపై ఒత్తిళ్లు



అప్పన్న స్వామి దేవాలయం

సింహాచలం, న్యూస్‌టుడే: ప్రభుత్వం ఇటీవల చేపట్టిన బదిలీల్లో తమకు కావాల్సిన చోటుకు వెళ్లేందుకు వివిధ శాఖల అధికారులు, ఉద్యోగులు చేయని ప్రయత్నం అంటూ లేదంటే అతిశయోక్తి కాదు. అదే విధంగా రాష్ట్రంలోని ప్రధాన దేవాలయాల్లో కూడా బదిలీలు జరిగాయి. ఆయా బదిలీల్లో తప్పనిసరిగా కదలాల్సిన వారు తమకు అనుకూలమైన దేవాలయాలకు వెళ్లేందుకు ప్రజాప్రతినిధుల సిఫార్సులు వినియోగించుకున్న విషయం అందరికీ తెలిసిందే. ఈ సిఫార్సుల్లో వెనుకబడిన ఉద్యోగులు దూర ప్రాంతాలకు బదిలీ అయ్యారు. ఇంత వరకు బాగానే ఉన్నా.. సింహాచలం దేవస్థానంలో అంతర్గత బదిలీల్లోనూ ఆలయ కార్యనిర్వహణాధికారికి స్వేచ్ఛ లేకుండా పోయిందని ప్రచారం జరుగుతోంది. అంతర్గత బదిలీల్లో సైతం కొందరు అధికారులు, ఉద్యోగులు పైరవీలు చేయడం చర్చనీయాంశంగా మారింది.

★ సాధారణంగా కార్యనిర్వహణాధికారులు పరిపాలనలో సౌలభ్యం కోసం పని సామర్థ్యాల ఆధారంగా ఉద్యోగులకు వివిధ బాధ్యతలు అప్పగించడం పరిపాటి. కానీ, నాలుగో తరగతి ఉద్యోగి నుంచి ఏఈవో స్థాయి వరకు పలువురు తమకు ఫలానా సీటు కేటాయించాలని ఈవోకు ప్రజాప్రతినిధులతో సిఫార్సు చేయిస్తున్నట్లు తెలుస్తోంది. ఈ కారణంగా అంతర్గత బదిలీల ప్రక్రియలో జాప్యం జరుగుతోందని సమాచారం.

★ గతంలో వైకాపా అధికారంలో ఉండగా ఆ పార్టీకి అంటకాగిన ఉద్యోగులే ఇప్పుడూ పైచేయి సాధిస్తున్నారన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. ప్రజాప్రతినిధులు సైతం అలాంటి వారికే ప్రాధాన్యమివ్వడాన్ని కొందరు ఉద్యోగులు తప్పు పడుతున్నారు. బహిరంగంగా వైకాపా జెండాలతో తిరిగిన ఉద్యోగులు కొందరు ప్రస్తుత ప్రజాప్రతినిధులతో తమకు నచ్చిన స్థానానికి పోస్టింగ్ ఇవ్వాలని సిఫార్సు చేయిస్తున్నారని దేవస్థానంలో చర్చ నడుస్తోంది.

★ అవినీతి ఆరోపణలు ఎదుర్కొంటున్న ఒక ఉన్నతాధికారి తనకు కీలకమైన చోట పోస్టింగ్ ఇవ్వాలని నలుగురు ఎమ్మెల్యేలతో సిఫార్సు చేయిస్తున్నట్లు తెలుస్తోంది. ఆరోపణలున్న అధికారులకు కీలక స్థానాల్లో అవకాశం కల్పిస్తే దేవస్థానం ప్రతిష్ఠ దెబ్బతినే అవకాశం ఉందని ఉద్యోగులు ఆందోళన చెందుతున్నారు. ఒక ఉద్యోగి తన బాధ్యతలను పక్కనపెట్టి లేని పోస్టును తనకు కేటాయించాలని ఒత్తిడి చేస్తున్నట్లు సమాచారం. చివరికి రికార్డు అసిస్టెంట్లు, జూనియర్ అసిస్టెంట్లు సైతం తమ స్థాయిలో పైరవీలు చేయించుకుని నచ్చిన చోట పోస్టింగులు ఇవ్వాలని ఒత్తిడి చేస్తున్నారు. ఇదే పరిస్థితి కొనసాగితే దేవస్థానం ఈవోపై ఉద్యోగులకు గౌరవం లేకుండాపోయి పరిపాలన నీరుగారిపోతుందన్న ఆందోళనలు వ్యక్తమవుతున్నాయి. అంతర్గత బదిలీల్లో కూడా ప్రజాప్రతినిధులు జోక్యం చేసుకుంటే ఉద్యోగులను మందలించే పరిస్థితి కూడా లేకుండా పోతుందని పలువురు విశ్రాంత అధికారులు అభిప్రాయపడుతున్నారు.

వృద్ధులకు ఉపకరణాల పంపిణీ



వీల్‌ఛైర్ పంపిణీ చేస్తున్న మాజీ ఎంపీ నరసింహారావు, ఏడీ మాధవి, తదితరులు

పెదవాల్తేరు, న్యూస్‌టుడే: వయోవృద్ధుల సంక్షేమమే ధ్యేయంగా ప్రధాని నరేంద్ర మోదీ ప్రత్యేక పథకాలు అమలు చేస్తున్నారని మాజీ ఎంపీ జి.వి.ఎల్. నరసింహారావు అన్నారు. సిరిపురం బాలల ప్రాంగణంలో సోమవారం ఉదయం ఆయన ఉపకరణాల పంపిణీ కార్యక్రమాన్ని జ్యోతి వెలిగించి ప్రారంభించారు. అనంతరం మాట్లాడుతూ 'వయోశ్రీ' పథకం ద్వారా రూ.44 లక్షల విలువ చేసే 3083 ఉపకరణాలు 817 మంది వయోవృద్ధులకు అందజేస్తున్నట్లు తెలిపారు. విభిన్న ప్రతిభావంతుల వయో వృద్ధుల సంక్షేమ శాఖ సహాయ సంచాలకులు జె.మాధవి మాట్లాడుతూ అలీమ్ కో సహాయంతో వీటిని పంపిణీ చేస్తున్నట్లు పేర్కొన్నారు. వీల్‌ఛైర్లు, వినికిడి యంత్రాలు, నెక్ కాలర్, నీ బెల్ట్, నడుము బెల్ట్, రోలేటర్, క్రచ్చస్, ఎల్బో, వాకింగ్ స్టిక్స్ లాంటి ఉపకరణాలు ఉన్నాయన్నారు. అర్హులై ఉండి హాజరు కానివారు కార్యాలయాన్ని సంప్రదించాలని కోరారు. అలీమ్‌కో డిప్యూటీ జనరల్ మేనేజర్ సంజయ్ సింగ్, ప్రోగాం ఆఫీసర్ రవిశంకర్, భాజపా ఏపీ వైద్యవిభాగం కన్వీనర్ రూపాకుల రవికుమార్, దివ్యాంగుల సంక్షేమ శాఖ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

అడిగింది ఇచ్చుకో.. నచ్చినట్లు కట్టుకో..!



మిథిలాపురి వుడాకాలనీలో జీవీఎంసీ అనుమతి లేకుండా నివాసాల మధ్య నిర్మిస్తున్న పెట్రోల్‌బంక్

- **బదిలీ చేసినా కదలని అధికారులు**
- **జోన్-2లో యథేచ్ఛగా అక్రమ కట్టడాలు**

మధురవాడ, పీఎంపాలెం, న్యూస్‌టుడే: జీవీఎంసీ జోన్-2 పరిధిలో అక్రమ నిర్మాణాలు యథేచ్ఛగా కొనసాగుతున్నాయి. వైకాపా ప్రభుత్వ హయాంలో విచ్చలవిడిగా దండుకున్న పట్టణ ప్రణాళికా విభాగం అధికారులు కొందరు నేటికీ అదే పంథా సాగిస్తున్నారు. కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టి వంద రోజులు గడిచినా అక్రమ నిర్మాణాలకు అడ్డుకట్ట పడడం లేదు. తాము అభయమిస్తే అక్రమ నిర్మాణం సక్రమం అన్నట్టుగా పలు నిర్మాణాల విషయంలో అధికారుల వ్యవహారశైలి కనిపిస్తోంది. అనధికారిక కట్టడాలపై ఎలాంటి ఫిర్యాదులు వచ్చినా పట్టించుకోవడం లేదు. అదేమంటే నోటీసులు ఇచ్చామని సచివాలయ ప్రణాళిక విభాగం కార్యదర్శులు ఒకటే పాట పాడుతున్నారు. ప్రతి వంద భవనాలకు ఒక కార్యదర్శి ఉన్నా క్షేత్రస్థాయిలో అక్రమ కట్టడాల నియంత్రణ మాత్రం ఆగడం లేదు.

పీఎంపాలెం ప్రధాన రహదారి రెండో బస్‌స్టాప్ కూడలిలో మూడంతస్తుల నివాస సముదాయం పేరిట అనుమతులు తీసుకుని వాణిజ్య సముదాయం నిర్మించారు. మూడంతస్తులకు ముసుగు వేసి షట్టర్లు ఏర్పాటు చేశారు. నడిరోడ్డుపై నిబంధనలు అతిక్రమించి ఇంత వ్యవహారం జరుగుతున్నా ప్రణాళికా విభాగం అధికారులు నోటీసులు ఇచ్చామని చెప్పడం గమనార్హం.



క్రికెట్ స్టేడియం బి-మైదానం గేటు పక్కన టీడీఆర్ లేకుండా నిర్మించిన అదనపు అంతస్తు

● క్రికెట్ స్టేడియం బి-మైదానం ప్రధాన గేటు సమీపంలో నాలుగు అంతస్తులకు అనుమతి పొంది టీడీఆర్ లేకుండా అదనపు అంతస్తు నిర్మించారు. దీనిపై ఫిర్యాదులు అందడంతో ప్రణాళికా విభాగం అధికారులు రెండడుగుల మేర స్లాబ్‌ను తాత్కాలికంగా తొలగించి పనులు నిలుపుదల చేసినట్టు హడావుడి చేశారు. నెల రోజులు గడవక ముందే నిర్మాణదారులు అదనపు అంతస్తులో నిర్మాణ పనులు కాస్త పూర్తి చేసి దర్జాగా రంగులు వేస్తున్నారు.

● మిథిలాపురి వుడాకాలనీ రోడ్డులో జనావాసాల మధ్య జీవీఎంసీ అనుమతులు లేకుండా పెట్రోల్‌బంక్ నిర్మాణం జరుగుతోంది. సంబంధిత పనులు క్షేత్రస్థాయిలో ఉండగా స్థానికులు పలువురు ఫిర్యాదులు చేయగా నోటీసులిచ్చి ఊరుకున్నారు. సంబంధిత బంకు నిర్మాణం చేపట్టిన స్థలంలో కొంత ప్రభుత్వ భూమి ఉన్నట్లు ఆరోపణలు ఉన్నా జీవీఎంసీ, రెవెన్యూ అధికారులు మాత్రం కన్నెత్తి చూడడం లేదు. ఇన్ని ఆరోపణల మధ్య నిర్మాణదారులు దర్జాగా బంక్ నిర్మాణం 90 శాతం పైగా పూర్తిచేశారు.

● పీఎంపాలెం ఆఖరి బస్‌స్టాప్ కూడలిలో అనుమతులు లేకుండా నాలుగు వాణిజ్య సముదాయాలు నిర్మించినా.. ఇంత వరకు అధికారులు పట్టించుకోలేదు. సంబంధిత నిర్మాణాలకు పట్టణ ప్రణాళిక విభాగంలోని ఓ అధికారి హస్తం ఉన్నట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఇలాంటి ఎన్నో అనధికారిక నిర్మాణాలు జోరుగా జరుగుతున్నాయని కూటమి నాయకులు పలువురు ఆరోపిస్తున్నారు.

బదిలీ చేసినా కుర్చీలు వీడని అధికారులు

జోన్-2 పట్టణ ప్రణాళికా విభాగంలో కొందరు అధికారులకు ఇటీవల బదిలీ అయింది. అయితే ఇద్దరు మాత్రం కుర్చీలు వీడడం లేదు. వైకాపా హయాంలో అప్పటి మంత్రి ఆదిమూలపు సురేష్ అండతో ఒకరు జోన్-2లో పోస్టింగ్ సంపాదించారు. ఆయనతో పాటు మరొకరు సైతం వైకాపా పాలనలో ఆ పార్టీ నేతలతో అంటకాగి అక్రమ నిర్మాణాలకు విచ్చలవిడిగా అనుమతులిచ్చారని ఆరోపణలున్నాయి. వీరి అండదండలతో కొందరు వైకాపా నేతలు చిన్న, పెద్ద భవనాల వద్ద అందిన కాడికి దోచుకుని చక్రం తిప్పారు. ప్రభుత్వం మారినా ఏవేవో కారణాలు చెప్పి వారు మాత్రం జోన్-2 కార్యాలయాన్ని వీడడం లేదు.



పీఎంపాలెం రెండో బస్‌స్టాప్ కూడలిలో నివాస అనుమతులు పొంది వాణిజ్య సముదాయం నిర్మిస్తున్న దృశ్యం

ఎం.వి సత్యనారాయణపై తదుపరి చర్యలు నిలిపివేత

పెదవాల్తేరు, న్యూస్‌టుడే: మహావిశాఖ నగర పాలక సంస్థ (జీవీఎంసీ) కమిషనర్‌గా గతంలో విధులు నిర్వహించిన ఎం.వి.సత్యనారాయణపై తదుపరి క్రమశిక్షణ చర్యలు నిలిపివేస్తూ రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి నీరబ్‌కుమార్ ప్రసాద్ సోమవారం ఉత్తర్వులు జారీచేశారు. ఆయన కమిషనర్‌గా ఉన్న సమయంలో పరదేశిపాలెంలో నిర్మించిన జె.ఎన్.ఎన్.యు.ఆర్.ఎం గృహాల గుత్తేదారుకు సెక్యూరిటీ డిపాజిట్ నిధులు చెల్లింపుల్లో అక్రమాలకు పాల్పడినట్లు అవినీతి నిరోధక శాఖ (అనిశా) అభియోగాలు నమోదు చేసింది. విచారణ అనంతరం ఆయన ఇచ్చిన సమాధానానికి సంతృప్తి చెందిన ప్రభుత్వం తదుపరి చర్యలను ఉపసంహరించినట్లు తెలిపింది. ప్రస్తుతం ఆయన ఉద్యోగ విరమణ చేశారు.

స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణ ఆపాలి: బొత్స

పెదవాల్తేరు, న్యూస్‌టుడే: స్టీల్ ప్లాంట్ ప్రైవేటీకరణ ఆపాలని శాసన మండలి ప్రతిపక్ష నేత బొత్స సత్యనారాయణ డిమాండ్ చేశారు. విశాఖలోని లాసన్స్‌బేకాలనీ వైకాపా కార్యాలయంలో సోమవారం సాయంత్రం నిర్వహించిన విలేకరుల సమావేశంలో బొత్స మాట్లాడుతూ.. గతంలో భూములు కేటాయింపులు చేసినా రైల్వేజోన్ ఏర్పాటులో జాప్యం చేస్తున్నారని పేర్కొన్నారు. వాల్తేరు డివిజన్‌తో కూడిన రైల్వేజోన్ ఏర్పాటు చేయాలన్నారు. ముఖ్యమంత్రి దిల్లీ పర్యటన నేపథ్యంలో రాష్ట్రానికి ప్రత్యేక హోదాను సాధించాలని కోరారు. మార్చి నెలలో విశాఖ పోర్టుకు వచ్చిన 25 వేల కేజీల డ్రగ్స్ పురందేశ్వరి బంధువులకు సంబంధించిందిగా తేలిందని.. అయినా దాని గురించి ఇప్పుడు పట్టించుకోవట్లేదని ఆరోపించారు. ఇసుక, నిత్యావసర ధరల పెరగడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని పేర్కొన్నారు.

కాళ్లు చేతులు కట్టేసి కృష్ణాలో పడేసి..

- **వాటా డబ్బులు అడిగాడని వ్యాపార భాగస్వామి హత్య**
- **హైదరాబాద్‌లో అపహరణ.. కొత్తకోటలో ఘాతుకం**
- **ఐదుగురి అరెస్టు.. పరారీలో ప్రధాన నిందితుడు**



వెంకటప్పన్నరెడ్డి (పాతచిత్రం)

జీడిమెట్ల, న్యూస్‌టుడే: వ్యాపారం నుంచి తప్పుకొన్న భాగస్వామి తన వాటా డబ్బులు తిరిగివ్వమని అడగ్గా ఇష్టం లేని స్నేహితుడే అతడ్ని కిరాయి వ్యక్తులతో అపహరించి.. కాళ్లు చేతులు కట్టేసి కృష్ణా నదిలో పడేసి హత్య చేయించాడు. మేడ్చల్ జిల్లా జగద్గిరిగుట్ట ఠాణా పరిధిలో జరిగిన ఈ ఘటనకు సంబంధించి పోలీసులు ఐదుగురిని అరెస్టు చేశారు. ప్రధాన నిందితుడు పరారీలో ఉన్నాడు. షాపూర్‌నగర్‌లోని బాలానగర్ డీసీపీ కార్యాలయంలో ఇన్‌ఛార్జి డీసీపీ కోటిరెడ్డి సోమవారం విలేకరుల సమావేశంలో వివరాలు వెల్లడించారు. విశాఖపట్నం జిల్లా భీమిలికి చెందిన వెంకటప్పన్నరెడ్డి(54) రెండేళ్ల క్రితం హైదరాబాద్ వచ్చారు. భార్య, ఇద్దరు కుమారులతో ఆల్విన్ కాలనీ ఈస్ట్‌సాయినగర్‌లో ఉంటున్నారు. బాలానగర్‌లోని మెఘా ఇంజినీరింగ్ సంస్థలో ఏజీఎంగా పనిచేస్తున్నారు. ఈ నెల 4న విధులకు వెళ్లి.. రాత్రైనా తిరిగి రాకపోవడంతో భార్య హేమ పోలీసులకు ఫిర్యాదు చేశారు. సీసీ కెమెరాల ఆధారంగా స్నేహితుడే అపహరించినట్లు గుర్తించారు.

కిరాయి ముఠా సహాయంతో..

అన్నమయ్య జిల్లా కలికిరి మండలానికి చెందిన బత్తిన ద్వారకానాథ్‌రెడ్డి(48) వెంకటప్పన్నరెడ్డికి విశాఖపట్నంలో పరిచయమయ్యాడు. ఇద్దరు 2021-22లో కాకినాడ పోర్టులో క్యాటరింగ్, క్లీనింగ్ సర్వీస్ వ్యాపారం చేశారు. లావాదేవీల్లో విభేదాలు వచ్చాయి. భాగస్వామి వాటా డబ్బులు రూ.28 లక్షలు చెల్లించేందుకు ద్వారకానాథ్‌రెడ్డి అంగీకరించాడు. నెలలు గడుస్తున్నా ఇవ్వకపోవడంతో ఇటీవల ద్వారకానాథ్‌రెడ్డి ఇంటికి వెళ్లి తన డబ్బులివ్వాలని వెంకటప్పన్నరెడ్డి నిలదీశాడు. డబ్బు ఇవ్వడం ఇష్టంలేక, కుటుంబ సభ్యుల ముందు నిలదీయడంతో పరువు పోయిందని స్నేహితుడిని హత్య చేసేందుకు ద్వారకానాథ్‌రెడ్డి పథకం వేశాడు. తెలిసిన వారి సాయంతో వైఎస్సార్ జిల్లా వేంపల్లె మండలానికి చెందిన సుధాకర్‌రెడ్డి(59)కి విషయం చెప్పాడు. అదే ప్రాంతానికి చెందిన పాశం ప్రసాద్(36) బుసుపాటి కిరణ్‌కుమార్(30), గడ్డం వెంకటసుబ్బయ్య(25) అన్నిక మణికంఠ(25)లకు రూ.10వేల చొప్పున చెల్లించి హత్యకు ఒప్పందం చేసుకున్నాడు. వారు ఈ నెల 4న ద్విచక్రవాహనంపై ఇంటికెళ్తున్న వెంకటప్పన్నరెడ్డిని కూకట్‌పల్లి మైత్రీనగర్ వద్ద అడ్డుకున్నారు. క్లోరోఫాం చల్లి అపస్మార స్థితిలోకి వెళ్లడంతో కారులో జోగులాంబ గద్వాల జిల్లా కొత్తకోట తీసుకెళ్లారు. కాళ్లు, చేతులు కట్టేసి బీచుపల్లి బ్రిడ్జి మీద నుంచి కృష్ణానదిలో పడేశారు. భార్య ఫిర్యాదుతో ద్వారకానాథ్‌రెడ్డి గురించి ఆరా తీయగా అతడు నగరానికి వచ్చినట్లు సాంకేతిక ఆధారాల ద్వారా తెలిసింది. సీసీ కెమెరాలను జల్లెడపట్టి అపహరించి కొత్తకోట తీసుకెళ్లినట్లు గుర్తించారు. అక్కడ లాడ్జీలో ఉన్న సుధాకర్‌రెడ్డి ముఠా దొరికింది. పడేసిన చోటు నుంచి 15 కి.మీ. దూరంలో మృతదేహం తేలింది. విలేకరుల సమావేశంలో అదనపు డీసీపీ సత్యనారాయణ, బాలానగర్ ఏసీపీ హనుమంతరావు, జగద్గిరిగుట్ట ఇన్‌స్పెక్టర్ క్రాంతి కుమార్ ఉన్నారు.

సినిమాలు
చిట్టివలస(తగరపువలస), న్యూస్‌టుడే

గణేశ్ – సత్యం సుందరం
రాములమ్మ– దేవర
తాతా – దక్షిణ, సప్తగిరి– శ్వాగ్
చోటుమహరాజ్ (ఆనందపురం) – దేవర

మందుబాబులకు జరిమానా

పీఎంపాలెం, న్యూస్‌టుడే: మధురవాడ పరిసర ప్రధాన రోడ్లపై మద్యం తాగి వాహనాలు నడిపిన 16 మందిపై కేసులు నమోదు చేయగా వారికి ఆబ్కారీ జ్యుడీషియల్ విభాగ న్యాయమూర్తి సోమవారం జరిమానా విధించినట్లు పీఎంపాలెం ట్రాఫిక్ పోలీసు స్టేషన్ ఎస్సై జి.ప్రసాద్ తెలిపారు. ఒక్కొక్కరికి రూ.10 వేల చొప్పున మొత్తం రూ.1.60 లక్షల అపరాధ రుసుం విధించారన్నారు.

భీమిలి

కొత్త మద్యం దుకాణాలకు శ్రీకారం

- భీమిలి స్టేషన్ పరిధిలో ఏర్పాటు కానున్నవి 34
- ఈనెల 9వ తేదీ వరకూ దరఖాస్తుల స్వీకరణ
- ఎక్సైజ్ సీఐ శ్రీనివాసరావుతో 'న్యూస్‌టుడే'

ముఖాముఖి

తగరపువలస, గ్రామీణభీమిలి, న్యూస్‌టుడే


వైకాపా పాలనలో నిర్వీర్యమైన మద్యం విధానాన్ని (పాలసీ) కూటమి ప్రభుత్వం సమూలంగా ప్రక్షాళన చేపట్టింది. అందులో భాగంగా మద్యం దుకాణాలను 2019 సం. ముందు మాదిరి ప్రయివేటు వ్యక్తులకు అప్పగించడానికి దరఖాస్తులు స్వీకరిస్తోంది. సెబ్, ఎక్సైజ్ అంటూ జగన్ ప్రభుత్వం వేరు చేసిన ఎక్సైజ్ శాఖను ఏకీకృతం చేసింది. మద్యం ధరలను నియంత్రించడంతో పాటు నాసిరకం మద్యానికి బదులుగా నాణ్యమైనది ప్రజలకు అందించే ఏర్పాట్లు చేస్తోంది. ఈ నేపథ్యంలో భీమిలి ఎక్సైజ్ స్టేషన్ సర్కిల్ ఇన్‌స్పెక్టరు పిన్నింటి శ్రీనివాసరావు 'న్యూస్‌టుడే' ముఖాముఖిలో వెల్లడించిన వివరాలు ఆయన మాటల్లోనే..



➤ నూతన మద్యం విధానం 2024-26 అమలులోకి రానుంది. ప్రస్తుత విధానంలో నిర్వహిస్తున్న ప్రభుత్వ మద్యం దుకాణాలు రద్దు కానున్నాయి. ఈనెల తొమ్మిదో తేదీ వరకూ దరఖాస్తులు స్వీకరిస్తున్నాం. ఆన్‌లైన్‌లో htpps:///hpfsproject.com వెబ్‌సైట్‌లో దరఖాస్తు చేసుకోవాలి. లేదా భీమిలి పోలీసుస్టేషన్ సమీపంలోని ఎక్సైజ్ కార్యాలయ పనివేళల్లోనూ దరఖాస్తులు అందించవచ్చు. ఏదైనా ఇంటర్‌నెట్ (అంతర్జాల) కేంద్రాలకు వెళ్లి కూడా దరఖాస్తు చేసుకోవచ్చు.

➤ మద్యం దుకాణ దరఖాస్తుదారులకు నగరంలోని వుడా బాలల ఎరీనా ప్రాంగణంలో ఈనెల 11వ తేదీ ఉదయం జిల్లా ఉన్నతాధికారుల సమక్షంలో డ్రా తీస్తాం. ఒకే దుకాణానికి ఎక్కువ దరఖాస్తులు వస్తే లాటరీ ద్వారా ఎంపిక చేస్తాం.

➤ ఎంపికైన వారికి 11వ తేదీ మధ్యాహ్నం 12 గంటలకు ప్రొవిజినల్ లైసెన్సులు అందజేస్తాం. ఆ వెంటనే ఆనందపురం డిపో నుంచి మద్యం తెచ్చుకుని లైసెన్సుదారులు దుకాణాలు ప్రారంభించవచ్చు. ఆ తర్వాత నిబంధనలన్నీ సరిపోయాయని నిర్ధారించాక పూర్తి స్థాయి లైసెన్సును పది రోజుల్లో అందజేస్తాం. గ్రామీణ ప్రాంతానికి లైసెన్సు పొందిన వారు రూరల్ పరిధిలో ఎక్కడైనా దుకాణాన్ని ఏర్పాటు చేసుకోవచ్చు. జీవీఎంసీ పరిధిలో లైసెన్సు పొందిన వారు నగరంలో ఎక్కడైనా తమకు నచ్చిన ప్రాంతంలో దుకాణాన్ని ప్రారంభించే అవకాశాన్ని ప్రభుత్వం కల్పించింది.



➤ ప్రభుత్వ మద్యం దుకాణాలు ఈనెల 11 నుంచి మూతపడనున్నాయి. ఇందులో పనిచేసే సిబ్బందిని ఏం చేయాలనేది ప్రభుత్వం నిర్ణయించనుంది. ప్రస్తుతానికి వీరి విషయంలో ఎలాంటి ఆదేశాలు రాలేదు. ప్రయివేటు దుకాణాలకు లైసెన్సులు పొందినవారు తమకు నచ్చినవారికి సిబ్బందిగా నియమించుకోవచ్చు. మద్యం ధరలు గతంలో కంటే తగ్గనున్నాయి. అదేవిధంగా నాణ్యమైన మద్యాన్ని ప్రజలకు అందించాలన్నదే ప్రభుత్వ లక్ష్యం.

★ భీమిలి ఎక్సైజ్ స్టేషన్ పరిధిలోని గ్రామీణ ప్రాంతాలైన భీమిలిగ్రామీణం, ఆనందపురం, పద్మనాభం మండలాల్లో 19 మద్యం దుకాణాలు, జీవీఎంసీ పరిధిలోని భీమునిపట్నం, తగరపువలస, చిట్టివలస, సంగివలస, బీచ్‌రోడ్డు ప్రాంతాల్లో 15 దుకాణాలు రానున్నాయి.

గణాంకాలు

మండలం/జోన్	మద్యం దుకాణాలు
భీమిలిగ్రామీణం	04
భీమిలి అర్బన్	15
పద్మనాభం	07
ఆనందపురం	08

★ లైసెన్సు ఫీజు: గ్రామీణ ప్రాంతాల్లో రూ.65 లక్షలు
★ నగర ప్రాంతాల్లో (జీవీఎంసీ పరిధి): రూ.85 లక్షలు
★ దరఖాస్తుల స్వీకరణ: ఈనెల 9వ తేదీ సాయంత్రం అయిదు గంటల వరకూ ఆన్‌లైన్, ఆఫ్‌లైన్ విధానాల్లో స్వీకరిస్తున్నారు.

ఎక్సైజ్ స్టేషన్ అధికారులు, సిబ్బంది వివరాలివీ

★ సర్కిల్ ఇన్‌స్పెక్టరు శ్రీనివాసరావు - 94409 02398
★ సబ్ ఇన్‌స్పెక్టరు అనిల్ - 94417 35689
★ సబ్ ఇన్‌స్పెక్టరు వెంకటరాజు - 98493 16751
★ హెడ్ కానిస్టేబుళ్లు - 3 ★ కానిస్టేబుళ్లు - 6

ఎండాడ, న్యూస్‌టుడే

సమస్య: వరాహగిరినగర్(ఎండాడ)లో వీధి దీపాలు వెలగక ఇబ్బందులు పడుతున్నాం.
– నర్సింగరావు, వరాహగిరినగర్

సమాధానం: వీధి దీపాలు వెలిగేలా చర్యలు తీసుకుంటాం. – సురేష్, విద్యుత్ విభాగం ఏఈ

సమస్య: దుర్గానగర్(ఎండాడ) సమీప లేఅవుట్‌లోని జీవీఎంసీ పార్కు అధ్వానంగా ఉంది.
– స్థానికులు, దుర్గానగర్

సమాధానం: పార్కు శుభ్రతకు చర్యలు తీసుకుంటాం.
– రవి, వార్డు శానిటరీ ఇన్‌స్పెక్టర్

మేమున్నాం.. మీకు తోడుగా
80086 11711, 99122 22247
సమయం: ఉ॥ 10 నుంచి మ॥ ఒంటి గంట మధ్య

సమస్య: జాతీయ రహదారి(ఎండాడ) బస్‌స్టాప్ వెనుక పరిసరాల్లో పిచ్చిమొక్కలు పెరిగిపోవడంతో ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్నారు.
– శ్రీకాంత్ వర్మ, ప్రయాణికుడు

సమాధానం: సంబంధిత ప్రాంతాల్లో శుభ్రత పనులు చేపడతాం.
– సింహాచలం, జోన్–2 కమిషనర్

కనులపండువగా అప్పన్న నిత్య కల్యాణం



ప్రత్యేక అలంకరణలో స్వామి, అమ్మవార్లు



పూజల్లో పాల్గొన్న భక్తులు

సింహాచలం, న్యూస్‌టుడే: సింహాద్రి అప్పన్న స్వామి నిత్య కల్యాణోత్సవం సోమవారం కనులపండువగా జరిగింది. భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని స్వామిని సేవించారు. అర్చకులు వేదమంత్రాలతో ఆశీర్వదించి కల్యాణ తలంబ్రాలు, శేషవస్త్రాలు అందజేశారు.

★ సింహగిరిపై శ్రీవరాహలక్ష్మీ నృసింహ స్వామివారి దేవాలయంలో జరుగుతున్న శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా సోమవారం సాయంత్రం అమ్మవార్ల తిరువీధి వేడుకగా జరిగింది. ఉదయం ఆలయ హంసమూలన పండితులు శ్రీరామాయణం పారాయణం చేశారు.

గరుడ వాహనంపై గోవిందుడి వైభోగం



సింహాచలం, న్యూస్‌టుడే: శ్రీవరాహలక్ష్మీ నృసింహ స్వామివారి దేవాలయంలో జరుగుతున్న ఆర్జిత సేవల్లో భాగంగా సోమవారం గరుడ వాహన సేవ ప్రత్యేక పూజా కార్యక్రమం వైభవోపేతంగా జరిగింది. అర్చకులు స్వామివారి ఉత్సవమూర్తి గోవిందరాజ స్వామిని పట్టు పీతాంబరాలు, ఆభరణాలతో అలంకరించి ఆలయ కల్యాణ మండపంలోని వెండి గరుడ వాహనంపై కొలువుదీర్చాక తులసీదళాలతో అర్చించారు. భక్తులు స్వామికి ప్రదక్షిణలు చేసి మొక్కు తీర్చుకున్నారు. అర్చకులు వేదమంత్రాలతో వారిని ఆశీర్వదించి తీర్థ ప్రసాదాలు అందజేశారు.

మధురవాడ సంత తరలించవద్దు



ఆందోళనలో పాల్గొన్న వర్తకులు, ప్రజా సంఘాల ప్రతినిధులు

కార్పొరేషన్, వన్‌టౌన్, న్యూస్‌టుడే: మధురవాడలో ఏళ్ల తరబడి నిర్వహిస్తున్న సంతను తరలించవద్దని సంత వర్తకులకు అన్యాయం చేయవద్దని సీఐటీయూ నాయకులు రాజ్‌కుమార్ అన్నారు. సంత తరలింపు నిర్ణయానికి వ్యతిరేకంగా సోమవారం జీవీఎంసీ గాంధీ విగ్రహం వద్ద ప్రజాసంఘాల ఆధ్వర్యంలో ఆందోళన నిర్వహించారు. సంత తరలించి పొట్టకొట్టవద్దని, రెండు వారాలుగా వర్తకులను ట్రాఫిక్ పోలీసులు, జీవీఎంసీ సిబ్బంది ఇబ్బందులకు గురిచేస్తున్నారన్నారు. పీఓడబ్ల్యూ లక్ష్మి మాట్లాడుతూ సంతతోనే ట్రాఫిక్‌కు ఇబ్బంది కలిగిందని భావించడం సరికాదని, మిగతా ప్రాంతాలలోనూ ఇదే విధంగా ట్రాఫిక్ సమస్య ఉందని, సంతతో ఎలాంటి ట్రాఫిక్ అవాంతరం లేదని పోలీసులకు తెలిసినా, దాడులు చేయడం సరికాదన్నారు. ఆందోళనలో ప్రజా సంఘాల నాయకులు డి.అప్పలరాజు, అరుణ, వెంకటేశ్వరరావు, ఫాతిమా, పైడికొండ తదితరులు పాల్గొన్నారు.

ఆలయానికి విద్యుత్తు దీపాలంకరణ

తిరుమల శ్రీవారి బ్రహ్మోత్సవాలు, దసరా వేడుకలను పురస్కరించుకుని రుషికొండ శ్రీమహాలక్ష్మీ, గోదాదేవి సహిత శ్రీవేంకటేశ్వరస్వామి ఆలయాన్ని విశేషంగా అలంకరించారు. విద్యుత్ దీపాలంకరణ భక్తులను విశేషంగా ఆకట్టుకుంటోంది.
– న్యూస్‌టుడే, ఎండాడ



సీహెచ్‌సీ ఒప్పంద కార్మికుల ఆందోళన

భీమునిపట్నం, న్యూస్‌టుడే: భీమిలి సామాజిక ఆరోగ్య కేంద్రం(సీహెచ్‌సీ)లో పనిచేస్తున్న ఒప్పంద కార్మికులకు వేతనాల బకాయిలు దసరా పండగలోగా చెల్లించకుంటే ప్రత్యక్ష సమ్మెలోకి దిగుతామని ఆంధ్రప్రదేశ్ మెడికల్ కాంట్రాక్ట్ ఎంప్లాయిస్ వర్కర్ల యూనియన్(ఏఐటీయూసీ) జిల్లా ప్రధాన కార్యదర్శి కోన లక్ష్మణ డిమాండ్ చేశారు. వేతన బకాయిల కోసం నల్లబ్యాడ్జీలు ధరించి విధులు నిర్వహిస్తున్న ఒప్పంద ఉద్యోగులు సోమవారం భీమిలి సీహెచ్‌సీ వద్ద ధర్నా నిర్వహించారు. పలువురు ఒప్పంద కార్మికులు, తదితరులు పాల్గొన్నారు.



విజినిగిరిపాలెంలో..



తొలిపావంచా వద్ద..



తగరపువలస విజయదుర్గా మల్లేశ్వరస్వామి ఆలయంలో..



పెద మంగమారిపేట పంచాయతీ భవనం వద్ద..



తగరపువలస బాలగణపతి యూత్ ఆధ్వర్యంలో..



తగరపువలస శివ గణేశ్ యూత్ ఆధ్వర్యంలో..



శ్రీసిద్ధేశ్వరస్వామి పీఠంలో..



రేవళ్లపాలెంలో..

మహాచండీ నమోస్తుతే..



డెక్కతిపాలెంలో..

భీమిలి నియోజకవర్గంలో జరుగుతున్న శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా సోమవారం దుర్గాదేవి మహాచండీ అవతారంలో అనుగ్రహించారు. పలు మండపాల్లో అమ్మవారు వేర్వేరు రూపాల్లో భక్తుల పూజలందుకున్నారు. అర్చకులు త్రిశక్తి స్వరూపిణిని అష్టోత్తర పూజలతో ఆరాధించారు. మహిళలు సామూహిక కుంకుమార్చనల్లో పాల్గొన్నారు. కొన్ని చోట్ల అన్నదానాలు, భవానీ భక్తుల అగ్నిగుండం పూజలు జరిగాయి. ఈ సందర్భంగా వివిధ ఆలయాల్లో ఉత్సవ కమిటీలు దీపారాధనలు వంటి ఆధ్యాత్మిక కార్యక్రమాలు నిర్వహిస్తున్నాయి.



చిట్టివలస సంతపేట నాగవంశం వీధిలో..

– న్యూస్‌టుడే, సింహాచలం, తగరపువలస, గ్రామీణభీమిలి, కొమ్మాది, భీమునిపట్నం, సాగర్‌నగర్, ఎండాడ, పద్మనాభం



పద్మనాభం మండలం రెడ్డిపల్లిలో..



ఎండాడ దురాదేవి ఆలయంలో...



సుభాష్‌నగర్‌లో....




సాగర్‌నగర్ బంగారమ్మ ఆలయంలో..



గీతం వైద్య కళాశాల ప్రాంగణంలో..



ఏతకుమ్మరిపాలెం వద్ద..



భీమిలి సాగరతిరుమల క్షేత్రంపై..



చంద్రంపాలెం జాతరగట్టుపై..

ఉరేసుకుని కూలీ బలవన్మరణం

పీఎంపాలెం, న్యూస్‌టుడే: ఓ వ్యక్తి ఉరేసుకుని బలవన్మరణానికి పాల్పడినట్లు సీఐ జి.బాలకృష్ణ తెలిపారు. ఆ వివరాలిలా.. పార్వతీపురం సమీప వేమకోటవారివీధిలో కేసలి అప్పలనాయుడు(38), భార్య కుమారి, ఇద్దరు కుమారులతో కలిసి నివసిస్తున్నారు. భార్యాభర్తలిద్దరూ కూలి పనులు చేసుకుని జీవనాధారం పొందుతున్నారు. నెల రోజుల క్రితం భర్త మధురవాడ ప్రాంతానికి కూలి పనుల నిమిత్తం వచ్చాడు. ఇటీవల అనారోగ్యంగా ఉందని పార్వతీపురం వెళ్లి రెండు రోజుల క్రితం తిరిగి మధురవాడ చేరుకున్నాడు. అతడు కొంత కాలంగా పూర్తిగా మద్యానికి బానిసై పనులకు సక్రమంగా వెళ్లడం లేదు. ఈ నేపథ్యంలో ఆదివారం అర్ధరాత్రి పీఎంపాలెం చివరి బస్‌స్టాప్ నుంచి బక్కన్నపాలెం వెళ్లే దారిలోని దుర్గాలమ్మ ఆలయ సమీప గోడ పక్కన ఇనుప గ్రిల్‌కు ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఉదయం స్థానికులు గమనించి పీఎంపాలెం పోలీసులకు సమాచారం అందించారు. మృతుడి భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ పేర్కొన్నారు.

మనస్తాపంతో వ్యక్తి ఆత్మహత్య

పద్మనాభం, న్యూస్‌టుడే: కన్న కూతురు ఇటీవల పాము కాటుకు గురై మృతి చెందడంతో తండ్రి మద్యానికి బానిసై తీవ్ర మనస్తాపంతో బలవన్మరణానికి పాల్పడిన ఘటన మండలంలోని బాందేవుపురం గ్రామంలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాలిలా.. ఎంతో అల్లారుముద్దుగా పెంచుకున్న కుమార్తె తిరిగిరాని లోకాలకు వెళ్లిపోయిందని తెలుసుకున్న తండ్రి బోనెల సింహాద్రి (41) ఈనెల 4వ తేదీన పురుగుల మందు తాగి ఆత్మహత్యకు యత్నించాడు. వెంటనే అతడిని కుటుంబీకులు విజయనగరం మహారాజా ఆసుపత్రికి తరలించగా అక్కడ చికిత్స పొందుతూ సోమవారం తెల్లవారుజామున ప్రాణాలు కోల్పోయాడు. మృతుడి భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్.ఐ సురేష్ పేర్కొన్నారు.

చిత్తశుద్ధితో ప్రజా సమస్యలు పరిష్కరించాలి



వినతులు స్వీకరిస్తున్న ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు

ఆనందపురం, న్యూస్‌టుడే: ప్రజా సమస్యల పరిష్కారంలో భీమిలి నియోజకవర్గాన్ని రాష్ట్రానికే ఆదర్శంగా నిలిపేందుకు కృషి చేస్తానని ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు అన్నారు. మండల పరిషత్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమంలో ఆయన ప్రజల నుంచి వినతులు, ఫిర్యాదులు స్వీకరించారు. అనంతరం మాట్లాడుతూ ఇకపై నియోజకవర్గ పరిధిలో ప్రతి వారం జరిగే ఈ ప్రక్రియలో ఏదో ఒక చోట పాల్గొంటానని నెల రోజుల తరువాత అర్జీదారులకు సంబంధిత శాఖ అధికారులే స్వయంగా సమాధానం చెప్పే విధంగా చర్యలు తీసుకుంటామన్నారు. ఈ వేదికలో సమస్య చెప్పుకొంటే పరిష్కారమవుతుందనే నమ్మకం ప్రజల్లో కల్పించాలని, అలా జరగాలంటే అధికారులు బాధ్యతాయుతంగా చిత్తశుద్ధితో పని చేయాలన్నారు. ఎంపీడీవో జానకి, తహసీల్దార్ శ్యాంప్రసాద్, ఎంపీపీ మజ్జి శారదా ప్రియాంక, కూటమి నాయకులు పంచకర్ల సందీప్, కె.రామానాయుడు, గాడు వెంకటప్పడు తదితరులు పాల్గొన్నారు.

ఎన్‌సీసీ విద్యార్థుల ర్యాలీ

సాగర్‌నగర్, న్యూస్‌టుడే: రుషికొండ గాయత్రీ విద్యా పరిషత్ (జీవీపీ) డిగ్రీ అండ్ పీజీ కోర్సుల కళాశాల వేదికగా జరుగుతున్న ఉత్తరాంధ్ర జిల్లాల ఎన్‌సీసీ క్యాడెట్ల శిక్షణ కార్యక్రమాల్లో భాగంగా సోమవారం రుషికొండ, వాడపాలెం తదితర బీచ్‌రోడ్డు పరిసర ప్రాంతాల్లో ర్యాలీ నిర్వహించారు. 13 ఆంధ్రా బెటాలియన్ ఎన్‌సీసీ క్యాంప్ కమాండింగ్ ఆఫీసర్ నీరజ్‌కుమార్, జీవీపీ ఎన్‌సీసీ విభాగాధికారి కెప్టెన్ ఆర్.బి.అనంతరావు పర్యవేక్షణలో మానసిక ఆరోగ్య సంబంధిత అంశాలపై విద్యార్థులు ప్లకార్డులతో నినాదాలు చేశారు. పరిసరాల పరిశుభ్రత తదితర అంశాలపై ప్రజలను చైతన్యపర్చారు.



భీమిలి అన్న క్యాంటీన్‌లో ఎమ్మెల్యే గంటా

భీమునిపట్నం, న్యూస్‌టుడే: భీమిలిలోని అన్న క్యాంటీన్‌ను ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు సోమవారం మధ్యాహ్నం ఆకస్మికంగా సందర్శించారు. కూటమి ప్రభుత్వం పునరుద్ధరించిన ఈ క్యాంటీన్లకు ఆదరణ ఎలా ఉందనే విషయం తెలుసుకునేందుకు ఆయన ఆకస్మికంగా పరిశీలించారు. భోజనం చేసిన వారితో కొద్దిసేపు మాట్లాడి ఆహార పదార్థాల నాణ్యత తదితర విషయాలపై ఆరా తీశారు. ఈ పథకం అమల్లో ఎలాంటి సమస్యలు తలెత్తకుండా తగిన చర్యలు తీసుకుంటున్నట్లు ఎమ్మెల్యే పేర్కొన్నారు.



కలెక్టర్‌ను కలిసిన భీమిలి ఆర్డీవో

వన్‌టౌన్, న్యూస్‌టుడే: భీమిలి రెవెన్యూ డివిజనల్ అధికారిగా కె.సంగీత్ మాధుర్ సోమవారం బాధ్యతలు స్వీకరించిన అనంతరం కలెక్టర్ హరేంధిర ప్రసాద్‌ను సోమవారం సాయంత్రం ఆయన ఛాంబర్‌లో మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. పశ్చిమ గోదావరి జిల్లా ట్రైనీ డిప్యూటీ కలెక్టర్‌గా శిక్షణ పూర్తి చేసుకున్న అనంతరం ఇటీవల జరిగి బదిలీల్లో భాగంగా ఆయన జిల్లాకు వచ్చారు.



కలెక్టర్‌కు మొక్కను బహూకరిస్తున్న భీమిలి ఆర్డీవో సంగీత్ మాధుర్

నేడు విద్యుత్తు ఉండని ప్రాంతాలు

ఎండాడ, సాగర్‌నగర్, న్యూస్‌టుడే: ఎండాడ 33కేవీ విద్యుత్తు ఫీడర్ మరమ్మతుల నిర్వహణ పనుల కారణంగా మంగళవారం పలు ప్రాంతాల్లో విద్యుత్తు సరఫరా నిలిపివేయనున్నట్లు ఈపీడీసీఎల్ జోన్-3 ఈఈ పోలాకి శ్రీనివాసరావు, ఏఈఈ ఎస్.కల్యాణచక్రవర్తి తెలిపారు. దీనివల్ల ఎండాడ, రాజీవ్‌నగర్, వరాహగిరినగర్, ముబారక్ కాలనీ, సాగర్‌నగర్, సుభాష్‌నగర్, దసపల్లా లేఅవుట్, ఐటీ పార్కు, ఎస్ఎస్ రహదారి, రామానాయుడు స్టూడియో, తిమ్మాపురం హిల్ నెం-1, 2, 3, రుషికొండ తదితర ప్రాంతాల్లో మంగళవారం ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు విద్యుత్తు సరఫరా ఉండదన్నారు.

రైతు బజార్లలో రూ.50కే కిలో టమోటా

వన్‌టౌన్, న్యూస్‌టుడే: జిల్లాలోని అన్ని రైతు బజార్లలో ఈనెల 8 తేదీ మంగళవారం నుంచి రాష్ట్ర ప్రభుత్వం, మార్కెటింగ్ శాఖ ఆధ్వర్యంలో రాయితీపై కిలో టమోటా రూ.50కే విక్రయించనున్నట్లు జేసీ మయూర్ అశోక్ సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఒక్కో కుటుంబానికి కిలో మాత్రమే అమ్మనున్నారు. వినియోగదారులు ఆధార్ లేదా రేషన్ కార్డును కౌంటర్‌నందు చూపించాలని ప్రకటనలో పేర్కొన్నారు.

'లాభాల బాటలో పీఏసీఎస్'

మధురవాడ, న్యూస్‌టుడే: గత ఆర్థిక సంవత్సరంలో మధురవాడ ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘం (పీఏసీఎస్) ఆశించిన మేరకు ఆదాయం సాధించినట్లు పీఏసీఎస్ ప్రధాన ఇన్‌ఛార్జి ఎం.రమేష్‌బాబు తెలిపారు. మధురవాడ ఎత్తు వంతెన సమీప సంబంధిత సంఘ భవన సముదాయంలో సోమవారం నిర్వహించిన 65వ మహాసభలో ఆయన మాట్లాడారు. పీఏసీఎస్ ఆధ్వర్యంలో ఇటీవల ప్రారంభమైన జన ఔషధి కేంద్రంలో తక్కువ ధరలకు మందులు విక్రయిస్తున్నారని ప్రజలు వినియోగించుకోవాలని కోరారు. ఈ సమావేశంలో సంఘం సీఈవో ఎం.అప్పలరాజు, మరుపిళ్ల పైడిరాజు, పిళ్లా కృష్ణమూర్తి పాత్రుడు తదితరులు పాల్గొన్నారు.

కళాశాలలో ఆయుధ పూజ

పీఎంపాలెం, న్యూస్‌టుడే: దసరా శరన్నవరాత్రి ఉత్సవాలను పురస్కరించుకుని పీఎంపాలెం సాంకేతిక విద్యాపరిషత్ ఇంజినీరింగ్ కళాశాలలో ఎలక్ట్రికల్, ఎలక్ట్రానిక్స్ విభాగం ఆధ్వర్యంలో సోమవారం అమ్మవారికి ఆయుధపూజ నిర్వహించారు. ఆయా విభాగాలకు సంబంధించిన పలు సామగ్రిని అమ్మవారి విగ్రహం ముందు ఉంచి వేద పండితుల సమక్షంలో పూజలు చేశారు. కళాశాల ఎగ్జిక్యూటివ్ అధికారి మధుభట్, సమన్వయకర్త ఎ.నాగేశ్వరరావు, ప్రిన్సిపల్ డాక్టర్ టి.వి.రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

వినతుల స్వీకరణ

భీమునిపట్నం, న్యూస్‌టుడే: భీమిలి జోనల్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజాఫిర్యాదుల పరిష్కార వ్యవస్థ(పీజీఆర్ఎస్)లో నాలుగు వినతులు లభించాయి. ఇందులో ఇంజినీరింగ్ విభాగానికి రెండు, పట్టణ ప్రణాళిక, యూసీడీ విభాగాలకు ఒక్కొక్కటి వచ్చాయి. పరిష్కరించేందుకు వాటిని ఆయా విభాగాలకు బదలాయించినట్లు జెడ్సీ పి.ప్రేమప్రసన్న వాణి పేర్కొన్నారు.

కొమ్మాది, న్యూస్‌టుడే: జీవీఎంసీ జోన్-2 కార్యాలయంలోనూ సోమవారం పలువురు అర్జీదారుల నుంచి జెడ్సీ పి.సింహాచలం వినతి పత్రాలు స్వీకరించారు. 6వవార్డులో వీధి దీపాలు వెలిగేలా చర్యలు తీసుకోవాలని తెదేపా 6వవార్డు అధ్యక్షుడు దాసరి శ్రీనివాస్ తదితరులు కోరారు.

అనుసంధాన మార్గాల నిర్మాణానికి చర్యలు

అడివివరం (సింహాచలం), న్యూస్‌టుడే: పాత గోశాల కూడలి నుంచి పాత అడివివరం వరకు నిర్మించిన బీఆర్టీఎస్ రహదారి వెంబడి గ్రామస్థుల రాకపోకలకు ఇబ్బంది లేకుండా అనుసంధాన మార్గాలు అభివృద్ధి చేయడానికి కృషి చేస్తున్నట్లు 98వ వార్డు కార్పొరేటర్ పి.వి.నరసింహం తెలిపారు. కుమ్మరిదిబ్బ వద్ద జరుగుతున్న అనుసంధాన మార్గం పనులను జీవీఎంసీ, దేవస్థానం ఇంజినీరింగ్ అధికారులతో కలిసి పరిశీలించారు. దసరా రోజున అప్పన్న స్వామి తిరువీధి కన్నా ముందుగానే పనులు పూర్తి చేయించాలని అధికారులకు సూచించారు. మిగిలిన ప్రాంతాల్లో కూడా అనుసంధాన మార్గాలు త్వరగా నిర్మించాలని కోరారు. దేవస్థానం ఈఈ బి.రాంబాబు, జీవీఎంసీ ఎస్ఈ రామ్మోహనరావు తదితరులు పాల్గొన్నారు.

నవంబరు 2 నుంచి అన్నప్రసాద వితరణ

భీమునిపట్నం, న్యూస్‌టుడే: భీమిలిలోని శ్రీ వీరాంజనేయ అయ్యప్ప స్వామి సేవాసంఘం ఆధ్వర్యంలో నవంబరు 2 నుంచి డిసెంబరు 16వ తేదీ మధ్య అయ్యప్పస్వాములు, భవానీలు, ఇతర మాలధారులకు మధ్యాహ్న వేళ అన్నప్రసాద వితరణ చేపట్టనున్నట్లు నిర్వాహకులు పేర్కొన్నారు. ఈ మేరకు భీమిలి బీచ్‌రోడ్డులోని అయ్యప్పసేవాపీఠం వద్ద సోమవారం కరపత్రాలను విడుదల చేశారు.

విశాఖ తూర్పు

అనధికార పార్కింగ్‌పై ఆర్పీఎఫ్ చర్యలు

రైల్వేస్టేషన్, న్యూస్‌టుడే: విశాఖ రైల్వేస్టేషన్ పరిసరాల్లో అనధికారికంగా వాహనాలు నిలుపుతున్న వారిపై ఆర్పీఎఫ్ పోలీసులు దృష్టి సారించారు. వారం రోజులుగా ప్రత్యేక డ్రైవ్ నిర్వహించి కేసులు నమోదు చేయడంతో పాటు పలు వాహనాలను సీజ్ చేశారు. సోమవారం ఆర్పీఎఫ్ స్టేషన్‌లో నిర్వహించిన కౌన్సెలింగ్‌కు హాజరైన వాహన యజమానులకు అపరాధ రుసుం విధించారు. నిర్వహించిన మొత్తం చెల్లించిన 77 వాహనాలను విడుదల చేసినట్లు పోలీసులు పేర్కొన్నారు. స్టేషన్ సమీప పార్కింగ్ కేంద్రాల్లో మాత్రమే వాహనాలు నిలుపుదల చేయాలని ఇతర ప్రదేశాల్లో వాహనాలు నిలిపితే చర్యలు తప్పవని హెచ్చరించారు.

కనులపండువగా అప్పన్న నిత్య కల్యాణం

సింహాచలం, న్యూస్‌టుడే: సింహాద్రి అప్పన్న స్వామి నిత్య కల్యాణోత్సవం సోమవారం కనులపండువగా జరిగింది. భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని స్వామిని సేవించారు. అర్చకులు వేదమంత్రాలతో ఆశీర్వదించి కల్యాణ తలంబ్రాలు, శేషవస్త్రాలు అందజేశారు.



మేమున్నాం.. మీకు తోడుగా 10 AM - 1 PM
ఎంవీపీకాలనీ 80085 74768 మద్దిలపాలెం 99121 20229
-న్యూస్‌టుడే, ఎంవీపీకాలనీ

★ సమస్య: ఎంవీపీకాలనీ సెక్టారు-2 విజయా ఆసుపత్రి వెనక సందులో చెట్టుకొమ్మలు తొలగించ లేదు. – రామారావు

★ సమాధానం: సిబ్బందిని నియమించి, వ్యర్థాలను తరలిస్తాం.– సూరిబాబు, శానిటరీ ఇన్‌స్పెక్టర్

రహదారులకు మహర్దశ

యుద్ధప్రాతిపదికన గోతులు పూడ్చివేత



హెచ్‌బీ కాలనీ ప్రధాన రహదారి వద్ద

ఎంవీపీకాలనీ, న్యూస్‌టుడే: ఐదేళ్ల వైకాపా పాలనలో రహదారులు అధ్వానంగా మారాయి. ఎక్కడికక్కడ గుంతలు దర్శనమిచ్చాయి. చాలా మంది ప్రమాదాలబారిన పడ్డారు. అయినా నాటి పాలకులు పట్టించుకోకపోవడంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులకు గురయ్యారు. ఎన్డీయే ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక రోడ్లను పూర్తిస్థాయిలో నిర్మించేందుకు ప్రతిపాదనలు సిద్ధం చేసింది. ఇందులో భాగంగా తొలుత గోతులను పూడ్చే పనిలో యంత్రాంగం నిమగ్నమైంది. అదే విధంగా కొన్ని వార్డుల్లో ప్రధాన రహదారుల నిర్మాణ పనులు చేపడుతుండగా.. అంతర్గత రహదారులకు ప్రతిపాదనలు సిద్ధం చేస్తున్నారు.

రూ.10.50 లక్షలతో పనులు..

★ వైకాపా పాలనలో ప్రతిపాదనలు సిద్ధం చేసి టెండర్లు పూర్తి చేసినా నిధుల కొరతతో రహదారుల పనులు జరగలేదు. దీంతో తూర్పు నియోజకవర్గం పరిధిలో దాదాపుగా అన్ని వార్డుల్లోని ప్రధాన, అంతర్గత రోడ్లు అస్తవ్యస్తంగా మారాయి. రాళ్లు పైకి తేలాయి.



అంతర్గత రహదారుల్లో గోతులను పూడ్చుతున్న సిబ్బంది

★ ప్రస్తుత మౌలిక సదుపాయాల కల్పనపై దృష్టి సారించిన ఎమ్మెల్యే వెలగపూడి రామకృష్ణబాబు ఇంజినీరింగ్ అధికారులతో చర్చించారు. వార్డుల వారీగా రహదారుల నిర్మాణం, గోతులను పూడ్చేందుకు ప్రతిపాదనలు చేయించారు. ఇందులో భాగంగానే 15, 16, 17, 22, 23 వార్డుల్లో సుమారు 205 ప్రమాదకర గోతులను గుర్తించారు. ఇటీవల కురిసిన భారీ వర్షాలకు జాతీయ రహదారిపై గోతుల సంఖ్య మరింత పెరిగింది. దీంతో యుద్ధ ప్రాతిపదికన ప్రధాన రహదారుల నిర్మాణంతో పాటు గోతులను పూడ్చేందుకు రూ.10.50 లక్షల నిధులతో పనులు ప్రారంభించారు.



ఇసుకతోట వద్ద జాతీయ రహదారిపై..

★ వెంకోజీపాలెం నుంచి మద్దిలపాలెం, అలానే సత్యం కూడలి వరకు ఉన్న జాతీయ రహదారిపై గోతులను పూడ్చే పనిలో యంత్రాంగం నిమగ్నమైంది. దీంతో పాటు హెచ్.బి.కాలనీ ప్రధాన రహదారిని సైతం నిర్మిస్తున్నారు.

పూర్తిస్థాయిలో నిర్మిస్తాం..: 'ప్రస్తుతం పలు వార్డుల్లో రోడ్ల నిర్మాణ పనులు కొనసాగుతున్నాయి. వారం రోజుల్లో అన్ని గోతులను పూడ్చటం జరుగుతుంది. ప్రతిపాదనలు ఆమోదించిన తర్వాత ప్రధాన రహదారులను పూర్తి స్థాయిలో నిర్మిస్తాం' అని డి.ఈ. శ్రీనివాసరావు తెలిపారు.

సెయిల్‌లో విలీనమైతే విశాఖ ఉక్కుకు పూర్వవైభవం

పెదవాల్తేరు, న్యూస్‌టుడే: సెయిల్‌లో విలీనమైతే విశాఖ ఉక్కుకు పూర్వవైభవం వస్తుందని సెయిల్ స్వతంత్ర డైరెక్టర్ సాగి కాశీవిశ్వనాథరాజు అన్నారు. లాసన్స్‌బేకాలనీ భాజపా కార్యాలయంలో సోమవారం ఉదయం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. వైకాపా హయాంలో స్టీల్‌ప్లాంట్‌ను తొలగించి ఆ ప్రాంతంలో రాజధాని భవనాలు నిర్మించాలని ఆలోచన చేసిందన్నారు. అలాగే రియల్‌ఎస్టేట్‌ను అభివృద్ధి చేయాలనుకున్నారని.. ఈ విషయాన్ని స్వయంగా అప్పటి స్టీల్ మంత్రిత్వ శాఖ కార్యదర్శి వెల్లడించినట్లు చెప్పారు. కూటమి ప్రభుత్వం వచ్చాక ఎంపీలు, ఎమ్మెల్యేలు, మంత్రి నారా లోకేష్ స్టీల్‌ప్లాంట్ సమస్యలపై సమీక్షించి సెయిల్‌లో విలీనం చేయాలని తీర్మానం చేసినట్లు చెప్పారు. ప్రస్తుతం బొగ్గు ద్వారా రూ.1200 కోట్లు అదనంగా చెల్లిస్తున్నారని.. అదే విలీనం జరిగితే ఇలాంటి అదనపు ఖర్చులు ఉండవని పేర్కొన్నారు.



మాట్లాడుతున్న సెయిల్ స్వతంత్ర డైరెక్టర్ కాశీరాజు విశ్వనాథరాజు

పోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామి ఆలయ సంప్రోక్షణ

ఎం.వి.పి.కాలనీ, న్యూస్‌టుడే: స్థానిక ఎంవీపీ కాలనీ సెక్టార్-4లోని విశ్వబ్రాహ్మణ సంఘం ఆధ్వర్యంలో పోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామి ఆలయ సంప్రోక్షణ భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. సోమవారం ఉదయం నుంచి ఆలయంలో ప్రత్యేక పూజలు జరిపారు. వేద పారాయణం, మూలవిరాట్‌కు పంచామృతాభిషేకం, మహా కుంభాభిషేకం, స్వామివారి శాంతికల్యాణం అత్యంత భక్తిప్రపత్తులతో జరిపారు. మధ్యాహ్నం అన్నప్రసాదం భక్తులకు అందజేశారు. ఆలయ కమిటీ పూజాది కార్యక్రమాలను పర్యవేక్షించింది.



శాంతి హోమం జరుపుతున్న పండితులు

అవీ ఇవీ

రైతు బజార్లలో రూ.50కే కిలో టమోటా

వన్‌టౌన్, న్యూస్‌టుడే: జిల్లాలోని అన్ని రైతు బజార్లలో ఈనెల 8 తేదీ మంగళవారం నుంచి రాష్ట్ర ప్రభుత్వం, మార్కెటింగ్ శాఖ ఆధ్వర్యంలో రాయితీపై కిలో టమోటా రూ.50కే విక్రయించనున్నట్లు జేసీ మయూర్ అశోక్ సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఒక్కో కుటుంబానికి కిలో మాత్రమే అమ్మనున్నారు. వినియోగదారులు ఆధార్ లేదా రేషన్ కార్డును కౌంటర్ నందు చూపించాలని ప్రకటనలో పేర్కొన్నారు.

గుర్తు తెలియని మృతదేహం లభ్యం

పెదవాల్తేరు, న్యూస్‌టుడే: ఆర్.కె.బీచ్ బస్టాప్ వెనకాల గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందాడు. దీనికి సంబంధించి మూడో పట్టణ పోలీసులు అందించిన వివరాలిలా ఉన్నాయి. సోమవారం ఉదయం ఆర్.కె.బీచ్ బస్టాప్ వెనకాల మెట్ల మీద సుమారు (50) సంవత్సరాల గుర్తు తెలియని వ్యక్తి మృతి చెంది ఉండటాన్ని స్థానికులు పోలీసులకు సమాచారమిచ్చారు. మూడో పట్టణ సి.ఐ రమణయ్య ఆధ్వర్యంలో ఎ.ఎస్.ఐ ఒమ్మి శ్రీనివాసరావు సిబ్బంది అక్కడికి చేరుకొని మృతదేహాన్ని కేజీహెచ్‌కు తరలించి మార్చురీలో భద్రపరిచారు. ఆయన చనిపోయిన పరిసరాల్లో మందులు అధికంగా ఉండటంతో అనారోగ్య కారణాలతో మృతి చెందినట్లు పోలీసులు భావిస్తున్నారు. ఆచూకీ తెలిసినవారు 0891 2755517 నెంబర్‌ను సంప్రదించాలని కోరారు.



మృతదేహం

50 కిలోల గంజాయి స్వాధీనం

ఎం.వి.పి.కాలనీ, న్యూస్‌టుడే: దువ్వాడ దరి ఓ నివాసంలో నిల్వ చేసిన గంజాయిని టాస్క్‌ఫోర్స్ పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. దువ్వాడ టోల్‌గేటు పరిసరాల్లోని ఓ కాలనీలో గంజాయి ఉన్నట్లు వచ్చిన సమాచారంతో పోలీసులు దాడులు జరిపారు. ఓ ఇంట్లో నిల్వ చేసిన 50 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకుని 8 మందిని అదుపులోకి తీసుకున్నారు. తదుపరి చర్యల నిమిత్తం దువ్వాడ స్టేషన్‌కు అప్పగించారు.

హుండీ ఆదాయం లెక్కింపు

గురుద్వారా, న్యూస్‌టుడే: నక్కవానిపాలెం ఉమా నీలకంఠేశ్వరస్వామి ఆలయం హుండీ ఆదాయం లెక్కింపు సోమవారం ఉదయం జరిగింది. ఆలయ కార్యనిర్వహణాధికారి బండారు ప్రసాద్ పర్యవేక్షణలో జరిగిన కార్యక్రమంలో 165 రోజులకు గాను రూ.3,15,943లు ఆదాయం వచ్చింది. ఇన్‌స్పెక్టర్ శ్రీధర్, ఆలయ సిబ్బంది, చంద్రశేఖర్, శ్రీవారి భక్త బృందం పాల్గొన్నారు.

ఎన్‌సీసీ విద్యార్థుల ర్యాలీ

సాగరనగర్, న్యూస్‌టుడే: రుషికొండ గాయత్రీ విద్యా పరిషత్ (జీవీపీ) డిగ్రీ అండ్ పీజీ కోర్సుల కళాశాల వేదికగా జరుగుతున్న ఉత్తరాంధ్ర జిల్లాల ఎన్‌సీసీ క్యాడెట్ల శిక్షణ కార్యక్రమాల్లో భాగంగా సోమవారం రుషికొండ, వాడపాలెం తదితర బీచ్‌రోడ్డు పరిసర ప్రాంతాల్లో ర్యాలీ నిర్వహించారు. 13 ఆంధ్రా బెటాలియన్ ఎన్‌సీసీ క్యాంప్ కమాండింగ్ ఆఫీసర్ నీరజ్‌కుమార్, జీవీపీ ఎన్‌సీసీ విభాగాధికారి కెప్టెన్ ఆర్.బి.అనంతరావు పర్యవేక్షణలో మానసిక ఆరోగ్య సంబంధిత అంశాలపై విద్యార్థులు ప్లకార్డులతో నినాదాలు చేశారు. పరిసరాల పరిశుభ్రత తదితర అంశాలపై ప్రజలను చైతన్యపర్చారు.

భక్తి శ్రద్ధలతో శరన్నవరాత్రి ఉత్సవాలు



సెక్టారు-6లో..



చండీదేవి అవతారంలో..



ముడసర్లోవ దీనదయాళుపురంలో..



అలంకరణలో చంద్రమౌళేశ్వరస్వామి



భద్రం సామాజిక భవనంలో..



కోలాటం ఆడుతున్న ఆరిలోవ రమ్యరెసిడెన్సీ నివాసితులు



పీతలవానిపాలెంలో..



రామ్‌నగర్‌లో భారీ అమ్మవారి విగ్రహం ఊరేగింపులో గ్రామస్తులు

తూర్పు నియోజకవర్గంలో శ్రీదేవీ శరన్నవరాత్రి ఉత్సవాలు సోమవారం వైభవంగా జరిగాయి. ఇందులో భాగంగా అమ్మవారికి ప్రత్యేక పూజలు చేపట్టారు. దుర్గాదేవి అమ్మవారు మహాచండీ దేవిగా దర్శనమిచ్చారు. మహిళలు సామూహిక కుంకుమార్చనల్లో పాల్గొన్నారు. పలుచోట్ల అన్నదానాలు, భవానీ భక్తుల అగ్నిగుండం పూజలు జరిగాయి.

– న్యూస్‌టుడే, ఎం.వి.పి.కాలనీ, విశాలాక్షినగర్, పెదవాల్తేరు, మద్దిలపాలెం, ఆరిలోవ

9న బాలలకు సరస్వతి పూజ

పెదవాల్తేరు, న్యూస్‌టుడే: నవరాత్రి ఉత్సవాలను పురస్కరించుకొని కిర్లంపూడిలేఔట్లో వెలిసిన శ్రీ లలితా సుందరేశ్వరీ ఆలయంలో సరస్వతి పూజ అత్యంత వైభవంగా నిర్వహించనున్నట్లు ఆలయ పర్యవేక్షకులు కాందూరి లక్ష్మణస్వామి తెలిపారు. ఆలయ ఆవరణలో సోమవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఈనెల 9న ఉదయం 7.30 గంటలకు చిన్నారులకు సరస్వతి మంత్రం, బీజాక్షర అర్చన కార్యక్రమం జరుగుతుందని పేర్కొన్నారు. సాయంత్రం 6 గంటలకు బాలలతో సరస్వతి పూజ చేయిస్తామన్నారు.



లలితా దేవి అమ్మవారు

ఉపాధ్యాయ ఎమ్మెల్సీ సీటు తూర్పుకాపులకు కేటాయించాలి

ఎం.వి.పి.కాలనీ, న్యూస్‌టుడే: ఉపాధ్యాయుల ఎమ్మెల్సీ సీటును కూటమి అభ్యర్థిగా బీసీ తూర్పు కాపులకు కేటాయించాలని ఉత్తరాంధ్ర తూర్పు కాపు సంఘం అధ్యక్షులు గొర్లె శ్రీనివాసనాయుడు డిమాండ్ చేశారు. గత అసెంబ్లీ ఎన్నికల్లో ఉత్తరాంధ్రలో కూటమి కూర్పు సందర్భంగా తూర్పు కాపు సీటులను వేరే సామాజిక వర్గాలకు కేటాయించటంతో ఉత్తరాంధ్రలో రెండు సీట్లను కోల్పోయామని ఆవేదన వ్యక్తం చేశారు. సోమవారం తూర్పు కాపు సంఘం కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. తూర్పు కాపులకు సీటు కేటాయించే పార్టీలకు తమ మద్దతు ఉంటుందని పేర్కొన్నారు. సంఘం ప్రతినిధులు బలగ సుధాకర్, ఎల్.గణేష్, ఆర్.వెంకటరమణ, రమణ తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న గొర్లె శ్రీనివాసనాయుడు

పీజీఆర్ఎస్ ఫిర్యాదులను సత్వరమే పరిష్కరించండి

ఎం.వి.పి.కాలనీ, న్యూస్‌టుడే: ప్రజా సమస్యల పరిష్కార వేదికకు (పీజీఆర్ఎస్) వచ్చే సమస్యలను సత్వరమే పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలని జోన్-3 జెడ్సీ శివప్రసాద్ ఆదేశించారు. సోమవారం జోనల్ కార్యాలయంలో పలువురి నుంచి ఆయన అర్జీలు స్వీకరించి, సంబంధిత విభాగ అధికారులకు పంపించారు. అనంతరం అధికారులతో ఆయన సమావేశమై పలు సూచనలు చేశారు. ప్రధానంగా ఎక్కువగా ఫిర్యాదులు వస్తున్న ప్రజారోగ్యం, పట్టణ ప్రణాళిక, వీధి దీపాల నిర్వహణకు సంబంధించిన అధికారులతో మాట్లాడి, బాధితులు మరోసారి కార్యాలయానికి రాకుండా వారి సమస్యలను తెలుసుకుని, క్షేత్రస్థాయిలో ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు. అనంతరం గత వారం వచ్చిన సమస్యల పరిష్కార అంశాలపై సమీక్షించారు.



అధికారులతో సమీక్షిస్తున్న జెడ్సీ శివప్రసాద్

బాల్‌బ్యాడ్మింటన్ పోటీల్లో విశాఖ విజయం

అచ్యుతాపురం, న్యూస్‌టుడే: అనకాపల్లి జిల్లా అచ్యుతాపురం మండలం నునపర్తిలో మూడు రోజుల పాటు జరిగిన రాష్ట్రస్థాయి జూనియర్ అండర్-19 బాలబాలికల బాల్‌బ్యాడ్మింటన్ పోటీలు సోమవారంతో ముగిశాయి. రాష్ట్రవ్యాప్తంగా 13 జిల్లాల నుంచి 300 మంది క్రీడాకారులు ఈ పోటీల్లో పాల్గొన్నారు. తుది పోటీల్లో విశాఖ-శ్రీకాకుళం బాలురు జట్ల మధ్య హోరాహోరీగా పోరు జరిగింది. ఈ పోటీల్లో విశాఖ జట్టు విజయం సాధించింది. ఇదేవిధంగా బాలికల విభాగంలో విశాఖ-తూర్పు గోదావరి జట్ల మధ్య పోటీ జరగ్గా విశాఖ జట్టే ప్రతిభ చూపించి విజయం పొందింది.





విశాఖకు చెందిన బాలురు, బాలికల జట్లకు బహుమతి అందిస్తున్న రాష్ట్ర కమిటీ ప్రతినిధులు

మర్యాదపూర్వక కలయిక

స్వర్ణభారతి, (మద్దిలపాలెం), న్యూస్‌టుడే: ఆర్టీసీ వైస్ ఛైర్మన్‌గా అమరావతి ఆర్టీసీ హౌస్‌లో సోమవారం బాధ్యతలు చేపట్టిన పి.ఎస్.మునిరత్నంను ఆర్టీసీ ఎన్ఎంయూ నాయకులు మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా పుష్పగుచ్ఛం అందించి అభినందనలు తెలిపారు. ఆర్టీసీలో సమస్యలను పరిష్కరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో నాయకులు శ్రీనివాసరాజు, రాజేష్‌కుమార్, ఎ.రామారావు వివిధ జిల్లాల నాయకులు పాల్గొన్నారు.



ఆర్టీసీ వైస్ ఛైర్మన్ మునిరత్నంను సత్కరిస్తున్న ఆర్టీసీ ఎన్ఎంయూ నాయకులు

ప్రజా ఉద్యమ కేంద్రంగా ఏచూరి స్మారక భవనం

ఆటోమోటివ్, (మద్దిలపాలెం), న్యూస్‌టుడే: ప్రజా ఉద్యమ కేంద్రంగా సీపీఎం జిల్లా కార్యాలయాన్ని సీతారాం ఏచూరి స్మారక భవనం పేరుతో నిర్మించడం అభినందనీయమని ఆ పార్టీ రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు అన్నారు. సోమవారం పిఠాపురంకాలనీలో సీపీఎం జిల్లా కార్యాలయం భవననిర్మాణ భూమిపూజ కార్యక్రమం చేపట్టారు. తొలుత సీతారాం ఏచూరి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విశాఖ జిల్లాలో ఉన్న పరిశ్రమలు ప్రయివేటుపరం కాకుండా ప్రభుత్వ రంగంలో కొనసాగించేందుకు ఏచూరి కీలక పాత్రపోషించారని గుర్తు చేశారు. ఆయన పేరుతో దేశంలోనే మొట్టమొదటి కార్యాలయం విశాఖ జిల్లా కార్యాలయమే అవుతుందన్నారు. పార్టీ సీనియర్ నాయకులు సి.హెచ్.నర్సింగరావు, మాజీ ఎమ్మెల్సీ ఎంవీఎస్‌శర్మ, వీఎస్ పద్మనాభరాజు మాట్లాడారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ గంగారావు, పార్టీ జిల్లా కార్యదర్శి ఎం.జగ్గునాయుడు, నాయకులు కె.లోకనాథం, ఆర్కేఎస్వీకుమార్, బొట్టా ఈశ్వరమ్మ తదితరులు పాల్గొన్నారు.



సీతారాం ఏచూరి చిత్రపటానికి నివాళులర్పిస్తున్న సీపీఎం నాయకులు

దాడులు నిలిపివేయాలి

కార్పొరేషన్, న్యూస్‌టుడే: పాలస్తీనాపై ఇజ్రాయిల్ దాడులు జరిపి మారణహోమం సృష్టించి ఏడాది గడుస్తున్నా, ఐక్యరాజ్యసమితి అక్కడ శాంతిని నెలకొల్పలేకపోయిందని, తక్షణమే పాలస్తీనాపై దాడులు నిలిపివేయాలని సీపీఐ జిల్లా కార్యదర్శి ఎం.పైడిరాజు కోరారు. వామపక్ష పార్టీల ఆధ్వర్యంలో సోమవారం ఆర్టీసీ కాంప్లెక్స్ వద్ద ఆందోళన నిర్వహించారు. అమెరికా అండదండలతో ఇజ్రాయిల్ ఇష్టానుసారంగా వ్యవహరిస్తుందని, ఇప్పటికైనా దాడులు నిలిపివేయాలని ఆయన కోరారు. ఆందోళనలో సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు, మాజీ ఎమ్మెల్సీ శర్మ, లోకనాథం, జగ్గునాయుడు, వై.కొండయ్య తదితరులు పాల్గొన్నారు.

ధరల పెరుగుదలపై నియంత్రణ

ఎం.వి.పి.కాలనీ, న్యూస్‌టుడే: బహిరంగ మార్కెట్లో ధరలు ఆకాశాన్ని తాకుతున్న తరుణంలో రైతుబజార్లలో ఉల్లి, టమోటాలను అందుబాటులో ఉంచాలని మార్కెటింగ్ శాఖాధికారులు ఆదేశించారు. బహిరంగ మార్కెట్ కన్నా తక్కువగా టమోటా కిలో రూ.64కు, కర్నూలు ఉల్లి కిలో రూ.35కు అందుబాటులో ఉంచేలా చర్యలు తీసుకున్నారు. పండుగ నేపథ్యంలో ధరల పెరగకుండా చర్యలు తీసుకోవటంతో పాటు సరిపడినంత సరకు అందుబాటులో ఉంచాలన్నారు.



టమోటా నాణ్యతను పరిశీలిస్తున్న అధికారులు

రోడ్లపై పశువులు.. తప్పని ఇబ్బందులు

ఎం.వి.పి.కాలనీ, న్యూస్‌టుడే: మానసిక ఆసుపత్రి కూడలి నుంచి చిన వాల్తేరుకు వెళ్లే మార్గంలో పశువులను రహదారులపై వదిలేయటంతో రాకపోకలు సాగించేవారికి తీవ్ర ఇబ్బందులు తప్పటం లేదు. స్థానికంగా గెడ్డకు ఆనుకుని పశువులు పెంచేవారి సంఖ్య ఎక్కువగా ఉంటోంది. వీరంతా వాటిని రహదారులపై ఇష్టానుసారంగా వదిలేస్తున్నారు. దీంతో రహదారులపై అడ్డంగా ఉండటంతో రాకపోకలకు ఇబ్బందిగా మారింది. అలాగే పరిసరాలు ప్రాంతాలు అధ్వానంగా మారుతున్నాయి. ఇప్పటికైనా రహదారులపై పశువులు లేకుండా చూడాలని పలువురు కోరుతున్నారు.



చినవాల్తేరుకు వెళ్లే రహదారులపై సంచరిస్తున్న పశువులు

వ్యసనాలకు బానిసై దొంగతనాలు

గురుద్వారా, న్యూస్‌టుడే: చెడు వ్యసనాలకు బానిసై విశాఖ నగరంలో పలు దొంగతనాలకు పాల్పడిన ఇద్దరిని ద్వారకా పోలీస్‌స్టేషన్ పోలీసులు సోమవారం అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. సోమవారం రాత్రి స్టేషన్‌లో నిర్వహించిన మీడియా సమావేశంలో క్రైం ఏడీసీపీ మోహన్‌రావు వివరాల్ని వెల్లడించారు. అమలాపురం దరి గన్నవరం గ్రామానికి చెందిన రాయుడు నర్సింహమూర్తి(39), చల్లపల్లి ప్రసాద్ అనే వ్యక్తులు చెడు వ్యసనాలకు బానిసై దొంగతనాలకు పాల్పడేవారు. ఈ ఏడాది జులైలో ద్వారకా స్టేషన్ పరిధిలో శాంతిపురం పంజాబీదాబా, సంగం శరత్‌థియేటర్, జైలురోడ్డు, వైఎంసీఏ బీచ్ రోడ్డు, ఏకేసీ కాలనీ, కాకినాడ ప్రాంతాల్లో ఆటోలు, మోటారు సైకిళ్లు దొంగతనం చేశారు. ద్వారకా స్టేషన్‌కు సంబంధించి బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన ఎస్.ఐ. రాజు దర్యాప్తు జరిపి వారిని చాకచక్యంగా పట్టుకున్నారు. వారి నుంచి మూడు ఆటోలు, మూడు ద్విచక్ర వాహనాలను స్వాధీనం చేసుకున్నారు. కేసులో చాకచక్యంగా వ్యవహరించిన సిబ్బందిని అభినందించారు. సమావేశంలో జోన్ -1 ఏసీపీ వెంకట్రావ్, ద్వారకా సబ్ డివిజన్ క్రైం ఇంఛార్జి సీఐ కోరాడ రామారావు, ఎస్.ఐ. రాజు, తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న క్రైం ఏడీసీపీ మోహన్‌రావు, చిత్రంలో సీసీఎస్ ఏసీపీ వెంకట్రావ్ తదితరులు

విమ్స్‌లో పక్షవాత రోగికి చికిత్స

విశాలాక్షినగర్, న్యూస్‌టుడే: విమ్స్ ఆసుపత్రిలో పక్షవాతానికి గురైన వ్యక్తిని పూర్తిస్థాయి చికిత్స అందించి ఆరోగ్యంగా ఇంటికి పంపించారు. దీనికి సంబంధించి ఆసుపత్రిలో సోమవారం ఏర్పాటుచేసిన పాత్రికేయుల సమావేశంలో డైరెక్టర్ డాక్టర్ రాంబాబు మాట్లాడుతూ.. ఆరిలోవ ప్రాంతానికి చెందిన 70 ఏళ్ల జగన్నాథరావు మెదడులో రక్తస్రావం కావటంతో పక్షవాతానికి గురయ్యారు. కుటుంబ సభ్యులు ఆసుపత్రికి తీసుకుని రాగా 50 వేల రూపాయల విలువ చేసే ఇంజెక్షన్ ఉచితంగా అందించి.. రెండు రోజుల్లోనే కోలుకోవటంతో డిశ్చార్జ్ చేసినట్లు తెలిపారు. ఈ సందర్భంగా నెల రోజులుగా విమ్స్ ఆసుపత్రిలో నిర్వహించిన శస్త్రచికిత్సలు, నూతనంగా తీసుకొచ్చిన చికిత్సా పద్ధతుల గురించి వివరించారు. రోజూ 700 మంది ఓపీ రోగులు వస్తున్నారని, ప్రస్తుతం 60 మంది ఇన్‌పేషంట్ రోగులు ఉన్నారన్నారు. ఎన్టీఆర్ వైద్యసేవ, ఈహెచ్ఎస్, ఈఎస్ఐ, హెల్త్‌ఇన్సూరెన్స్ తదితర నగదు రహిత సేవలను కూడా అందిస్తున్నామన్నారు.



వివరాలు వెల్లడిస్తున్న విమ్స్ డైరెక్టర్ డాక్టర్ రాంబాబు

విశాఖ ఉత్తరం

• విశాఖ ఉత్తరం • విశాఖ దక్షిణం

25, 26 తేదీల్లో టెక్నికల్ ఫెస్ట్

కూర్మన్నపాలెం, న్యూస్‌టుడే : విద్యార్థుల్లో దాగి ఉన్న సృజనాత్మకత వెలికి తీసేందుకు ఈనెల 25, 26 తేదీల్లో టెక్నికల్ ఫెస్ట్ నిర్వహిస్తామని విజ్ఞాన్ మహిళా ఇంజినీరింగ్ కళాశాల ప్రిన్సిపల్ బి.అరుంధతి అన్నారు. వివిధ కళాశాలల నుంచి హాజరయ్యే ఇంజినీరింగ్ విద్యార్థులు తయారు చేసే నూతన నమూనాలను ప్రదర్శనకు ఉంచుతామన్నారు. సోమవారం కళాశాలలో నిర్వహించిన కార్యక్రమంలో ఫెస్ట్ గోడపత్రిక ఆవిష్కరించారు. హ్యాక్‌థాన్, టెక్నికల్ క్విజ్, షార్ట్ ఫిల్మ్, కోడింగ్, ఫొటోగ్రఫీ తదితర అంశాలపై పోటీలు నిర్వహించి, విజేతలకు రూ.2 లక్షల నగదు బహుమతులు అందిస్తామన్నారు. కన్వీనర్ డి.వెంకటరమణ, ఈసీఈ విభాగాధిపతి వి. అవినాష్, ఇతర అధ్యాపకులు పాల్గొన్నారు.

రైతు బజార్లలో రూ.50కే కిలో టమోటా

వన్‌టౌన్, న్యూస్‌టుడే: జిల్లాలోని అన్ని రైతు బజార్లలో ఈనెల 8 తేదీ మంగళవారం నుంచి రాష్ట్ర ప్రభుత్వం, మార్కెటింగ్ శాఖ ఆధ్వర్యంలో రాయితీపై కిలో టమోటా రూ.50కే విక్రయించనున్నట్లు జేసీ మయూర్ అశోక్ సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఒక్కో కుటుంబానికి కిలో మాత్రమే అమ్మనున్నారు. వినియోగదారులు ఆధార్ లేదా రేషన్ కార్డును కౌంటర్ నందు చూపించాలని ప్రకటనలో పేర్కొన్నారు.

వైశాఖి స్పోర్ట్స్ పార్కులో మార్వాడీ మహిళల నృత్యాలు

మురళీనగర్, న్యూస్‌టుడే : సెక్టర్-8 వైశాఖి స్పోర్ట్స్‌పార్కులో గురువారం మార్వాడీ గర్బా నృత్యగాన కార్యక్రమం ప్రదర్శిస్తున్నారు. షైనింగ్ స్టార్స్ డ్యాన్స్ అకాడమీ, వైశాఖి స్పోర్ట్స్‌పార్కు సంయుక్తంగా నిర్వహిస్తున్న ఈ ప్రత్యేక కార్యక్రమంలో మార్వాడీ మహిళలు పాల్గొని నృత్యాలు అభినయిస్తారు. తిరుమలలో జరిగిన భవదీయం బ్రహ్మోత్సవాలలో పాల్గొన్న చిన్నారులకు చిరుసత్కార కార్యక్రమం ఉంటుందని నిర్వాహకులు తెలిపారు.

తోసుకుంటూ... పూసుకుంటూ...

ఇరుకిరుకు దుకాణాల వద్ద వినియోగదారుల అవస్థలు

కంచరపాలెం, న్యూస్‌టుడే

కంచరపాలెం రైతుబజారుకు వచ్చే వినియోగదారుల అవస్థలు అంతా ఇంతా కాదు. స్టాల్స్ వద్దకు వెళ్లాలంటే వారంతా బెంబేలెత్తిపోతున్నారు. స్టాల్స్ మధ్య పెద్దగా ఖాళీ లేకపోవడంతో ఎదురెదురుగా ఉండే స్టాల్స్ వద్ద అటు, ఇటు కూరగాయలు కొనేందుకు వచ్చిపోయే వినియోగదారులతో ఇబ్బందులు తలెత్తుతున్నాయి. వెరసి ఒకరినొకరు తోసుకుంటూ పూసుకుంటూ వెళ్లాల్సిన దుస్థితి నెలకొంది. అందుబాటులో ఖాళీ స్థలం ఉన్నా కొత్తగా స్టాల్స్ ఏర్పాటు చేయక పోవడం, ఉన్నవాటితో మమ అనిపిస్తుండడంతో వందలాది మంది వినియోగదారులు నానా ఇబ్బందులు పడాల్సిన దుస్థితి దాపురించింది. ముఖ్యంగా సెలవు దినమైన రెండో శనివారం, ఆదివారంలలో పరిస్థితి మరీ అధ్వానంగా ఉంటోంది. పండగ పూట, ఇతర పర్వదినాల్లో అయితే పరిస్థితి చెప్పనవసరం లేదు. అయిదు వార్డులకు అనువైన బజారు కావడంతో వేలాది మంది వినియోగదారులు వారికి కావలసిన సరుకును కొనేందుకు వస్తుంటారు. ఇదే తరుణంలో సరకు తెచ్చే ఆటోలు, అడ్డదిడ్డంగా పెట్టిపోతున్న ద్విచక్ర వాహనాలతో మరీ ఇబ్బందులు తలెత్తుతుంటాయి. బజారును పూర్తిగా ఆధునికీకరిస్తే తప్ప వినియోగదారులకు సౌలభ్యంగా ఉండదని పలువురు వినియోగదారులు వ్యాఖ్యానిస్తుంటారు. మహిళల ఇబ్బందులు కోకొల్లలు. జనంతో కిటకిటలాడే సమయంలో వినియోగదారుల జేబు పర్సులు మాయమవుతుంటాయి. అధికారులు, నాయకులు ఇప్పటికైనా స్పందించి ఇక్కడ బజారులో పూర్తిస్థాయి మౌలిక వసతులు కల్పించాలని స్థానికులు కోరుతున్నారు.



తోసుకుంటూ తప్పించుకు వస్తున్న వినియోగదారుడు



స్టాల్స్ వద్ద నలిగిపోతున్న వినియోగదారులు

వ్యసనాలకు బానిసై దొంగతనాలు

గురుద్వారా, న్యూస్‌టుడే: చెడు వ్యసనాలకు బానిసై విశాఖ నగరంలో పలు దొంగతనాలకు పాల్పడిన ఇద్దరిని ద్వారకా పోలీస్‌స్టేషన్ పోలీసులు సోమవారం అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. సోమవారం రాత్రి స్టేషన్‌లో నిర్వహించిన మీడియా సమావేశంలో క్రైం ఏడీసీపీ మోహన్‌రావు వివరాల్ని వెల్లడించారు. అమలాపురం దరి గన్నవరం గ్రామానికి చెందిన రాయుడు నర్సింహమూర్తి(39), చల్లపల్లి ప్రసాద్ అనే వ్యక్తులు చెడు వ్యసనాలకు బానిసై దొంగతనాలకు పాల్పడేవారు. ఈ ఏడాది జులైలో ద్వారకా స్టేషన్ పరిధిలో శాంతిపురం పంజాబీదాబా, సంగం శరత్‌థియేటర్, జైలురోడ్డు, వైఎంసీఏ బీచ్‌రోడ్డు, ఏకేసీ కాలనీ, కాకినాడ ప్రాంతాల్లో ఆటోలు, మోటారు సైకిళ్ల దొంగతనం చేశారు. ద్వారకా స్టేషన్‌కు సంబంధించి బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన ఎస్.ఐ. రాజు దర్యాప్తు జరిపి వారిని చాకచక్యంగా పట్టుకున్నారు. వారి నుంచి మూడు ఆటోలు, మూడు ద్విచక్ర వాహనాలను స్వాధీనం చేసుకున్నారు. కేసులో చాకచక్యంగా వ్యవహరించిన సిబ్బందిని అభినందించారు. సమావేశంలో జోన్ -1 ఏసీపీ వెంకట్రావ్, ద్వారకా సబ్‌డివిజన్ క్రైం ఇంఛార్జి సీఐ కోరాడ రామారావు, ఎస్.ఐ. రాజు, తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న క్రైం ఏడీసీపీ మోహన్‌రావు, సీసీఎస్ ఏసీపీ వెంకట్రావ్ తదితరులు

విశాఖ రైల్వేస్టేషన్‌ను వదిలేశారేం..

రైల్వేస్టేషన్, న్యూస్‌టుడే: ఇటీవల 15 రోజుల పాటు స్వచ్ఛతాహీ సేవా కార్యక్రమాలు నిర్వహించుకున్న తూ.కో. రైల్వే వాల్తేర్ డివిజన్ విశాఖ రైల్వే స్టేషన్‌లో మాత్రం స్వచ్ఛతను మరిచింది. పరిశుభ్రతలో ఒకప్పుడు ప్రతిష్టాత్మక అవార్డులు అందుకున్న విశాఖ రైల్వే స్టేషన్‌లో అపరిశుభ్రత తాండవిస్తోంది. పాలకులు పట్టించుకోకపోవడంతో పాటు అధికారుల నిర్లక్ష్యం.. విశాఖ రైల్వేస్టేషన్‌కు శాపంగా మారింది. విశాఖ స్టేషన్‌ను పట్టించుకోకుండా ఇతర ప్రాంతాల్లో ఉన్నతాధికారులు చీపుర్లు పట్టి స్వచ్ఛతా పనులు చేయటం విశేషం.



మురుగు నీటిలో విశాఖ రైల్వేస్టేషన్ 3వ నంబర్ ప్లాట్‌ఫామ్ పట్టాలు

22 కిలోల గంజాయి స్వాధీనం

రైల్వేస్టేషన్, న్యూస్‌టుడే: విశాఖ మీదుగా ఒడిశా నుంచి తిరుప్పూర్‌కు గంజాయిని అక్రమంగా రవాణా చేసేందుకు యత్నించిన నలుగురు వ్యక్తులను విశాఖలో రైల్వే పోలీసులు అరెస్టు చేసినట్లు జీఆర్పీ సీఐ ధనుంజయనాయుడు తెలిపారు. స్టేషన్‌లో ఆర్పీఎఫ్, జీఆర్పీ బృందాలు గస్తీ కాస్తున్న సమయంలో తమిళనాడుకు చెందిన సగుపార్ సతిక్ జే, రాజన్ వై, అరుణాచలం ఎస్, వరుణ్‌రాజ్ కన్నదాసన్‌లు ఒడిశాలోని పాడువ నుంచి విశాఖ చేరుకున్నారు. విశాఖ మీదుగా తిరుప్పూర్‌కు వెళ్లేందుకు రైలు నిలయంలో రైలు కోసం ఎదురు చూస్తున్న సమయంలో గస్తీలో ఉన్న ఆర్పీఎఫ్ పోలీసుల బృందానికి వారు చిక్కినట్లు తెలిపారు. బ్యాగుల్లో గంజాయి పొట్లాలు గుర్తించిన పోలీసులు 22 కిలోల గంజాయిని సీజ్ చేసి నిందితుల్ని న్యాయస్థానంలో హాజరుపర్చగా కోర్టు రిమాండ్‌కు ఆదేశించినట్లు సీఐ పేర్కొన్నారు.



రైల్వే పోలీసుల అదుపులో నిందితులు

కలెక్టర్‌ను కలిసిన భీమిలి ఆర్డీవో

వన్‌టౌన్, న్యూస్‌టుడే: భీమిలి రెవెన్యూ డివిజనల్ అధికారిగా కె. సంగీత్ మాధుర్ సోమవారం బాధ్యతలు స్వీకరించిన అనంతరం కలెక్టర్ హరేంధిర ప్రసాద్‌ను సోమవారం సాయంత్రం ఆయన ఛాంబర్‌లో మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. పశ్చిమ గోదావరి జిల్లా ట్రైనీ డిప్యూటీ కలెక్టర్‌గా శిక్షణ పూర్తి చేసుకున్న అనంతరం ఇటీవల జరిగి బదిలీల్లో భాగంగా ఆయన జిల్లాకు వచ్చారు.



కలెక్టర్‌కు మొక్కను బహూకరిస్తున్న భీమిలి ఆర్డీవో సంగీత్ మాధుర్

అభాగ్యులకు నిత్యావసరాల పంపిణీ

మురళీనగర్, న్యూస్‌టుడే : మానవసేవే మాధవసేవ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిరుపేద అంధులకు నెలకు సరిపడా నిత్యావసర వస్తువులను అందజేశారు. సోమవారం సెక్టర్-6 శ్రీదేవిపార్కు అధ్యక్షులు పి.సూర్యనారాయణ, కార్యదర్శి శంకరరెడ్డి చేతులమీదుగా ఈ వితరణ చేపట్టారు. మంచానికే పరిమితమైన కె. రంగానాథరావుకు నిత్యావసరాలతో పాటు మందుల ఖర్చుల నిమిత్తం రూ.3వేలు అందజేశారు. కార్యక్రమంలో సేవాసంస్థ అధ్యక్షులు ఎస్.సీతారామకృష్ణ, డి.వరప్రసాద్, పి.గిరిధర్, కార్యదర్శి వై.త్రిమూర్తి, కె.వి.వర్మ, కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు.



నిత్యావసరాల పంపిణీలో మానవసేవే మాధవసేవ సభ్యులు



ఆర్టీసీ వైస్ ఛైర్మన్ మునిరత్నంను సత్కరిస్తున్న ఆర్టీసీ ఎన్ఎంయూ నాయకులు

మర్యాదపూర్వక కలయిక

స్వర్ణభారతి, (మద్దిలపాలెం): ఆర్టీసీ వైస్ ఛైర్మన్‌గా అమరావతి ఆర్టీసీ హౌస్‌లో సోమవారం బాధ్యతలు చేపట్టిన పి.ఎస్.మునిరత్నంను ఆర్టీసీ ఎన్ఎంయూ నాయకులు మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా పుష్పగుచ్ఛం అందించి అభినందనలు తెలిపారు. ఆర్టీసీలో సమస్యలను పరిష్కరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో నాయకులు శ్రీనివాసరాజు, రాజేష్‌కుమార్, ఎ.రామారావు వివిధ జిల్లాల నాయకులు పాల్గొన్నారు.



సీతంపేట శ్రీపార్వతీశ్వరాలయంలో కుంకుమ పూజలు చేస్తున్న మహిళలు



సీతంపేట : సీతంపేట శ్రీపార్వతీశ్వరాలయంలో బాల త్రిపుర సుందరి అలంకరణలో దుర్గాదేవి



కంచరపాలెం : రెడ్డికంచరపాలెం సన్‌రైజ్ క్లబ్ వద్ద శ్రీదుర్గమాంబ అమ్మవారు



మురళీనగర్: గంగా గోదావరి బహుళ అంతస్థుల సముదాయంలోని ఓ గృహంలో చండికగా పూజలందుకుంటున్న అమ్మవారు



కార్పొరేషన్, న్యూస్‌టుడే: డాబాగార్డెన్స్ రెండవ పట్టణ పోలీసు స్టేషన్ సమీపంలోని ఉమాదేవి అలయంలో మహా చండి అవతారంలో ఉమాదేవి



కార్పొరేషన్, న్యూస్‌టుడే: పాతనగరంలోని కన్యకాపరమేశ్వరి ఆలయంలో అన్నపూర్ణదేవి అవతారంలో కన్యకాపరమేశ్వరి



అక్కయ్యపాలెం : లలితానగర్‌లో జి.ఇ.బి.సి. బోయ్స్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన దుర్గాదేవి అమ్మవారు



నృత్యాభినయం చేస్తున్న రమ్య శిష్యబృందం



మురళీనగర్ : సీతారామాలయంలో కాళికా అవతారంలో లలితాదేవి అమ్మవారు

భారీ అన్న సమారాధన

అక్కయ్యపాలెం, న్యూస్‌టుడే: జీవీఎంసీ 43వ వార్డు పరిధి అక్కయ్యపాలెం సమీపంలోని నందగిరినగర్‌లోని చెక్కుడు రాయి బిల్డింగ్ వద్ద కనకమహాలక్ష్మీ ఆటో స్టాండు ఆధ్వర్యంలో దుర్గాదేవి శరన్నవ రాత్రి మహోత్సవాలను నిర్వహిస్తున్నారు. దీనిలో భాగంగా సోమవారం మధ్యాహ్నం భారీ అన్న సమారాధన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో స్థానికులు నల్లమిల్లి పద్దారెడ్డి, బాణాల తరుణ్ కుమార్, కర్రి అమ్మిరెడ్డి ముఖ్యఅతిథులుగా పాల్గొన్నారు.

దుష్ట శిక్షణ కోసమే అమ్మవారి అవతార రూపాలు

మురళీనగర్, న్యూస్‌టుడే : సెక్టర్-8 వైశాఖి స్పోర్ట్స్‌పార్కు వనితాభవన్‌లో సోమవారం సాయంత్రం వనితా వాకర్స్‌క్లబ్ అధ్యక్షులు పొందూరు ప్రభావతి ఆధ్వర్యంలో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన శాంతిధామం ఇన్‌ఛార్జ్ అపరంజి మాట్లాడుతూ నవరాత్రుల విశిష్టతను వివరించారు. దుష్టశిక్షణ శిష్టరక్షణ కోసమే అమ్మవారి అవతార రూపాలన్నారు. ఆమెను శాలువతో సత్కరించారు. కార్యక్రమంలో ఎలెక్ట్ గవర్నర్ కె.ద్వారకానాథ్, వనితా వాకర్స్ ప్రతినిధులు యు.శుభ, వి.ప్రమీల, ఎం.జయ, ఎం.ప్రమీలారావు, ఆర్.దుర్గాప్రసన్న, భానుమతి, లీలావతి, శిరీషలత, సుభద్ర, స్నేహలత తదితరులు పాల్గొన్నారు.



అపరంజిని సత్కరిస్తున్న వనితా వాకర్స్ సభ్యులు





గురుద్వారా : సీతమ్మధార నార్త్‌ఎక్స్‌టెన్సన్ దరి సాయిబాబా మందిరంలో పాండురంగడుగా శ్రీవారు, శివపూజ మాతగా అమ్మవారు

వెలంపేటలో..

పూర్ణమార్కెట్ (అల్లిపురం), న్యూస్‌టుడే: వెలంపేట సమీప దుర్గాలమ్మ అమ్మవారు సోమవారం త్రిపుర సుందరీ దేవిగా భక్తులకు దర్శనమిచ్చారు. ఈ సందర్భంగా అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా తగిన ఏర్పాట్లు చేసినట్లు ఆలయ ఈవో శేఖర్‌బాబు పేర్కొన్నారు.

అనధికార పార్కింగ్‌పై ఆర్పీఎఫ్ చర్యలు

రైల్వేస్టేషన్, న్యూస్‌టుడే: విశాఖ రైల్వేస్టేషన్ పరిసరాల్లో అనధికారికంగా వాహనాలు నిలుపుతున్న వారిపై ఆర్పీఎఫ్ పోలీసులు దృష్టి సారించారు. వారం రోజులుగా ప్రత్యేక డ్రైవ్ నిర్వహించి కేసులు నమోదు చేయడంతో పాటు పలు వాహనాలను సీజ్ చేశారు. సోమవారం ఆర్పీఎఫ్ స్టేషన్‌లో నిర్వహించిన కౌన్సెలింగ్‌కు హాజరైన వాహన యజమానులకు అపరాధరుసుం విధించారు. నిర్దేశించిన మొత్తం చెల్లించిన 77 వాహనాలను విడుదల చేసినట్లు పోలీసులు పేర్కొన్నారు. స్టేషన్ సమీప పార్కింగ్ కేంద్రాల్లో మాత్రమే వాహనాలు నిలుపుదల చేయాలని ఇతర ప్రదేశాల్లో వాహనాలు నిలిపితే చర్యలు తప్పవని హెచ్చరించారు.



పోలీస్‌స్టేషన్ సమీపంలో సీజ్ చేసిన వాహనాలు

ఐవీఎల్ శాస్త్రికి నివాళి

కార్పొరేషన్, న్యూస్‌టుడే: సంగీత గురువు ఐవీఎల్ శాస్త్రి నాలుగవ వర్ధంతిని జగదాంబ సమీపంలోని ఐవీఎల్ సంగీత సమితి కార్యాలయంలో సోమవారం నిర్వహించారు. ముందుగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో సంగీత కళాకారులను తీర్చిదిద్ది, ఎంతో మందికి మంచి భవిష్యత్తును ఇచ్చారని సంగీత సమితి ఛైర్మన్ ఆకొండి వెంకటరావు అన్నారు. త్యాగరాజ సంకీర్తనలు ఆలపించారు. కార్యక్రమంలో సమితి సభ్యులు కె.సుబ్రహ్మణ్యం, పి.జగన్‌మోహన్‌రావు, వి.మధుసూదనరావు, జి.మధుబాబు, ఎం.నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.



ఐవీఎల్ శాస్త్రికి నివాళులు అర్పిస్తున్న సంగీత సమితి సభ్యులు

పాలస్తీనాపై దాడులు నిలిపివేయాలి

కార్పొరేషన్, న్యూస్‌టుడే: పాలస్తీనాపై ఇజ్రాయిల్ దాడులు జరిపి మారణహోమం సృష్టించి ఏడాది గడుస్తున్నా, ఐక్యరాజ్యసమితి అక్కడ శాంతిని నెలకొల్పలేకపోయిందని, తక్షణమే పాలస్తీనాపై దాడులు నిలిపివేయాలని సీపీఐ జిల్లా కార్యదర్శి ఎం.పైడిరాజు కోరారు. వామపక్ష పార్టీల ఆధ్వర్యంలో సోమవారం ఆర్టీసీ కాంప్లెక్స్ వద్ద ఆందోళన నిర్వహించారు. అమెరికా అండదండలతో ఇజ్రాయిల్ ఇష్టానుసారంగా వ్యవహరిస్తుందని, ఇప్పటికైనా దాడులు నిలిపివేయాలని ఆయన కోరారు. ఆందోళనలో సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు, మాజీ ఎమ్మెల్సీ శర్మ, లోకనాథం, జగ్గునాయుడు, వై.కొండయ్య తదితరులు పాల్గొన్నారు.



ఆందోళనలో స్థానికులు

ఉపాధ్యాయ ఎమ్మెల్సీ సీటు తూర్పుకాపులకు కేటాయించాలి

ఎం.వి.పి.కాలనీ, న్యూస్‌టుడే: ఉపాధ్యాయుల ఎమ్మెల్సీ సీటును కూటమి అభ్యర్థిగా బీసీ తూర్పు కాపులకు కేటాయించాలని ఉత్తరాంధ్ర తూర్పు కాపు సంఘం అధ్యక్షులు గొర్లె శ్రీనివాసనాయుడు డిమాండ్ చేశారు. గత అసెంబ్లీ ఎన్నికల్లో ఉత్తరాంధ్రలో కూటమి కూర్పు సందర్భంగా తూర్పు కాపు సీటులను వేరే సామాజిక వర్గాలకు కేటాయించటంతో ఉత్తరాంధ్రలో రెండు సీట్లను కోల్పోయామని ఆవేదన వ్యక్తం చేశారు. సోమవారం తూర్పు కాపు సంఘం కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. తూర్పు కాపులకు సీటు కేటాయించే పార్టీలకు తమ మద్దతు ఉంటుందని పేర్కొన్నారు. సంఘం ప్రతినిధులు బలగ సుధాకర్, ఎల్.గణేష్, ఆర్.వెంకటరమణ, రమణ తదితరులు పాల్గొన్నారు.

హుండీ ఆదాయం లెక్కింపు

గురుద్వారా, న్యూస్‌టుడే: నక్కవానిపాలెం ఉమా నీలకంఠేశ్వరస్వామి ఆలయం హుండీ ఆదాయం లెక్కింపు సోమవారం ఉదయం జరిగింది. ఆలయ కార్యనిర్వహణాధికారి బండారు ప్రసాద్ పర్యవేక్షణలో జరిగిన కార్యక్రమంలో 165 రోజులకు గాను రూ. 3,15,943లు ఆదాయం వచ్చింది. ఇన్స్‌పెక్టర్ శ్రీధర్, ఆలయ సిబ్బంది, చంద్రశేఖర్, శ్రీవారి భక్త బృందం పాల్గొన్నారు.



హుండీ ఆదాయం లెక్కింపులో ఈఓ బండారు ప్రసాద్, శ్రీవారి భక్త బృందం

రైల్వే బాక్సింగ్ క్రీడాకారులకు అభినందన



పతక విజేతలతో తూర్పుకోస్తా రైల్వే జనరల్ మేనేజరు పరమేశ్వర్ తదితరులు

విశాఖ క్రీడలు, న్యూస్‌టుడే: విశాఖలో ఇటీవల జరిగిన అఖిలభారత అంతర్ రైల్వే బాక్సింగ్ పోటీల్లో పతకాలు గెలుపొందిన రైల్వే బాక్సర్లను సోమవారం తూర్పుకోస్తా రైల్వే జనరల్ మేనేజరు పరమేశ్వర్ భువనేశ్వర్‌లోని కార్యాలయంలో అభినందించారు. పురుషుల విభాగంలో రెండు రజతాలు, మహిళల విభాగంలో ఒక రజతం, ఒక కాంస్యం క్రీడాకారులు సాధించారు. ఈ సందర్భంగా జీఎం క్రీడాకారుల ప్రతిభను కొనియాడుతూ భవిష్యత్‌లో మరింత ప్రతిభ కనబరచాలని ఆకాంక్షించారు.

రహదారుల నిర్మాణానికి శంకుస్థాపన

పూర్ణమార్కెట్ (అల్లిపురం), న్యూస్‌టుడే: దక్షిణ నియోజకవర్గంలోని ప్రతి వార్డులో అభివృద్ధి పనులు చేపట్టనున్నట్లు ఎమ్మెల్యే వంశీకృష్ణ శ్రీనివాస్ పేర్కొన్నారు. 33, 35 వార్డుల్లో చేపట్టనున్న బీటీ రహదారులకు సోమవారం ఆయన శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గత ప్రభుత్వంలో నాణ్యమైన పనులు చేపట్టకపోవడం వల్లే రహదారులు గుంతలమయంగా మారినట్లు చెప్పారు. 33వ వార్డు అల్లిపురంలో రూ. 39.72లక్షలతో, 35వ వార్డులో రూ.1.26 కోట్లతో రహదారుల నిర్మాణం చేపట్టనున్నట్లు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో జెడ్పీ ఎం.మల్లయ్యనాయుడు, తెదేపా దక్షిణ నియోజకవర్గ బాధ్యుడు సీతంరాజు సుధాకర్, 33వ వార్డు కార్పొరేటర్ బీశెట్టి వసంతలక్ష్మి, 35వ వార్డు కార్పొరేటర్ విల్లూరి భాస్కరరావు, పలువురు కూటమి నాయకులు తదితరులు పాల్గొన్నారు.



శిలాఫలకాన్ని ఆవిష్కరించిన ఎమ్మెల్యే వంశీకృష్ణ శ్రీనివాస్, చిత్రంలో సీతంరాజు సుధాకర్ తదితరులు

మధురవాడ సంత తరలించవద్దు



మధురవాడ సంత తరలించవద్దని ఆందోళనలో పాల్గొన్న ప్రజా సంఘాల ప్రతినిధులు

కార్పొరేషన్, వన్‌టౌన్, న్యూస్‌టుడే: మధురవాడలో ఏళ్ల తరబడి నిర్వహిస్తున్న సంతను తరలించవద్దని సంత వర్తకులకు అన్యాయం చేయవద్దని సీఐటీయూ నాయకులు రాజ్‌కుమార్ అన్నారు. సంత తరలింపు నిర్ణయానికి వ్యతిరేకంగా సోమవారం జీవీఎంసీ గాంధీ విగ్రహం వద్ద ప్రజాసంఘాల ఆధ్వర్యంలో ఆందోళన నిర్వహించారు. సంత తరలించి పొట్టకొట్టవద్దని, రెండు వారాలుగా వర్తకులను ట్రాఫిక్ పోలీసులు, జీవీఎంసీ సిబ్బంది ఇబ్బందులకు గురిచేస్తున్నారన్నారు. పీఓడబ్ల్యూ లక్ష్మి మాట్లాడుతూ సంత తోనే ట్రాఫిక్‌కు ఇబ్బంది కలిగిందని భావించడం సరికాదని, మిగతా ప్రాంతాలలోనూ ఇదే విధంగా ట్రాఫిక్ సమస్య ఉందని, సంతతో ఎలాంటి ట్రాఫిక్ అవాంతరం లేదని పోలీసులకు తెలిసినా, దాడులు చేయడం సరికాదన్నారు. ఆందోళనలో ప్రజా సంఘాల నాయకులు డి.అప్పలరాజు, అరుణ, వెంకటేశ్వరరావు, ఫాతిమా, పైడికొండ తదితరులు పాల్గొన్నారు.

గాజువాక
• గాజువాక • విశాఖ పశ్చిమం

25, 26 తేదీల్లో టెక్నికల్ ఫెస్ట్

కూర్మన్నపాలెం, న్యూస్‌టుడే : విద్యార్థుల్లో దాగి ఉన్న సృజనాత్మకత వెలికి తీసేందుకు ఈనెల 25, 26 తేదీల్లో టెక్నికల్ ఫెస్ట్ నిర్వహిస్తామని విజ్ఞాన్ మహిళా ఇంజినీరింగ్ కళాశాల ప్రిన్సిపల్ బి.అరుంధతి అన్నారు. వివిధ కళాశాలల నుంచి హాజరయ్యే ఇంజినీరింగ్ విద్యార్థులు తయారు చేసే నూతన నమూనాలను ప్రదర్శనకు ఉంచుతామన్నారు. సోమవారం కళాశాలలో నిర్వహించిన కార్యక్రమంలో ఫెస్ట్ గోడపత్రిక ఆవిష్కరించారు. హ్యాక్‌థాన్, టెక్నికల్ క్విజ్, షార్ట్ ఫిల్మ్, కోడింగ్, ఫొటోగ్రఫీ తదితర అంశాలపై పోటీలు నిర్వహించి, విజేతలకు రూ.2 లక్షల నగదు బహుమతులు అందిస్తామన్నారు. కన్వీనర్ డి.వెంకటరమణ, ఈసీఈ విభాగాధిపతి వి.అవినాష్, ఇతర అధ్యాపకులు పాల్గొన్నారు.



అవార్డు అందుకుంటున్న మురళీధరరెడ్డి

లయన్స్ క్లబ్‌కు అవార్డులు

కూర్మన్నపాలెం: కూర్మన్నపాలెం లయన్స్‌క్లబ్ ఆధ్వర్యంలో పరిసర ప్రాంతాల్లో చేపట్టిన సేవా కార్యక్రమాలకు అవార్డులు దక్కాయని సోమవారం నిర్వాహకులు తెలిపారు. 2023-24 అవార్డుల ప్రదానోత్సవాన్ని నగరంలోని గ్రీన్‌పార్కు హోటల్లో నిర్వహించారు. ఈ సందర్భంగా క్లబ్ అధ్యక్షులు ఎ.మురళీధరరెడ్డికి లయన్స్ ఇంటర్నేషనల్ ప్రెసిడెంట్ మెడల్, ఉత్తమ ప్రెసిడెంట్ అవార్డు, సర్టిఫికేట్ అందించారు. కూర్మన్నపాలెం లయన్స్ క్లబ్ నుంచి రెండో ఉప డిస్ట్రిక్ట్ గవర్నర్‌గా కేవీ.సుబ్బరాజు ఎన్నుకున్నారు.

నిలువ నీడ లేక.. నడిరోడ్డుపై నిరీక్షణ..!

★ పారిశ్రామిక ప్రాంతంలో బస్‌షెల్టర్ల కొరత
★ నిత్యం ప్రయాణికులకు తప్పని అవస్థలు



మల్కాపురం బస్‌షెల్టర్ వద్ద నిలిపిన వాహనాలు

–న్యూస్‌టుడే, సింధియా

పారిశ్రామిక ప్రాంతంలోని ప్రధాన సేవా రహదారిపై అవసరమైన చోట బస్‌షెల్టర్లు లేకపోవడంతో నిత్యం బస్సులు, ఆటోల కోసం వేచి ఉండే వారు ఇబ్బందులు పడుతున్నారు. నివాస ప్రాంతాలతో పాటు, భారీ పరిశ్రమలు ఉండటంతో వందలాది మంది ఉద్యోగులు, కార్మికులు, విద్యార్థులు, వ్యాపారులు, సాధారణ ప్రయాణికులు తమ అవసరాల కోసం ప్రజా రవాణాపై ఆధారపడుతున్నారు.

రోజు ఉదయం, సాయంత్రం సమయంలో ప్రతి బస్‌స్టాపులో ప్రయాణికుల రద్దీ ఉంటోంది. జింక్ గేటు(హిమాచల్‌నగర్), గాజువాక డిపో, కోరమాండల్‌గేటు, శ్రీహరిపురం, ఆర్కేపురం, మల్కాపురం, నౌసేనాబాగ్, సింధియా-న్యూకాలనీ, సింధియా కూడలి, పైపులైన్ జంక్షన్, నేవల్ డాక్‌యార్డు వద్ద బస్‌స్టాపులు ఉన్నాయి. అయితే ఆయా స్టాపుల్లో కొన్నిచోట్ల షెల్టర్లు లేక... ప్రయాణికులు ఎండైనా, వానైనా నడిరోడ్డుపైనో, చెట్లనీడలోనో బస్సుల కోసం వేచి ఉండాల్సి వస్తోంది.

సమన్వయం లేకనే..: పారిశ్రామిక ప్రాంతంలో బస్‌స్టాపులు అంశం రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ పరిగణలోకి వస్తుంది. అదే బస్‌షెల్టర్లు నిర్మించాల్సిన బాధ్యత జీవీఎంసీ అధికారుల చేతుల్లో ఉంటుంది. ఈ రెండు శాఖల మధ్య సమన్వయం లేకపోవడంతోనే ఇలాంటి పరిస్థితి నెలకొందని పలువురు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. అవసరం లేని చోట నిర్మించిన షెల్టర్లను అనధికారికంగా ప్రైవేట్ వ్యక్తులు తమ వాహనాల పార్కింగ్‌కు వినియోగించుకుంటున్నారు.



గాజువాక డిపో వద్ద షెల్టర్ లేక చెట్టునీడలో ప్రయాణికులు



ప్రతిపాదనలు పంపిస్తాం..: గాజువాక డిపో పరిధి బస్‌స్టాపుల్లో షెల్టర్లు లేని వాటిని గుర్తిస్తాం. అవసరమైన చోట షెల్టర్ల నిర్మాణానికి నివేదిక తయారు చేయించి, ఉన్నతాధికారులకు ప్రతిపాదనలు పంపిస్తాం. పరిశ్రమల భాగస్వామ్యంతో షెల్టర్ల నిర్మాణానికి కృషి చేస్తాం.
–ప్రవీణ, గాజువాక డిపో మేనేజర్

ఇదీ లెక్క (సుమారుగా...)						
	నిత్యం తిరిగే బస్సులు 120	ఆటోల సంఖ్య 480	గాజువాక-డాక్‌యార్డు మార్గంలో బస్‌స్టాపులు 12	బస్ షెల్టర్లు 5	డాక్‌యార్డు-గాజువాక మార్గంలో బస్‌స్టాపులు 11	బస్ షెల్టర్లు 7

ఆక్రమణలకు అడ్డేది..!

గ్రీన్‌బెల్ట్ స్థలాల్లో పచ్చదనం మాయం

–న్యూస్‌టుడే, ఎన్‌ఏడీకూడలి(కాకానినగర్)

జాతీయ రహదారికి ఇరువైపులా ఉన్న గ్రీన్‌బెల్ట్ స్థలం ఆక్రమణలకు గురవుతున్నా... సంబంధిత అధికారులు పట్టించుకోవడం లేదని పలువురు ఆరోపిస్తున్నారు. ప్రధానంగా విశాఖపట్నం అంతర్జాతీయ విమానాశ్రయం కూడలి నుంచి ఎన్‌ఏడీకూడలి పైవంతెన వరకు ఉన్న గ్రీన్‌బెల్ట్‌లో ఆక్రమణలు ఎక్కువయ్యాయి.



నిర్మించిన సీసీరోడ్డు

★ జీవీఎంసీ 90వ వార్డు విమాన్‌నగర్ బస్‌స్టాపు నుంచి కాకానినగర్ సిగ్నల్ పాయింట్ వరకు ఉన్న స్థలాన్ని కొందరు ఆక్రమించి, అల్పాహార దుకాణాలకు అద్దెకు ఇస్తున్నారు. ఆయా దుకాణాల వద్దకు వచ్చే వినియోగదారులు తమ వాహనాలను జాతీయ రహదారిపై నిలిపి ఉంచడంతో తరచూ ట్రాఫిక్ స్తంభిస్తుంది.



అల్పాహార దుకాణం ఏర్పాటు

★ కొన్నిచోట్ల గ్రీన్‌బెల్ట్ రక్షణకు ఏర్పాటు చేసిన ఇనుప కంచెల్ని, మొక్కల్ని తొలగించేసి, సిమెంట్‌తో చదును చేశారు. ఇంత జరుగుతున్నా.. జీవీఎంసీ, హైవే అథారిటీ అధికారులు కన్నెత్తి చూడడం లేదు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి గ్రీన్‌బెల్ట్ పరిరక్షణకు చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.

మేమున్నాం.. మీకు తోడుగా

సమయం: ఉ॥ 10 నుంచి మ॥ ఒంటి గంట మధ్య
గాజువాక: 98494 65088
పశ్చిమం (గోపాలపట్నం): 95428 96869

న్యూస్‌టుడే, గోపాలపట్నం, సింధియా

సమస్య: జీవీఎంసీ 90వ వార్డు సీతారామరాజునగర్ 80 అడుగుల రహదారి ఇరువైపులా ఆక్రమణకు గురవడంతో రాకపోకలకు ఇబ్బందులు ఎదురవుతున్నాయి.
– ఎల్.సత్యనారాయణ, బుచ్చిరాజుపాలెం
సమాధానం: ఆక్రమణల అంశాన్ని పట్టణ ప్రణాళిక అధికారుల దృష్టికి తీసుకెళ్తాం.
–బి.రమణ, వార్డు కార్పొరేటర్.

సమస్య : గాజువాక డిపో బస్‌స్టాపు వద్ద మంచినీటి సంపు లీకవుతోంది. నిత్యం నీరు వృథా అవుతున్నా ఎవరూ పట్టించుకోవడం లేదు.
– పి.ఆనంద్‌కుమార్, గాజువాక డిపో
సమాధనం : సిబ్బందిని పంపి సంపు వాల్వుకు మరమ్మతులు చేయిస్తాం.
– రామరాజు, తాగునీటి విభాగం సిబ్బంది

మహాదుర్గా... మనసాస్మరామీ..!



అగనంపూడిలో...



తుంగ్లాంలో..



ఎల్వీనగర్‌లో..




డ్రైవర్స్‌కాలనీలో..



పంతులుగారి మేడ వద్ద



సాగరగిరిపై..



మల్కాపురం రైల్వేక్వార్టర్స్‌లో..



వాంబేకాలనీలో..



చినగంట్యాడలో..



అక్కిరెడ్డిపాలెంలో..



వడ్లపూడిలో..

దసరా శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా సోమవారం గాజువాక, పశ్చిమం నియోజకవర్గాల్లోని ఆలయాలు, మండపాల్లో కనకదుర్గ అమ్మవారు వివిధ రూపాల్లో భక్తులకు దర్శనమిచ్చారు. మహిళలు సామూహిక కుంకుమార్చనలు, విశేష పూజలు చేశారు. కొన్నిచోట్ల అన్నసమారాధన కార్యక్రమాలు ఏర్పాటు చేసి, అమ్మవారి సారె ఊరేగించారు. ఆయా పార్టీల నాయకులు అమ్మవార్లను దర్శించుకున్నారు. మండపాల వద్ద ఏర్పాటు చేసిన ఆధ్యాత్మిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. ఆలయ కమిటీ ప్రతినిధులు ఏర్పాట్లను పర్యవేక్షించారు.
–న్యూస్‌టుడే, గాజువాక, విశాఖ పశ్చిమం బృందం



హౌసింగ్‌బోర్డు కాలనీలో..



హైస్కూల్‌రోడ్డులో...



కాపు తుంగ్లాంలో అన్నసమారాధన



శాతవాహననగర్‌లో...



దుర్గానగర్‌లో..



బాపూజీనగర్‌లో...

సంక్షిప్త సమాచారం..

● నేడు నీటి సరఫరా నిలిపివేత

కూర్మన్నపాలెం, న్యూస్‌టుడే : కూర్మన్నపాలెం సమీప సిద్ధార్థనగర్ నీటి శుద్ధి ప్లాంట్ నిర్వహణ నిమిత్తం మంగళవారం నీటి సరఫరా నిలిపివేస్తామని సోమవారం జోన్-6 నీటి సరఫరా విభాగం ఏఈ కిశోర్‌కుమార్ తెలిపారు. జీవీఎంసీ 86, 87 వార్డుల పరిధిలోని పలు కాలనీలకు నీటి సరఫరాలో అంతరాయం ఉంటుందన్నారు.

● ధరల నియంత్రణపై దృష్టి

కరాస, న్యూస్‌టుడే : ఉల్లిపాయ, టమాటా ధరల నియంత్రణపై దృష్టి సారించామని జిల్లా వ్యవసాయ, వాణిజ్య, మార్కెటింగ్ శాఖ అధికారి యాసిన్ తెలిపారు. సోమవారం ఉదయం ఆయన మర్రిపాలెం రైతుబజారును సందర్శించి ధరల పట్టిక పరిశీలించారు. బహిరంగ మార్కెట్‌లో కన్నా రైతుబజారులో తక్కువ ధరలకే కూరగాయలు లభిస్తున్నాయని, ప్రతి ఒక్కరూ బజార్లను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఎస్టేట్ అధికారి వరహాలు, సిబ్బంది ప్రతాప్ పాల్గొన్నారు.

● 10న రథోత్సవానికి ఏర్పాట్లు



సింధియా (జవహర్‌నగర్), న్యూస్‌టుడే : శరన్నవరాత్రి ఉత్సవాల సందర్భంగా ఈనెల 10న గాజువాక డిపో సమీప ఏకశిల గుడి వద్ద ఉన్న విజయ దుర్గ ఆలయంలో రథోత్సవానికి ఏర్పాట్లు చేస్తున్నామని ఆలయ కమిటీ ఛైర్మన్ పిళ్లా శంకర్రావు తెలిపారు. రూ.5 లక్షలు ఖర్చు చేసి టేకు కలపతో నర్సీపట్నంలో రథాన్ని తయారు చేయించామన్నారు. సోమవారం ఉదయం ఆలయ ఆవరణలో రథానికి పూజలు చేశారు.

● 76వ వార్డులో వైద్య శిబిరం

పెదగంట్యాడ, న్యూస్‌టుడే : సామాజిక సేవల్లో భాగంగా సోమవారం 76వ వార్డు హౌసింగ్‌బోర్డుకాలనీ వాటర్ ట్యాంక్ రోడ్డులో 'హెచ్ ప్లస్ క్లినిక్' ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. డాక్టర్ హారిక నేతృత్వంలో వైద్య పరీక్షలు చేసి, మందులు పంపిణీ చేశారు. ఉక్కు నిర్వాసిత కాలనీ సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు.

● 50 కిలోల గంజాయి స్వాధీనం

కూర్మన్నపాలెం, న్యూస్‌టుడే : ఇంట్లో నిల్వ ఉంచిన 50 కిలోల గంజాయిని సోమవారం టాస్క్‌ఫోర్స్ అధికారులు, దువ్వాడ పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ఆ వివరాలు... విశాఖ ఏజెన్సీ నుంచి తీసుకొచ్చిన సరకును 86వ వార్డు రాజీవ్‌నగర్‌లోని అద్దె ఇంట్లో భద్రపరిచినట్టు సమాచారం అందడంతో పోలీసులు దాడులు చేశారు. రూ.2.5లక్షల విలువైన సరకు స్వాధీనం చేసుకుని, 8 మంది నిందితుల్ని అదుపులోకి తీసుకున్నట్టు సీఐ మల్లేశ్వరరావు తెలిపారు.

పారిశుద్ధ్య కార్మికుల్ని గౌరవించాలి: పల్లా



దుస్తులు పంపిణీ చేస్తున్న తెదేపా రాష్ట్ర అధ్యక్షుడు పల్లా, తదితరులు

గాజువాక, న్యూస్‌టుడే : పట్టణ పరిశుభ్రతలో ప్రధాన భూమిక పోషిస్తున్న పారిశుద్ధ్య కార్మికుల్ని ప్రతి ఒక్కరూ గౌరవించాలని తెదేపా రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు అన్నారు. సోమవారం జోనల్ కార్యాలయంలో ప్రజారోగ్య విభాగం ఆధ్వర్యంలో పారిశుద్ధ్య కార్మికులకు దుస్తులు పంపిణీ చేశారు. స్వచ్ఛసర్వేక్షణ్, స్వచ్ఛతా హీ సేవా కార్యక్రమాల ద్వారా నగరానికి గుర్తింపు తీసుకురావడంలో కార్మికుల పాత్ర కీలకమన్నారు. కార్యక్రమానికి జెడ్సీ శేషాద్రి అధ్యక్షత వహించారు. ఆయా వార్డుల కార్పొరేటర్లు, తెదేపా నాయకులు, ఏఎంఓహెచ్ డాక్టర్ కిరణ్‌కుమార్, జోన్-6 పారిశుద్ధ్య సూపర్‌వైజర్ రామారావు తదితరులు పాల్గొన్నారు.

గృహాలు అప్పగించాలని డిమాండ్

పెదగంట్యాడ, న్యూస్‌టుడే : తక్షణమే టిడ్కో గృహాలు అప్పగించాలని లబ్ధిదారులు డిమాండ్ చేశారు. పెదగంట్యాడ, బాజీతోటలో నిర్మించిన గృహాలకు సంబంధించిన లబ్ధిదారులు సోమవారం చలో కలెక్టరేట్ కార్యక్రమం నిర్వహించారు. గృహాల వద్ద ఎంపిక పత్రాలు, ప్లకార్డులు ప్రదర్శించి ధర్నా చేశారు. అనంతరం ర్యాలీగా కలెక్టరేట్‌కు వెళ్లారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... 2017, 2019లో లబ్ధిదారులను ఎంపిక చేసి, రూ.50 వేలు, రూ.లక్ష డీడీలు కట్టించుకున్నారని, ఏళ్లు గడిచిపోతున్నా నేటికీ ఇళ్లు కేటాయించలేదన్నారు. ప్రతి నెలా బ్యాంకు రుణం చెల్లించడం భారంగా ఉందని, వెంటనే ఇళ్లు అప్పగించాలని డిమాండ్ చేశారు.



నినాదాలు చేస్తున్న టిడ్కో లబ్ధిదారులు

కేంద్ర ప్రభుత్వ పథకాలపై ప్రచారం

ఎన్‌ఏడీకూడలి, న్యూస్‌టుడే : కేంద్ర ప్రభుత్వ పథకాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని భాజపా నాయకుడు కాశీ విశ్వనాథరాజు అన్నారు. సోమవారం గోపాలపట్నం పరిసర ప్రాంతాల్లో పశ్చిమ కన్వీనర్ దాడి పురుషోత్తమ్ ఆధ్వర్యంలో పథకాలపై ప్రచారం చేసి, పార్టీ సభ్యత్వ నమోదు కార్యక్రమం నిర్వహించారు. ఈనెల 15 వరకు జరిగే సభ్యత్వ నమోదులో పలువుర్ని భాగస్వాములు చేయాలని పార్టీ శ్రేణులకు సూచించారు. పార్టీ నాయకులు జి.అప్పలరాజు, మాధవిలత, వి.శ్రీనివాసరావు, శ్యామ్, సంతోష్‌కుమార్, సత్యనారాయణ, కామేశ్ తదితరులు పాల్గొన్నారు.



గోపాలపట్నంలో వివరాలు నమోదు చేస్తున్న భాజపా నాయకులు

గాజువాక(హైస్కూల్‌రోడ్డు), న్యూస్‌టుడే: భాజపా గాజువాక కన్వీనర్ కరణంరెడ్డి నర్సింగరావు ఆధ్వర్యంలో సోమవారం 67వ వార్డు హైస్కూల్‌రోడ్డు, బొజ్జన్నకొండ ప్రాంతాల్లో సభ్యత్వ నమోదు కార్యక్రమం నిర్వహించారు. నాయకులు నాగేశ్వరరావు, దిలీప్, మనోహర్, రామస్వామి తదితరులు పాల్గొన్నారు.

కార్మిక యోధునికి నివాళి

ఉక్కునగరం(స్టీల్ సెక్టారు-3), న్యూస్‌టుడే : కార్మికుల హక్కుల కోసం ఎన్నో పోరాటాలు చేసిన గయాసింగ్ సేవలు మరువలేనివని ఉక్కు గుర్తింపు సంఘం నాయకులు అన్నారు. గయాసింగ్ వర్ధంతిని పురస్కరించుకుని సోమవారం సంఘం కార్యాలయంలో కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా గయాసింగ్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. సంఘం ప్రధాన కార్యదర్శి డి.ఆదినారాయణ, సభ్యులు కె.ఎస్.ఎన్.రావు, కె.రాజబాబు, టి.కనకరాజు, జి.జయ, డి.నర్సింగరావు, జి.రాజు పాల్గొన్నారు.



గయాసింగ్ చిత్రపటానికి నివాళి అర్పిస్తున్న ఏఐటీయూసీ నాయకులు



తరగతులు పరిశీలిస్తున్న కాలేషాబేగం

వృత్తి విద్యాకోర్సులతో ఉపాధి

గోపాలపట్నం: వృత్తి విద్యా కోర్సులతో ఉపాధి అవకాశాలు దక్కుతాయని జిల్లా బాలికా సంరక్షణ అధికారిణి కలేషా బేగం అన్నారు. గోపాలపట్నం జిల్లా పరిషత్ బాలికోన్నత పాఠశాలలో సమగ్ర శిక్ష అభియాన్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న వృత్తి విద్యాకోర్సుల బోధన తరగతులను ఆమె సోమవారం పరిశీలించారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ఆదేశాలతో పాఠశాల దశ నుంచే పిల్లలకు నైపుణ్యాలు పెంపొందిస్తున్నామన్నారు. కార్యక్రమంలో ఒకేషనల్ ట్రైనర్, విద్యార్థులు పాల్గొన్నారు.

సేవలు మరువలేనివి

కూర్మన్నపాలెం(దువ్వాడ), న్యూస్‌టుడే : తెదేపా ఆవిర్భావం నుంచి పార్టీ బలోపేతానికి పని చేసిన వెదుళ్లనరవ మాజీ సర్పంచి సరిపల్లి పైడిరాజు సేవలు మరువలేనివని తెదేపా రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు అన్నారు. సోమవారం వెదుళ్లనరవలో పైడిరాజు సంస్మరణ సభ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో బండారు సత్యనారాయణ మూర్తి, పంచకర్ల రమేష్‌బాబు, కార్పొరేటర్లు మొల్లి ముత్యాలనాయుడు, బొండా జగన్ తదితరులు పాల్గొని పైడిరాజుకు నివాళి అర్పించారు.



పైడిరాజు చిత్రపటానికి నివాళి అర్పిస్తున్న ఎమ్మెల్యే పల్లా, తదితరులు

గాజువాక సినిమాలు

కన్య, శ్రీకన్య: దేవర
ఆదిత్య (పెదగంట్యాడ), అన్నపూర్ణ (కూర్మన్నపాలెం), మినీ మోహిని: జోకర్
హెవెన్: దక్షిణ,
మోహిని 70ఎం.ఎం: కలి
మోహిని-35: మత్తు వదలరా-2
లక్ష్మీకాంత్: శ్వాగ్,
లక్ష్మి: సత్యం సుందరం
విశేష్: రామ్‌నగర్ బన్నీ

● 10న ఉక్కులో ధర్నా

ఉక్కునగరం(స్టీల్ సెక్టారు-3), న్యూస్‌టుడే : ఉక్కులో విద్యుత్తు ఛార్జీల పెంపు, ఇంటి అద్దె చెల్లింపు వంటి సమస్యల పరిష్కారం కోరుతూ ఈనెల 10న ధర్నా నిర్వహిస్తామని ఐఎన్‌టీయూసీ ప్రధాన కార్యదర్శి ఎం.రాజశేఖర్ తెలిపారు. సోమవారం ప్రధాన పరిపాలన భవనం వద్ద కార్మికులు చేపట్టిన నిరసనలో ఆయన మాట్లాడారు. కార్మిక సమస్యల పరిష్కారానికి యాజమాన్యం చిత్తశుద్ధితో పని చేయాలని కోరారు. కార్మిక సంఘాల సభ్యులు పి.వి.రమణమూర్తి, బి.అప్పారావు, జి.నరేంద్ర, పి.పెంటారావు తదితరులు పాల్గొన్నారు.

● రైతు బజార్లలో రూ.50కే కిలో టమోటా

వన్‌టౌన్, న్యూస్‌టుడే: జిల్లాలోని అన్ని రైతు బజార్లలో ఈనెల 8 తేదీ మంగళవారం నుంచి రాష్ట్ర ప్రభుత్వం, మార్కెటింగ్ శాఖ ఆధ్వర్యంలో రాయితీపై కిలో టమోటా రూ.50కే విక్రయించనున్నట్లు జేసీ మయూర్ అశోక్ సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఒక్కో కుటుంబానికి కిలో మాత్రమే అమ్మనున్నారు. వినియోగదారులు ఆధార్ లేదా రేషన్ కార్డును కౌంటర్ నందు చూపించాలని ప్రకటనలో పేర్కొన్నారు.

● సమస్యల్ని పరిష్కరిస్తాం : ఏఐటీయూసీ

ఉక్కునగరం(స్టీల్ సెక్టారు-3), న్యూస్‌టుడే : ఉక్కు కార్మికులు ఎదుర్కొంటున్న ఇంటి అద్దె చెల్లింపు, విద్యుత్తు ఛార్జీల పెంపు సమస్యల పరిష్కారానికి గుర్తింపు సంఘం (ఏఐటీయూసీ) చిత్తశుద్ధితో పని చేస్తుందని సంఘం అధ్యక్షులు కె.ఎస్.ఎన్.రావు సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఆయా సమస్యలపై ఇప్పటికే పలు మార్లు అధికారులకు వినతులు ఇచ్చామన్నారు. కొన్ని అంశాలపై కోర్టులను ఆశ్రయించగా, తీర్పులు పెండింగ్‌లో ఉన్నాయన్నారు. పెండింగ్‌లో ఉన్న సమస్యలు పరిష్కరించకుండా... యజమాన్యం పే రోల్స్ విడుదల చేయడం సరికాదన్నారు. ఆయా సమస్య పరిష్కారానికి అందరి మద్దతుతో పోరాటాలు చేస్తామన్నారు.

సామాజిక సేవలు విస్తృతం

గాజువాక, న్యూస్‌టుడే : సామాజిక సేవలు విస్తృతం చేసేందుకు మానవతా స్వచ్ఛంద సంస్థ పని చేస్తుందని సభ్యులు తెలిపారు. సంస్థ వార్షికోత్సవం సందర్భంగా సోమవారం జిల్లా పర్యవేక్షక కమిటీ ఆధ్వర్యంలో గాజువాకలో దివ్యాంగులకు చక్రాల కుర్చీలు, పేదలకు నిత్యావసరాలు పంపిణీ చేశారు. అనంతరం గాజువాక యూనిట్ ఛైర్మన్‌గా సుంకరనారాయణ, అధ్యక్షుడిగా వెన్నెల ఈశ్వరరావు, విశాఖ ఉమ్మడి జిల్లా అధ్యక్షుడిగా దీనంకొండ కృష్ణంరాజు ప్రమాణ స్వీకారం చేశారు. ఆధ్యాత్మికవేత్త ఎస్.రామచంద్రారెడ్డి, ఇతర సభ్యులు పాల్గొన్నారు.



సరకులు అందిస్తున్న కార్మికులు, నాయకులు



వితరణ కార్యక్రమంలో మానవతా ప్రతినిధులు

అగనంపూడి: అగనంపూడి పరిధిలోని రెండు నిరుపేద కుటుంబాలకు సాయం అందించడానికి సోమవారం స్వచ్ఛంద సంఘాలు ముందుకొచ్చాయి. ఉక్కు బ్యాటరీ ఫోర్ హెల్పింగ్ హ్యాండ్స్ ప్రతినిధులు ఎస్.సన్యాసిరెడ్డి, కోన.రమణ, స్థానిక నాయకుడు బలిరెడ్డి శ్రీను ఆధ్వర్యంలో దివ్యాంగురాలి కుటుంబానికి నెలకు సరిపడా నిత్యావసరాలు అందించారు.

★ ఇంటి పెద్ద మృతితో ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్న మరో బాధిత కుటుంబానికి పెదమడక శ్రీ పద్మ మార్కండేయ సేవా సంఘం ఆధ్వర్యంలో నిత్యావసర సరకులు అందించారు. సంఘం ప్రతినిధులు కొలిపాక అప్పారావు, జి.పైడికొండ పాల్గొన్నారు.

అభివృద్ధి పనులకు శంకుస్థాపన

గోపాలపట్నం, ఎన్‌ఏడీకూడలి, న్యూస్‌టుడే : జీవీఎంసీ 89వ వార్డు చంద్రనగర్‌లో సుమారు రూ.16.37 లక్షల జీవీఎంసీ నిధులతో చేపట్టే అభివృద్ధి పనులకు సోమవారం వార్డు కార్పొరేటర్ దాడి వెంకటరమేశ్ శంకుస్థాపన చేశారు. అనంతరం ఆయన వార్డులో పర్యటించి ప్రజాసమస్యలు అడిగి తెలుసుకున్నారు. వార్డు తెదేపా నాయకులు ఎం.ప్రదీప్, డి.సురేశ్, ప్రజా పనుల విభాగం ఏఈ వెంకటలక్ష్మి పాల్గొన్నారు.

★ జీవీఎంసీ 90వ వార్డు బుచ్చిరాజుపాలెంలో రూ.19.50 లక్షల జీవీఎంసీ నిధులతో చేపట్టే అభివృద్ధి పనులకు వార్డు కార్పొరేటర్ బొమ్మిడి రమణ శంకుస్థాపన చేపట్టారు. అనంతరం ఆయన లక్ష్మీనగర్ ఎఫ్-బ్లాక్‌లో పర్యటించి కూలిన విద్యుత్తు స్తంభాలను పరిశీలించారు. త్వరితగతిన పునరుద్ధరణ పనులు చేపట్టాలని సిబ్బందికి సూచించారు.



శంకుస్థాపనలో పాల్గొన్న కార్పొరేటర్ రమణ, తదితరులు



శాంతినగర్‌కాలనీలో పనులు పరిశీలిస్తున్న కార్పొరేటర్ రౌతు శ్రీనివాస్

అగనంపూడి, న్యూస్‌టుడే : అగనంపూడి పరిధి శాంతినగర్ కాలనీలో జరుగుతున్న అభివృద్ధి పనులను సోమవారం 79వ వార్డు కార్పొరేటర్ రౌతు శ్రీనివాస్ పరిశీలించారు. నాణ్యతా ప్రమాణాలకు పెద్దపీట వేస్తూ, త్వరితగతిన పనులు పూర్తి చేయాలని గుత్తేదారుకు సూచించారు. ఆయన వెంట తెదేపా నాయకులు సింగిడి సింహాచలం, వెంకట్రావు, త్రినాథరావు ఉన్నారు.